సోమవారం
14•10•2019
కరీంనగర్
• వెల. రూ. 6.50
• సంపుటి 9 • సంచిక 109
• పేజీలు : 14 + 16

# నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక
WWW. NTNEWS.COM
/NTDAILYONLINE
PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD




epaper.ntnews.com

# ముగిసిన నిందితుల కస్టడీ

- ఐఎంఎస్ స్కాంలో కీలక వివరాలను రాబట్టిన ఏసీబీ అధికారులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఐఎంఎస్ మందుల కుంభకోణంలో నలుగురు నిందితుల రెండురోజుల ఏసీబీ కస్టడీ ఆదివారం సాయంత్రంతో ముగిసింది. ఈ కుంభకోణంలో కొత్త విషయాలను వెలుగులోకి తెస్తున్న ఏసీబీ అధికారులు తాజాగా సీనియర్ అసిస్టెంట్ ముదిమెల సురేంద్రనాథ్‌బాబు, లైఫ్ కేర్ డ్రగ్స్ అండ్ ఫార్మాస్యూటికల్స్ సంస్థ ఎండీ బద్దం సుధాకర్‌రెడ్డి, బాలానగర్‌లోని వెంకటేశ్వర హెల్త్‌సెంటర్ నిర్వాహకుడు డాక్టర్ చెరుకు అరవింద్‌రెడ్డి, నాచారం ఈఎస్ఐ దవాఖాన ఫార్మసిస్టు కొడాలి నాగలక్ష్మిని మరోసారి విడివిడిగా ప్రశ్నించి పలు కీలక వివరాలను రాబట్టినట్టు తెలిసింది. బంజారాహిల్స్‌లోని ఏసీబీ కార్యాలయంలో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రశ్నించారు. అనంతరం వారిని చంచల్‌గూడ జైలుకు తరలించారు. ఈ కేసులో అరెస్టయిన మరికొందరిని విచారిస్తే మరిన్ని వివరాలు తెలుస్తాయని ఏసీబీ అధికారులు భావిస్తున్నారు.

# ఏకంగా నగల దుకాణానికి వెళ్లి..

## ఏసీబీకి అడ్డంగా దొరికిపోయిన డ్రగ్ ఇన్‌స్పెక్టర్ బొమ్మిశెట్టి లక్ష్మి

## వెలుగులోకి స్పై ఆపరేషన్ వీడియో

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** బోయిన్‌పల్లిలోని జాహ్నవి వాలంటరీ బ్లడ్ బ్యాంకుకు అనుకూలంగా నివేదిక ఇచ్చేందుకు లంచంగా రూ.50 వేలతోపాటు బంగారు నెక్లెస్‌ను డిమాండ్ చేసిన హైదరాబాద్, సికింద్రాబాద్ ఇంచార్జి డ్రగ్ ఇన్‌స్పెక్టర్ బొమ్మిశెట్టి లక్ష్మిని ఆ బ్లడ్ బ్యాంక్ నిర్వాహకులు స్పై ఆపరేషన్‌తో పక్కాగా అవినీతి నిరోధకశాఖకు (ఏసీబీకి) పట్టించిన వీడియో ఇప్పుడు వెలుగులోకి వచ్చింది. తాను కోరుకున్న నగ కోసం లక్ష్మి.. ఆ బ్లడ్‌బ్యాంక్‌కు చెందిన లక్ష్మిరెడ్డి వెంట నగల దుకాణానికి వెళ్లి సదరు నగను కొనుగోలుచేసిన దృశ్యమంతా వీడియోలో రికార్డయింది. దీంతో ఏసీబీ అధికారులు శనివారం లక్ష్మిని అరెస్టు చేసిన విషయం తెలిసిందే.

# నాలుగు రోజుల్లో తేలికపాటి వర్షాలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ / హైదరాబాద్ సిటీబ్యూరో:** రాగల నాలుగు రోజుల్లో రాష్ట్రంలో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నది. ఉత్తర కోస్తాంధ్ర పరిసర ప్రాంతాల్లో ఏర్పడిన ఉపరితల ఆవర్తన ప్రభావంతో రాగల నాలుగు రోజుల్లో తెలంగాణ వ్యాప్తంగా తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశమున్నట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. మరికొన్నిచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడొచ్చని వారు పేర్కొన్నారు.

**గ్రేటర్ హైదరాబాద్‌లో..**

ఉపరితల ఆవర్తనానికి తోడు క్యుములోనింబస్ మేఘాల ప్రభావంతో ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం 7 వరకు హైదరాబాద్ గోల్కొండలో అత్యధికంగా 2.2 సెం.మీలు, మూసాపేటలో 2.0 సెం.మీ., శేరిలింగంపల్లి పరిధిలో 1.9 సెం.మీలు, ఖైరతాబాద్‌లో 1.8సెం.మీల చొప్పున వర్షపాతం నమోదైనట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. కాగా మరో నాలుగు రోజుల్లో గ్రేటర్ హైదరాబాద్‌లోని పలు చోట్ల తేలికపాటి నుంచి ఓ మోస్తరు, మరికొన్ని చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశమున్నట్టు వారు పేర్కొన్నారు. ఖమ్మం నగరంతోపాటు కూసుమంచి, తిరుమలాయపాలెం, ఖమ్మం రూరల్, నేలకొండపల్లి, మధిర, వైరా, సత్తుపల్లి తదితర మండలాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. జిల్లా వ్యాప్తంగా సరాసరి 2.3 సెం.మీ. వర్షపాతం నమోదైంది.







కుమ్రంభీం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి. చిత్రంలో కుమ్రంభీం మనుమడు సోనేరావు కూడా ఉన్నారు.
కుమ్రంభీం వర్ధంతి సభకు వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చిన గిరిజనులు

# ఆదివాసీల అభివృద్ధికి ప్రత్యేక కృషి

- కుమ్రంభీం వర్ధంతి సభలో మంత్రి అల్లోల
- జోడేఘాట్‌కు వేల సంఖ్యలో తరలివచ్చిన గిరిజనులు

**కుమ్రంభీం ఆసిఫాబాద్ ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** ఆదివాసులను అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నదని అటవీ, దేవాదాయశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి చెప్పారు. జోడేఘాట్‌ను సీఎం కేసీఆర్ రూ.25 కోట్లతో ఊహించని విధంగా అభివృద్ధి చేశారని గుర్తుచేశారు. ఆదివాసుల సంస్కృతి సంప్రదాయాలను గౌరవిస్తూనే.. ఈ ప్రాంతానికి ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారని కొనియాడారు. ఆదివారం కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా జోడేఘాట్‌లో నిర్వహించిన కుమ్రంభీం 79వ వర్ధంతి సభలో ఆయన పాల్గొన్నారు. ఎంపీ సోయం బాపురావు, మాజీ మంత్రి, ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న, ఎమ్మెల్యే ఆత్రం సక్కు, ఆసిఫాబాద్ జెడ్పీ అధ్యక్షురాలు కోవ లక్ష్మి, జెడ్పీ ఉపాధ్యక్షుడు కోనేరు కృష్ణారావు, ఆదిలాబాద్ జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, మాజీ ఎంపీ గొడాం నగేశ్, ఆసిఫాబాద్ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, ఐటీడీఏ పీవో కృష్ణాదిత్య, ఎస్పీ మల్లారెడ్డితో కలిసి కుమ్రంభీం విగ్రహానికి మంత్రి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో ఇంద్రకరణ్‌రెడ్డి మాట్లాడుతూ.. జోడేఘాట్‌లో త్వరలో డబుల్ బెడ్‌రూం ఇండ్లను నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. పోడు పట్టాలు పొందిన గిరిజనులకు రైతుబంధు, రైతుబీమా పథకాలను పూర్తిస్థాయిలో అమలుచేస్తున్నట్టు తెలిపారు. వివాదాల కారణంగా ఇంకా మిగిలిపోయిన పోడు రైతులకు కూడా త్వరలో పట్టాలు అందజేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఆదివాసులు అడవులను రక్షించాలని కోరారు. త్వరలో ఐటీడీఏ పాలకవర్గసమావేశాన్ని ఏర్పాటుచేసి సమస్యలపై చర్చించి పరిష్కరిస్తామని మంత్రి చెప్పారు.

**ప్రత్యేక ఆకర్షణగా స్టాళ్లు**

తెలంగాణతోపాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి గిరిజనులు వేల మంది తరలివచ్చి జోడేఘాట్‌లో కుమ్రంభీం విగ్రహానికి ఘనంగా నివాళులర్పించారు. భీం మనుమడు సోనేరావ్.. కుటుంబసభ్యులు, గ్రామపెద్దలు, ఆదివాసీ నాయకులతో కలిసి స్మారక చిహ్నానికి ఎదురుగా తమ దేవతలకు ప్రతీకలుగా భావించే మూడు జెండాలను ఆవిష్కరించారు. భీం సమాధి వద్ద, పెర్సాపేన్, అవ్వాల్‌పేన్ దేవుళ్లకు పూజలు చేశారు. కుమ్రం సూరు 22వ వర్ధంతి సందర్భంగా సూరు మనుమడు కుమ్రం పాండు ఆధ్వర్యంలో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ఇతర ప్రతినిధులు, అధికారులు నివాళులర్పించారు. జేఎన్టీయూ ఫైన్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో చిత్రాల ప్రదర్శన, వైద్య, రక్తదాన శిబిరం, గిరిజన సంక్షేమశాఖ స్టాళ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఐటీడీఏ ద్వారా మంజూరైన ఎడ్ల బండ్లను, ఎడ్ల జతలను, వాహనాలను పదిమంది ఆదివాసులకు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. జోడేఘాట్‌తోపాటు హట్టి వరకు భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటుచేశారు. ఆర్టీసీ సమ్మె ఉన్నప్పటికీ హట్టి నుంచి జోడేఘాట్ వరకు ప్రత్యేక బస్సులు నడిపించారు.

# చురుకుగా ఖనిజాల అన్వేషణ

- దూసుకుపోతున్న తెలంగాణ రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ
- మూడు జిల్లాల్లోని 8 క్లస్టర్లలో సున్నపురాయి గుర్తింపు పనులు
- ఇప్పటికే జార్ఖండ్, ఒడిశాలో సున్నపురాయి నిక్షేపాలపై నివేదిక
- ఆర్థికంగా బలోపేతంపై దృష్టిసారించిన టీఎస్ఎండీసీ



ఖనిజాలను గుర్తించే పనిలో నిమగ్నమైన తెలంగాణ ఖనిజాభివృద్ధి సంస్థ సిబ్బంది




తెలంగాణలోని మూడు జిల్లాల్లో సున్నపురాయి నిక్షేపాలను గుర్తించిన టీఎస్ఎండీసీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఖనిజాలను అన్వేషించడంలో తెలంగాణ రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ (టీఎస్ఎండీసీ) చురుకుగా పనిచేస్తున్నది. గతంలో రాష్ట్ర గనులశాఖ మంత్రిగా ఉన్న సమయంలో కే తారకరామారావు చేసిన సూచనల మేరకు ఇసుక తవ్వకాలకే పరిమితం కాకుండా సున్నపురాయి నిక్షేపాల అన్వేషణ కూడా టీఎస్ఎండీసీ చేపట్టింది. ఇసుక విధానం ద్వారా దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుకొంటున్న టీఎస్ఎండీసీ.. ఖనిజాల అన్వేషణలోనూ మరింత దూసుకుపోవాలని నిర్ణయించింది. దేశంలోని ఏ ప్రాంతంలోనైనా ఖనిజాలను అన్వేషించేందుకు టీఎస్ఎండీసీకి కేంద్ర ప్రభుత్వం గతంలోనే అనుమతి ఇచ్చింది. ఒడిశా, జార్ఖండ్ రాష్ట్రాల్లోని సున్నపురాయి నిక్షేపాలను గుర్తించే పనులను చేపట్టింది. అలాగే ఖమ్మం జిల్లాలో రాగి ఖనిజం నిల్వల అన్వేషణకు అనుమతి వచ్చింది. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలోని ఎనిమిది క్లస్టర్లలో సున్నపురాయి నిక్షేపాలను గుర్తించే పనులకు అనుమతించింది. అన్వేషణకు అవసరమైన సహాయాన్ని నేషనల్ మినరల్ ఎక్స్‌ప్లొరేషన్ ట్రస్ట్ (ఎన్ఎంఈటీ) అందిస్తుంది. జార్ఖండ్ రాష్ట్రంలోని సింగభుం జిల్లాకు చెందిన జీటియా, బురుబోటా, పశ్చిమ దుమూర్‌జ్యోవాతోపాటు ఒడిశా రాష్ట్రం కోరాపుట్ జిల్లాలోని గుప్తేశ్వర్ ప్రాంతంలో కూడా సున్నపురాయి నిక్షేపాలను గుర్తించే బాధ్యతను టీఎస్ఎండీసీకి కేటాయించగా.. ఈ రెండు ప్రాంతాల్లో ప్రాథమిక దశ అన్వేషణ పనులు పూర్తిచేసి సున్నపురాయి నిక్షేపాలు లేవని నిర్ధారించారు. దీనికి సంబంధించిన నివేదికను ఎన్ఎంఈటీకి సమర్పించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మైలారంలో రాగి ఖనిజం అన్వేషణ పనులను కూడా చేపట్టిన టీఎస్ఎండీసీ.. ఆ ప్రాంతం వన్యప్రాణుల అభయారణ్యం కావడంతో అక్కడ ఖనిజాల గుర్తింపు పనులు చేపట్టడం సాధ్యం కాదని అన్వేషణను నిలిపివేశారు.

**మూడు జిల్లాలు.. ఎనిమిది క్లస్టర్లు**

రాష్ట్రంలోని సూర్యాపేట, నల్లగొండ, వికారాబాద్ జిల్లాల పరిధిలోని ఎనిమిది క్లస్టర్లు, 15 బ్లాక్‌లలో ఖనిజాల అన్వేషణ కొనసాగిస్తున్నారు. ఇక్కడ జీ 4 అన్వేషణ తుది దశకు చేరింది. ఆ తరువాత జీ 3, జీ 2 గుర్తించే పనులు చేపట్టనున్నారు. అనంతరం టీఎస్ఎండీసీ నివేదిక ఆధారంగా నిల్వలను కేంద్ర ప్రభుత్వం బహిరంగ మార్కెట్లో టెండర్ల ద్వారా కేటాయించనున్నది. టెండర్లు పొందిన కంపెనీలు చెల్లించే మొత్తంలో రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదాయం సమకూరనున్నది. సూర్యాపేట జిల్లాలోని మొత్తం ఐదు క్లస్టర్లు, పది బ్లాకులు.. మేళ్లచెరువు, మల్లారెడ్డిగూడెం, యాపాల మాధవరం, మఠంపల్లి, రఘునాథపాలెం, రామాపురం, దొండపాడు, కొత్తగూడెం బ్లాకుల్లో పనులు జరుగుతున్నాయి. వికారాబాద్ జిల్లాలోని జివంగి, మల్కాపూర్‌లో బ్లాక్‌లతోపాటు నల్లగొండ జిల్లాలోని వాజిగూడెం, వీరప్పగూడెం బ్లాకుల్లో పనులు కొనసాగుతున్నాయి. జీ 4 దశ అన్వేషణలో అన్ని బ్లాకుల్లోనూ సున్నపురాయి నిక్షేపాలు ఉన్నట్టుగా తేల్చింది. గుర్తింపు పనులు జరుపుతున్న భూముల్లో ఎక్కువగా పట్టా భూములు ఉన్నట్టు గుర్తించింది. భవిష్యత్‌లో మరిన్ని ఖనిజాల అన్వేషణ చేపట్టేందుకు కూడా సిద్ధమవ్వాలని టీఎస్ఎండీసీ నిర్ణయించింది. ఖనిజాల అన్వేషణ పనులు చేపడుతూ సంస్థను ఆర్థికంగా బలోపేతం చేయడంపై ఉన్నతాధికారులు దృష్టిసారించారు.

# విపత్తువేళల్లో ఎయిర్ అంబులెన్స్ సేవలు



వైద్యులు, పారామెడికల్ సిబ్బందికి శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మంత్రి ప్రశాంత్‌రెడ్డి

- మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రోడ్డుప్రమాదాలు జరిగినప్పుడు, విపత్తువేళల్లో ఎయిర్స్ అంబులెన్స్ సేవలు అవసరమని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. ఇంటర్నేషనల్ క్రిటికల్ కేర్ ఎయిర్ ట్రాన్స్‌ఫర్ టీం (ఐసీఏటీటీ) ఎరోమెడికల్ సైన్సెస్‌లో ఫెలోషిప్ పేరుతో వైద్యులు, పారామెడికల్ సిబ్బందికి హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎయిర్ అంబులెన్స్ సేవలపై స్పెషలిస్టులుగా పనిచేసిన శాలినీ సల్వాడ్, రాహుల్‌సింగ్ స్వదేశంలో సేవలందించేందుకు రావడం హర్షణీయమన్నారు. వారు హైదరాబాద్, బెంగళూరుల్లో ఎరోమెడికల్ సైన్సెస్‌లో ఫెలోషిప్ పేరుతో వైద్యులు, పారామెడికల్ సిబ్బందికి శిక్షణ చేపట్టడం అభినందనీయమన్నారు. తెలంగాణలో విపత్తు సంఘటనలు అంతగా చోటుచేసుకోవని, రోడ్డు ప్రమాదాలు, గ్రామీణ ప్రాంతాల్లో అత్యవసర వైద్యసేవలు అందించాల్సిన సందర్భాల్లో ఎయిర్ అంబులెన్స్ సేవలు ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో వైద్యనిపుణులు శాలినీ సల్వాడ్, రాహుల్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# నేడు మూసీ గేట్ బిగింపు పూర్తి



మూసీ ప్రాజెక్ట్ గేట్ బిగింపు పనులను పరిశీలిస్తున్న మంత్రి జీ జగదీశ్‌రెడ్డి

- శరవేగంగా సాగుతున్న పనులు
- నిలిచిపోయిన లీకేజీలు
- పరిశీలించిన మంత్రి జగదీశ్‌రెడ్డి

**సూర్యాపేట రూరల్:** వారం కిందట ధ్వంసమైన మూసీ డ్యాం ఐదో గేట్ బిగింపు పనులు యుద్ధప్రాతిపదికన సాగుతున్నాయి. మొత్తం ఎనిమిది స్టాప్‌లాక్ ఎలిమెంట్లు బిగించాల్సి ఉండగా ఆదివారం సాయంత్రానికి ఐదింటిని బిగించారు. మిగిలిన ఎలిమెంట్లను బిగించే పనులు సోమవారం పూర్తయ్యే అవకాశం ఉన్నదని అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం కొంతమేర ఎలిమెంట్లు బిగించడంతో మూసీ ప్రాజెక్టు నుంచి నీటి లీకేజీలు ఆగిపోయాయి. గేటు ధ్వంసమైన సమయంలో ప్రాజెక్టులో 4.46 టీఎంసీల నీరు నిల్వ ఉండగా, గేటు ధ్వంసంతో నీరు దిగువకుపోయి.. ప్రస్తుతం నీటి నిల్వ 0.35 టీఎంసీలకు చేరుకున్నది. ఎగువనుంచి మూసీకి 2,500 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతున్నది. ఇన్‌ఫ్లో పెరిగితే నదిలో నీటి మట్టం పెరిగే అవకాశం ఉన్నది. విద్యుత్‌శాఖ మంత్రి జీ జగదీశ్‌రెడ్డి ఆదివారం మూసీ ప్రాజెక్టు వద్ద పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. మూసీ ప్రాజెక్టులో పూర్తిస్థాయి నీటి మట్టాన్ని పెంచేందుకు చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా తెలిపారు. మూసీ ఎగువనుంచి ఇన్‌ఫ్లో లేనిపక్షంలో త్వరలోనే జిల్లాకు చేరుకోనున్న గోదావరి జలాలతో నింపేందుకు చర్యలు చేపడుతామని హామీ ఇచ్చారు. నీటి ఉద్ధృతికి 5వ నంబర్ గేట్ విరిగిపోవడంతో కొంత ఇబ్బంది తలెత్తిందని పేర్కొన్నారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరంలేదని, ఆయకట్టు అన్నదాతలను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం, సీఎం కేసీఆర్ ముందుంటారని తెలిపారు. మంత్రి వెంట మాజీ మున్సిపల్ చైర్మన్ జుట్టుకొండ సత్యనారాయణ, మాజీ ఎంపీపీ వట్టె జానయ్యయాదవ్, ఈఈ భద్రునాయక్, డీఈ నవీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

**ముహూర్తం**

సూర్యోదయం: 6.09 గంటలకు

సూర్యాస్తమయం: 5.51 గంటలకు

వికారినామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, కృష్ణపక్షం, పాడ్యమి (మంగళవారం తె.జా. 4.20 వరకు), తదుపరి విదియ, నక్షత్రం: రేవతి ఉదయం 10.19 వరకు, తదుపరి అశ్విని, అమృతఘుడియలు: ఉదయం 7.41 నుంచి 9.26 వరకు, రాహుకాలం: ఉదయం 7.37 నుంచి 9.05 వరకు, దుర్ముహూర్తం: మధ్యాహ్నం 12.24 నుంచి 1.10 వరకు, తిరిగి మధ్యాహ్నం 2.44 నుంచి 3.31 వరకు, వర్జ్యం: లేదు.

# ఉత్తమ్‌కు గుణపాఠం చెప్పాలె



సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం మంగాపురం తండాలో ప్రచారం నిర్వహిస్తున్న మంత్రి సత్యవతి రాథోడ్. చిత్రంలో మండలి చీఫ్ విప్ బోడకుంటి కూడా ఉన్నారు.



మఠంపల్లిలో టీఆర్‌ఎస్ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డికి మంగళ హారతితో స్వాగతం పలుకుతున్న గిరిజన మహిళలు. చిత్రంలో ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య కూడా ఉన్నారు.

**హుజూర్‌నగర్, నమస్తేతెలంగాణ/గరిడేపల్లి/మఠంపల్లి:** మూడుసార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా, ఇప్పుడు ఎంపీగా కొనసాగుతున్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డివి అన్ని ఉత్తి మాటలేనని, హుజూర్‌నగర్‌ను అభివృద్ధిలో వెనుకబడేసిన ఆయనకు ఈ ఉపఎన్నికలో ఓటుతో గుణపాఠం చెప్పాలని, గిరిజనుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్న గులాబీ జెండాను గిరిజనులు గుండెలకు హత్తుకోవాలని గిరిజన, స్త్రీ, శిశు సంక్షేమశాఖల మంత్రి సత్యవతి రాథోడ్ పిలుపునిచ్చారు. ఆదివారం గరిడేపల్లి, మఠంపల్లి మండలాల్లో ఆమె ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. గిరిజనుల సంక్షేమానికి పెద్దపీట వేసిన పెద్ద మనిషి సీఎం కేసీఆర్ అని పేర్కొన్నారు. ఇన్నేండ్లూ తండాలకు వెళ్లేందుకే రోడ్డు మార్గాలు సక్రమంగా లేక ఇబ్బందులు పడుతున్న గిరిజనుల బాధలను అర్థం చేసుకొన్న సీఎం కేసీఆర్.. తండాలను గ్రామపంచాయతీలుగా మార్చి అభివృద్ధి చేస్తున్నారని చెప్పారు. ప్రత్యేక నిధులతో తండాలను అభివృద్ధి చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని తెలిపారు. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఎన్నికలప్పుడు మాత్రమే వచ్చి కల్లబొల్లి మాటలు చెప్తూ ప్రతిసారీ మోసంచేసి గెలుపొందుతున్నారని విమర్శించారు. మంత్రి వెంట పార్టీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి, శాసనమండలి చీఫ్‌విప్ బోడకుంటి వెంకటేశ్వర్లు, ఎమ్మెల్యేలు రవీంద్రకుమార్, చిరుమర్తి లింగయ్య, టీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శులు ఇంతియాజ్ ఇసాక్, ఎల్ రూప్‌సింగ్, ములుగు జెడ్పీ చైర్మన్ కుసుమ జగదీశ్, టీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరేశ్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఇంతియాజ్ ఇస్సాక్, ఉమ్మడి నల్లగొండ జిల్లా రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు రాంచందర్‌నాయక్, ఖమ్మం డిప్యూటీ మేయర్ బత్తుల మురళి తదితరులు ఉన్నారు. మఠంపల్లిలో టీఆర్‌ఎస్ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డికి గిరిజన మహిళలు మంగళహారతితో ఘనస్వాగతం పలికారు. మంగాపురంలో వరంగల్ నగర మేయర్ గుండా ప్రకాశ్‌రావు, పొనుగోడులో ముస్లిం మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సయ్యద్ అక్బర్ హుస్సేన్ ప్రచారం నిర్వహించారు. పాలకవీడు మండలంలో మండలి విప్ కర్నె ప్రభాకర్, ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు, కల్మడి తండా, చెర్వుతండా, దేవ్లాతండా, కొత్తతండాల్లో ఎంపీ మాలోతు కవిత, ఎమ్మెల్యే హరిప్రియనాయక్ ప్రచారంలో పాల్గొన్నారు. డక్కన్ పరిశ్రమలో టీఆర్‌ఎస్ పార్టీ మహిళా అధికార ప్రతినిధి సింధూజరెడ్డి ప్రచారంచేశారు. జాన్‌పహాడ్ ముదిరాజ్‌ల కార్యకర్తల సమావేశంలో ఎంపీ బండా ప్రకాశ్, పాలకవీడులో గౌడ హక్కుల సమావేశంలో ఎమ్మెల్సీ గంగాధర్‌గౌడ్ పాల్గొన్నారు. నేరేడుచర్ల మండలంలోని దిర్శించర్లలో టీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి తాతా మధుసూదన్, నేరేడుచర్లలో ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, ఎమ్మెల్సీ గంగాధర్‌గౌడ్, టీఆర్‌ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లి శ్రీనివాస్‌యాదవ్ ప్రచారం నిర్వహించారు. హుజూర్‌నగర్‌లో ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ డమ్మీ ఈవీఎంతో ఇంటింటి ప్రచారం నిర్వహించగా, బ్రాహ్మణ సంఘం నాయకులతో ఎమ్మెల్సీ పురాణం సతీశ్‌కుమార్ సమావేశమయ్యారు. హుజూర్‌నగర్ పట్టణంలో టీఎస్ఐఐసీ చైర్మన్ బాలమల్లు, సాట్స్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, శానంపూడి రజిత ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

## గులాబీ జెండాను గుండెలకు హత్తుకోవాలె

- గిరిజనుల సంక్షేమానికి పెద్దపీట వేసిన ఘనత సీఎం కేసీఆర్‌దే
- హుజూర్‌నగర్ ఉపఎన్నిక ప్రచారంలో మంత్రి సత్యవతి రాథోడ్
- టీఆర్‌ఎస్ ప్రచారానికి ఊరూరా విశేష స్పందన
- సైదిరెడ్డికి మంగళహారతులు పడుతున్న ఆడపడుచులు

**లోకం పోకడ**




ఈ కాలంలో ఎవరినీ నమ్మేటట్టు లేదు సార్.. ఇంట్లో పెట్టుకున్నా, బ్యాంకులో దాచుకున్నా ఏ దొంగ కన్నమేసి కాజేస్తాడోనని...



ఉత్తమ్ కారులో దగ్ధమైన నోట్ల కట్టల వార్తల క్లిప్పింగ్‌లను చూపుతున్న మండలి విప్ కర్నె ప్రభాకర్. చిత్రంలో ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు కూడా ఉన్నారు.

# ఉత్తమ్ డబ్బులను నమ్ముకుంటున్నాడు

- మండలి విప్ కర్నె ప్రభాకర్

**పాలకవీడు:** ఉప ఎన్నికలో టీఆర్‌ఎస్ పార్టీ ప్రజలను నమ్ముకొంటే.. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి డబ్బులను నమ్ముకున్నారని మండలి విప్ కర్నె ప్రభాకర్ విమర్శించారు. ఆదివారం పాలకవీడులో ఆయన మీడియాతో మాట్లాడారు. గత ఏడాది శాసనసభ ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి అవుతానని, నిన్నటి పార్లమెంట్ ఎన్నికల్లో కేంద్ర మంత్రి అవుతానని హుజూర్‌నగర్ ప్రజలను మభ్యపెట్టి ఓట్లు వేయించుకొన్న ఉత్తమ్.. ఈ ఉపఎన్నికలో కొత్త అవతారం ఎత్తారని, ప్రశ్నించే గొంతుక అవుతానని తన భార్యకు ఓటు వేయాలని అడుగుతున్నారని మండిపడ్డారు. చైతన్య వంతులైన హుజూర్‌నగర్ ప్రజలు ఈ విషయాలను గమనించాలని కోరారు. ఉపఎన్నికలో తన భార్య పద్మావతి గెలిస్తే హుజూర్‌నగర్ ప్రజలకు కలిగే లాభం ఏంటిదో ప్రజలకు చెప్పాలని డిమాండ్‌చేశారు. గెలిస్తే ప్రస్తుతం ఉన్న ఆరుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు మరొకరు జతవుతారే తప్ప ప్రజలకు కలిగే లాభం ఏమిటని ప్రశ్నించారు. ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్దీ ఉత్తమ్ చేస్తున్న రాజకీయాలు విచిత్రంగా ఉన్నాయని, దొంగే దొంగ.. దొంగ అని అరిచినట్టు ఉత్తమ్ వ్యవహారం ఉన్నదన్నారు. 2014 ఎన్నికల్లో తన సొంత వాహనంలో కోట్ల రూపాయలను తగులబెట్టుకున్న విషయాన్ని పత్రికలు పుంఖానుపుంఖాలుగా ప్రచురించాయని, వాటి ప్రతులను మీడియాకు చూపించారు. ఉపఎన్నికలో టీఆర్‌ఎస్ పార్టీపై అర్థరహిత వ్యాఖ్యలు మానుకోవాలని హితవుపలికారు. ఆకాశంపై ఉమ్మి వేస్తే అది తన ముఖంపై ఎలాపడుతుందో.. ఉత్తమ్ చేసే ఆరోపణలన్నీ అతనికే వర్తిస్తాయని చెప్పారు. ఈ సమావేశంలో మిర్యాలగూడ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సోమవారం
14•10•2019
కరీంనగర్

# నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక
WWW. NTNEWS.COM
/NTDAILYONLINE
PUBLISHED FROM KARIMNAGAR | HYDERABAD | WARANGAL | KHAMMAM | NALGONDA | MAHABUBNAGAR | NIZAMABAD




# నిరాటంకంగా బస్సులు

## మెరుగవుతున్న ప్రజారవాణా.. ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో తప్పిన ఇక్కట్లు

### రోడ్డెక్కిన 55% ఆర్టీసీ బస్సులు.. 100% నడిపించేందుకు చర్యలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ/ నెట్‌వర్క్:**

రాష్ట్రంలో ప్రజారవాణా వ్యవస్థ క్రమంగా మెరుగుపడుతున్నది. ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా చేసిన ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో బస్సులు నిరాటంకంగా నడుస్తున్నాయి. దాదాపు 55% ఆర్టీసీ బస్సులు రోడ్డెక్కడంతో క్రమంగా సాధారణ స్థితి ఏర్పడుతున్నది. పూర్తిస్థాయిలో నూటికి నూరుశాతం బస్సులు తిప్పడానికి చర్యలు ప్రారంభించారు. ఇందుకోసం అవసరమైన డ్రైవర్లు, కండక్టర్లు, ఇతర ఉద్యోగులను తాత్కాలిక ప్రాతిపదికన తీసుకొంటున్నారు. రిటైర్డ్ ఉద్యోగులకు గౌరవ వేతనం ఇచ్చి విధుల్లోకి తీసుకోవాలని శనివారం నిర్ణయించడంతో ఇందుకు అనుగుణంగా ఆర్టీసీ యాజమాన్యం చర్యలు చేపట్టింది. ఆదివారం 55% ఆర్టీసీ బస్సులతోపాటు, ఆరువేల ప్రైవేట్ వాహనాలు ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చాయని ఆర్టీసీ అధికారులు వెల్లడించారు.

**పక్కాగా ప్రత్యామ్నాయం**

రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఆర్టీసీ యాజమాన్యం చేసిన ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో నిరాటంకంగా బస్సులు నడిచాయి. ఆర్టీసీ సొంత సర్వీసులను నడిపించడానికి అనుభవం ఉన్న డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లు, శ్రామిక్‌లు, ఎలక్ట్రీషియన్లు, టైర్ మెకానిక్‌లను తాత్కాలిక పద్ధతిలో నియమించుకోవడానికి ఆదివారం నోటిఫికేషన్ జారీచేశారు. పలుచోట్ల డ్రైవర్లు, కండక్టర్లకు పరీక్షలు నిర్వహించారు. డ్రైవర్లకు ఫిట్‌నెస్ టెస్ట్‌లు చేశారు. నియామకాలు కూడా వేగంగా పూర్తిచేయడానికి అన్నిరకాలుగా కసరత్తుచేస్తున్నారు. కండక్టర్ పోస్టులకు మహిళలు అత్యధికంగా దరఖాస్తు చేసుకోవడం విశేషం. రాష్ట్రంలోని అన్ని ఆర్టీసీ డిపోల వద్ద పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటుచేశారు. రద్దీని బట్టి ఆయా రూట్లలో బస్సుల సంఖ్యను పెంచుతూ ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకొంటున్నారు. ఆదివారం వరంగల్ రీజియన్‌లో 625 బస్సులు తిరిగినట్లు రీజినల్ మేనేజర్ శ్రీధర్ తెలిపారు. తొమ్మిది డిపోల పరిధిలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా.. ప్రజలకు ఇక్కట్లు రాకుండా బస్సులను అందుబాటులో ఉంచామని, రీజియన్‌లో పరిస్థితి క్రమంగా మామూలు పరిస్థితికి చేరుకుంటున్నదని చెప్పారు. కరీంనగర్‌లో 84.63% బస్సులు రోడ్లపై తిరిగాయి. మొత్తం 567 బస్సులతోపాటు 31 కాంట్రాక్టు క్యారియర్ బస్సులను కూడా నడిపించారు. 180 వరకు మ్యాక్సీ క్యాబ్‌లు నడిచాయి. జనగామ డిపో పరిధిలో ఆర్టీసీ సొంత బస్సులు, అద్దె బస్సులు, ప్రైవేట్ స్కూలు బస్సులతో కలిపి

మిగతా 7వ పేజీలో



ఆదివారం జనగామ బస్టాండ్‌లో బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

# ధాన్యం కొనుగోళ్ల లక్ష్యం 92 లక్షల టన్నులు



- పౌరసరఫరాలశాఖ నిర్ణయం
- తొలిసారిగా రాష్ట్రస్థాయిలో సమన్వయ కమిటీ
- వ్యవసాయశాఖకూ భాగస్వామ్యం
- హైదరాబాద్‌లో మానిటరింగ్ సెల్
- ఫిర్యాదుల కోసం టోల్‌ఫ్రీ నంబర్లు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

ఈ ఏడాది రికార్డు స్థాయిలో దిగుబడి రానున్న ధాన్యం కొనుగోళ్ల కోసం పౌరసరఫరాలశాఖ పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నది. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ధాన్యం క్వాలిటీ, క్వాంటిటీ విషయంలో వారికి మరింత అవగాహన కల్పించేందుకు క్షేత్రస్థాయిలో వ్యవసాయ విస్తరణ అధికారులకు కీలక బాధ్యతలు అప్పగించింది. ప్రతి కొనుగోలు కేంద్రానికి ఏఈవోను ఇంచార్జిగా నియమించింది. తొలిసారిగా రాష్ట్రస్థాయిలో సమన్వయ కమిటీని ఏర్పాటుచేసింది. ఈ ఏడాది వరిసాగు విస్తీర్ణం పెరిగిన నేపథ్యంలో వానకాలంలో 55 లక్షల టన్నులు, యాసంగిలో 37 లక్షల టన్నులు కలిపి మొత్తం 92 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని లక్ష్యంగా నిర్ణయించింది. గతేడాది వానకాలంలో 40 లక్షల టన్నులు కొనుగోలు చేయగా ఈసారి దాదాపు 15 లక్షల టన్నుల ధాన్యం అధికంగా వస్తుందనే అంచనాతో అందుకు తగిన ఏర్పాట్లుచేస్తున్నది. ఈ నెల 20వ తేదీ తర్వాత నుంచి ధాన్యం కొనుగోళ్లు

మిగతా 4వ పేజీలో

# విపక్షాల వలలో ఆర్టీసీ నేతలు

- వాళ్లు అధికారంలో ఉన్నప్పుడు ఏంచేశారు?
- రాజకీయంగా ప్రభుత్వంపై కుట్ర మంత్రి ఎర్రబెల్లి
- ఆర్టీసీని విచ్ఛిన్నంచేసే కుట్ర: మంత్రి గంగుల

4

ఆర్టీసీ కార్మిక సంఘం నాయకులు ప్రతిపక్షాల వలలో పడ్డారు. విపక్ష నేతల మాయమాటలతో యూనియన్ నాయకులు, కార్మికులు రెచ్చిపోతున్నారు. రాజకీయంగా ప్రభుత్వంపై కుట్ర జరుగుతున్నది. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని టీఆర్‌ఎస్ పార్టీ మ్యానిఫెస్టోలో చెప్పలేదు.

**- ఎర్రబెల్లి దయాకర్‌రావు, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి**



ఆర్టీసీ యూనియన్ నాయకుల వెనుక ప్రతిపక్ష పార్టీలు ఉన్నాయి. వాటి స్వార్థంకోసం వేలమంది కార్మికుల జీవితాలతో ఆడుకొంటూ ఆర్టీసీని విచ్ఛిన్నంచేసేందుకు కుట్ర పన్నుతున్నారు.ఇలాంటి నాయకుల విష వలయంలో పడకుండా.. కార్మికులు సమ్మె విరమించాలి.

**- గంగుల కమలాకర్, పౌరసరఫరాలశాఖ మంత్రి**



# రాజకీయ సమ్మె

## లబ్ధికోసం వాడుకుంటున్న రాజకీయ పార్టీలు.. ఆర్టీసీ కార్మికులు ఒంటరిగా పోరాటం చేయాలి



ఆదివారం మీడియాతో మాట్లాడుతున్న తెలంగాణ ఉద్యోగసంఘాల జేఏసీ అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి, సెక్రటరీ జనరల్ వీ మమత

- ఆనాడు ఉద్యమాన్ని అణిచివేయాలనుకున్నారు
- నేడు ఆర్టీసీ కార్మికులతో సమ్మె చేయిస్తున్నరు
- సమ్మెకు వెళ్తున్నట్లు ఆర్టీసీ జేఏసీ ఒక్కమాట చెప్పలేదు
- సమస్యల పరిష్కారం కోసమే సీఎంను కలిశాం
- ఉద్యోగ జేఏసీ నేతలు రవీందర్‌రెడ్డి, మమత

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఆర్టీసీ కార్మికుల సమ్మె రాజకీయశక్తుల చేతుల్లోకి వెళ్లిందని, రాజకీయపక్షాలు ఈ సమ్మెను తమ లబ్ధికోసం వాడుకొనేందుకు కుట్ర చేస్తున్నాయని తెలంగాణ ఉద్యోగ సంఘాల జేఏసీ అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి, సెక్రటరీ జనరల్ వీ మమత విమర్శించారు. ఉద్యోగులకు సంబంధించిన అంశాల్లో రాజకీయశక్తులు తలదూర్చి.. విభేదాలు సృష్టించే ప్రయత్నాలు చేస్తున్నాయని, వీటిని ఉద్యోగులు నమ్మబోరని అన్నారు. ఆర్టీసీ కార్మికుల డిమాండ్లు న్యాయబద్ధమైనవే అయినప్పటికీ.. ఒంటరిగా పోరాడాలని సూచించారు. టీఎన్జీవో భవన్‌లో ఆదివారం

మిగతా 4వ పేజీలో

# సెయింట్ థ్రెసియా



పునీతురాలిగా ప్రకటించిన పోప్ ఫ్రాన్సిస్

మరో నలుగురికి సైతం 'సెయింట్' హోదా

5

# ఈసారి జీడీపీ వృద్ధిరేటు 6 శాతమే

అంచనాల్ని తగ్గించిన ప్రపంచబ్యాంక్

ఆర్థిక మందగమనం ప్రభావం




9



ఆదివారం రాత్రి నాగార్జునసాగర్ పది గేట్లు ఎత్తడంతో దిగువకు విడుదలవుతున్న నీరు

# కృష్ణమ్మకు పోటెత్తిన వరద

- జూరాలకు 98వేలు.. శ్రీశైలానికి 1.51 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- నాగార్జునసాగర్‌కు 2.02 లక్షల ఇన్‌ఫ్లో
- పది క్రస్ట్‌గేట్ల ద్వారా దిగువకు నీరు
- శ్రీరాంసాగర్‌కు స్వల్పంగా కొనసాగుతున్న వరద
- ఎల్‌ఎండీ నుంచి కాకతీయ కాల్వకు నీటి విడుదల

7

# తెలంగాణకు ఏదీ ముద్ర?

- చిరువ్యాపారులు, నిరుద్యోగులకు అందని రుణాలు
- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్
- కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్‌కు లేఖ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

చిరువ్యాపారులు, నిరుద్యోగులకు కేంద్రం అందించే ముద్ర రుణాలు తెలంగాణలో కనిపించడం లేదని, ఈ పథకం కింద వెంటనే వ్యక్తిగత రుణాలు ఇవ్వాలని రాష్ట్ర ప్రణాళికాసంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆదివారం కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌కు లేఖ రాశారు. రాష్ట్రంలో నిరుద్యోగులతోపాటు కూరగాయలు, పండ్ల వ్యాపారులు, చిన్న హోటళ్లు, టైలరింగ్, పాపడాలు, రొట్టెలు తయారుచేసేవాళ్లు, తదితర చిన్న వ్యాపారాలు చేసుకొని స్వయంఉపాధి పొందేవారికి బ్యాంకులు ముద్ర రుణా లు ఇవ్వడంలేదని ఆవేదన వ్యక్తంచేశారు. కొన్ని బ్యాంకులు ముద్ర రుణాలు అనేవే లేవని పేర్కొంటున్నాయని, మరికొన్ని బ్యాంకులు దరఖాస్తులు తీసుకొని కనీసం ఎకనాలెడ్జ్‌మెంట్ కూడా ఇవ్వడం లేదని తెలిపారు. 2019 సెప్టెంబర్ 20 నాటికి దేశవ్యాప్తంగా 20.14 కోట్ల మందికి రుణాలు ఇవ్వడంపై కేంద్రానికి కృతజ్ఞతలు తెలిపిన వినోద్‌కుమార్.. దేశవ్యాప్తంగా సగటున రూ.49,258 రుణం ఇవ్వగా తెలంగాణలో రూ.82,600 ఇచ్చినట్టు పేర్కొన్నారు. తెలంగాణలో రుణం ఎక్కువగా కనిపిస్తున్నా.. రుణాలు తీసుకున్న వారిసంఖ్య చాలా తక్కువగా ఉన్నదని లేఖలో వివరించారు. దేశవ్యాప్తంగా సగటున ముద్ర రుణాలు 14.87% మందికి ఇవ్వగా తెలంగాణలో 7.42% మందికి



మిగతా 4వ పేజీలో




| చికెన్ ధరలు (వెన్‌కాబ్) (రూ.) | | | |
|---|---|---|---|
| ఫారం ధర | 80.00 | రిటైల్ లైవ్ | 102.00 |
| డ్రెస్డ్ | 148.00 | స్కిన్‌లెస్ | 168.00 |

| గుడ్ల ధరలు (వందకు) (రూ.) | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 411.00 | రంగారెడ్డి | 411.00 |
| మెదక్ | 411.00 | కరీంనగర్ | 414.00 |
| వరంగల్ | 414.00 | చిల్లర ధర | 4.70 |

# నేడు మూసీగేట్ బిగింపు పూర్తి

- శరవేగంగా సాగుతున్న పనులు
- నిలిచిపోయిన లీకేజీలు
- పరిశీలించిన మంత్రి జగదీశ్‌రెడ్డి

2

# ముగ్గురిని చంపిన హంతకుడి ఆత్మహత్య

గొంతుకోసుకొని చెరువులో దూకిన నిందితుడు

10



## సిరిసిల్ల చీరెకట్టులో న్యూజిలాండ్ ఎంపీ

### బతుకమ్మ వేడుకల్లో సందడి చేసిన ప్రియాంకరాధాకృష్ణన్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణ ఉత్పత్తులు అనేక దేశాల్లో ప్రత్యేకతను చాటుకుంటుండగా.. న్యూజిలాండ్ బతుకమ్మ వేడుకల్లో మరోసారి సిరిసిల్ల చీరెకు గుర్తింపు లభించింది. న్యూజిలాండ్‌లో ఎంపీగా ప్రాతినిధ్యం వహిస్తున్న దక్షిణ భారతదేశానికి చెందిన ప్రియాంకరాధాకృష్ణన్ న్యూజిలాండ్‌లో జరిగిన బతుకమ్మ వేడుకల్లో సిరిసిల్ల చీరెకట్టుకొని సందడి చేశారు. బ్రాండ్ తెలంగాణ ద్వారా సిరిసిల్ల నేతన్న హరిప్రసాద్ తయారు చేసిన చీరెను ఆమె కట్టుకోవడంతోపాటు బ్రాండ్ తెలంగాణకు ప్రచారకర్తగా వ్యవహరించేందుకు ముందుకొచ్చారు. ప్రియాంక నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్టు బ్రాండ్ తెలంగాణ వ్యవస్థాపకురాలు సునీతా విజయ్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రియాంక రాధాకృష్ణన్ మాట్లాడుతూ... తెలంగాణలో ప్రభుత్వం బతుకమ్మ చీరెలను పంపిణీ చేయడం అభినందనీయమని అన్నారు.



ఆదివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని లక్ష్మీ (కన్నెపల్లి) పంప్‌హౌస్ వద్ద విశాఖ శారదాపీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్రస్వామికి కాళేశ్వరం ప్రాజెక్టు గురించి వివరిస్తున్న ఈఈ రమణారెడ్డి

## కాళేశ్వరం ప్రాజెక్టుతో తెలంగాణ సుభిక్షం

### విశాఖ శారదాపీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్రస్వామి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ/కాళేశ్వరం (జయశంకర్ భూపాలపల్లి):** తెలంగాణ సుభిక్షంగా ఉండటానికి కాళేశ్వరం ప్రాజెక్టు దోహదపడుతుందని విశాఖ శారదాపీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్రస్వామి పేర్కొన్నారు. ఆదివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని లక్ష్మీ(కన్నెపల్లి) పంప్‌హౌస్, లక్ష్మీ(మేడిగడ్డ) బరాజ్‌ను ఆయన సందర్శించారు. అంతకుముందు కాళేశ్వరం వద్ద గోదావరి మాతను దర్శించుకొని చీరె, పూలుపండ్లతో వాయనం ఇచ్చారు. అనంతరం కాళేశ్వరుడి ఆలయాన్ని సందర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు ఈఈ రమణారెడ్డి స్వామివారికి స్వాగతం పలికారు. వ్యూపాయింట్ వద్ద మ్యాప్‌ద్వారా లక్ష్మి పంప్‌హౌస్ పనితీరును వివరించారు. తెలుగు రాష్ట్రాలను సస్యశ్యామలంగా ఉంచాలని గోదావరిని ప్రార్థించినట్టు స్వాత్మానందేంద్రస్వామి పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రప్రభుత్వ భగీరథ ప్రయత్నానికి భగవంతుడి ఆశీస్సులు తోడయ్యాయని.. అందుకే అనతికాలంలోనే ప్రాజెక్టు పూర్తయిందని అన్నారు.



## తెలంగాణకు ఏదీ ముద్ర?

మూడోపేజీ తరువాయి...

మాత్రమే ఇచ్చారని స్పష్టంచేశారు. జాతీయ సగటు ప్రకారం తెలంగాణలో 57,87,263 మందికి ముద్ర రుణాలు ఇవ్వాల్సి ఉండగా.. 28,86,210 మందికే మంజూరు చేశారన్నారు. ముద్ర రుణాలను రూ.30 లక్షల వరకు పెంచుతూ ఆదేశాలివ్వాలని కేంద్రమంత్రిని కోరారు. ఈ రుణాలపై ప్రసారమాధ్యమాల ద్వారా ప్రచారం చేయాలన్నారు. అర్హులైనవారు బ్యాంకులకెళ్లి రుణాలు తీసుకొనే అవకాశం కలుగుతుందని.. ఈ నిర్ణయం తెలంగాణకు ఉపయోగపడుతుందని తెలిపారు.

**దేశవ్యాప్తంగా ముద్ర రుణాల జాబితా**

| రాష్ట్రం | ప్రజలు | ముద్ర రుణాల మంజూరు సంఖ్య | లబ్ధిపొందిన వారి శాతం |
|---|---|---|---|
| జమ్ముకశ్మీర్ | 1,37,38,237 | 4,52,219 | 3.29 |
| ఆంధ్రప్రదేశ్ | 5,33,90,841 | 32,13,610 | 6.01 |
| తెలంగాణ | 3,89,19,054 | 28,86,210 | 7.42 |
| ఉత్తరప్రదేశ్ | 23,33,78,519 | 1,78,14,349 | 7.63 |
| గుజరాత్ | 6,48,01,901 | 61,41,227 | 9.48 |
| రాజస్థాన్ | 7,95,84,255 | 80,69,962 | 10.14 |
| ఉత్తరాఖండ్ | 1,11,40,566 | 13,18,545 | 11.84 |
| పంజాబ్ | 2,98,75,481 | 39,41,135 | 13.19 |
| మహారాష్ట్ర | 12,19,24,973 | 1,65,39,606 | 13.57 |
| జార్ఖండ్ | 3,79,33,898 | 51,85,125 | 13.67 |
| హర్యానా | 2,77,93,351 | 38,36,297 | 13.80 |
| మధ్యప్రదేశ్ | 8,38,49,671 | 1,25,60,094 | 14.98 |
| అసోం | 3,50,80,827 | 61,71,651 | 17.59 |
| కేరళ | 3,54,61,849 | 70,11,360 | 19.77 |
| పశ్చిమబెంగాల్ | 9,86,62,146 | 1,99,60,669 | 20.23 |
| త్రిపుర | 41,12,223 | 12,75,643 | 31.02 |
| కర్ణాటక | 6,68,34,193 | 2,07,53,251 | 31.05 |
| తమిళనాడు | 7,71,77,540 | 2,55,79,940 | 33.14 |
| **దేశం మొత్తం** | **135,39,04,751** | **20,13,64,050** | **14.87** |

# విపక్షాల వలలో ఆర్టీసీ నేతలు

- వాళ్లు అధికారంలో ఉన్నప్పుడు ఏంచేశారు?
- రాజకీయంగా ప్రభుత్వంపై కుట్ర జరుగుతున్నది
- పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

ఆర్టీసీ కార్మిక సంఘం నాయకులు ప్రతిపక్షాల వలలో పడ్డారని.. విపక్ష నేతల మాయమాటలతో యూనియన్ నాయకులు, కార్మికులు రెచ్చిపోతున్నారని పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. రాజకీయంగా ప్రభుత్వంపై కుట్ర జరుగుతున్నదని అభిప్రాయపడ్డారు. ఆదివారం టీఆర్‌ఎస్‌ఎల్పీ కార్యాలయంలో ఎమ్మెల్యే ఆరూరి రమేశ్‌తో కలిసి మీడియాతో మాట్లాడుతూ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని టీఆర్‌ఎస్ పార్టీ మ్యానిఫెస్టోలో చెప్పలేదని గుర్తుచేశారు. రాష్ట్రం ఆవిర్భవించిన తొలినాళ్లలోనే ఆర్టీసీ కార్మికులకు 44 శాతం ఫిట్‌మెంట్ ఇచ్చారని.. దేశంలో ఏ రాష్ట్రంలో కూడా ఇంతగా ఫిట్‌మెంట్ ఇవ్వలేదని గుర్తుచేశారు. టీఆర్‌ఎస్‌పై కాంగ్రెస్, బీజేపీ దుష్ప్రచారంచేస్తున్నాయన్నారు. తెలంగాణ ఆర్టీసీని దేశంలోనే నంబర్‌వన్‌గా తీర్చిదిద్దుతామని తెలిపారు. ఆర్టీసీని లాభార్జన దిశగా తీసుకువెళ్లాలన్న లక్ష్యంతో సీఎం కేసీఆర్ పనిచేస్తున్నారని తెలిపారు. టీడీపీ, కాంగ్రెస్ పార్టీలు రాష్ట్రంలో అధికారంలో ఉన్నప్పుడు ఆర్టీసీని ఎందుకు బలోపేతం చేయలేదని ప్రశ్నించారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు తాము అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఆర్టీసీని ఎందుకు ప్రభుత్వంలో విలీనం చేయలేదో చెప్పాలని నిలదీశారు. రాజకీయ లబ్ధికోసమే బీజేపీ నేతలు డ్రామాలు చేస్తున్నారన్నారు. తెలంగాణ ఏర్పడిననాటి నుంచి ఆర్టీసీకి ప్రభుత్వం నుంచి రూ.3,300 కోట్లు నిధులు అందాయని మంత్రి పేర్కొన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంపైనా కేసులు వేసి అడ్డుకోవడానికి ప్రయత్నించాయని మంత్రి ఎర్రబెల్లి విమర్శించారు.



ఆదివారం టీఆర్‌ఎస్‌ఎల్పీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు. చిత్రంలో ఎమ్మెల్యే ఆరూరి రమేశ్ ఉన్నారు.



కరీంనగర్‌లో మీడియాతో మాట్లాడుతున్న మంత్రి గంగుల కమలాకర్. చిత్రంలో ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, ఎమ్మెల్సీ లక్ష్మణ్‌రావు కూడా ఉన్నారు.

## సమ్మె విరమించి సంస్థ ప్రగతికి కలిసి రావాలి: మంత్రి గంగుల కమలాకర్

**కరీంనగర్ ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** ఆర్టీసీ యూనియన్ నాయకుల వెనుక ప్రతిపక్షపార్టీలు ఉన్నాయని, వాటి స్వార్థంకోసం వేలమంది కార్మికుల జీవితాలతో ఆడుకొంటూ ఆర్టీసీని విచ్ఛిన్నంచేసేందుకు కుట్ర పన్నుతున్నాయని బీసీ సంక్షేమశాఖ మంత్రి గంగుల కమలాకర్ ఆరోపించారు. ఆదివారం ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు తదితరులతో కలిసి మీడియాతో మాట్లాడుతూ.. ఇలాంటి నాయకుల విషవలయంలో పడకుండా.. సమ్మెను విరమించి సంస్థను ముందుకు తీసుకొని వెళ్లాలని ఆర్టీసీ కార్మికులకు మంత్రి విజ్ఞప్తిచేశారు. ఆర్టీసీ సమ్మె టెంట్ కింద కొన్ని పార్టీల నాయకులు ఉడుంలా చొచ్చుకొచ్చారని, సీఎం కేసీఆర్‌పై అక్కసుతో కార్మికులను ప్రభుత్వంపైకి ఎగదోస్తున్నారని మండిపడ్డారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఇప్పటికే బీఎస్‌ఎన్‌ఎల్ గొంతు పిసికిందనీ, ఇప్పుడు ఇండియన్ ఎయిర్‌లైన్స్, అటు రైల్వే, ఇంధన సంస్థలను ప్రైవేటీకరిస్తామని రాజ్యసభలో కేంద్ర మంత్రులు ప్రకటించిన విషయాన్ని తెలంగాణ బీజేపీ నేతలు మర్చిపోతున్నారని పేర్కొన్నారు. ఆర్టీసీని బలోపేతంచేసేందుకు సీఎం కేసీఆర్ కృతనిశ్చయంతో ఉన్నారన్నారు.

# బస్సులివ్వని డిపో మేనేజర్లు

- వెనుతిరుగుతున్న డ్రైవర్లు, కండక్టర్లు
- సహకరించని అద్దె బస్సుల యజమానులు
- ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆర్టీసీ అధికారులు!

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** ఆర్టీసీ కార్మికులు చేస్తున్న సమ్మెపై రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా వ్యవహరిస్తున్నప్పటికీ.. క్షేత్రస్థాయిలో ఆర్టీసీ అధికారులు సహకరించడంలేదు. ముఖ్యంగా డిపో మేనేజర్లు, డివిజనల్ మేనేజర్లు (డీవీఎం) పరోక్షంగా సమ్మెకు మద్దతు తెలుపుతూ, ప్రభుత్వ లక్ష్యాన్ని , ఉద్దేశాన్ని నీరుగార్చే ప్రయత్నంచేస్తున్నారు. రవాణాశాఖ అధికారులు, మంత్రిత్వశాఖ సిబ్బంది కష్టపడి బస్సులతోపాటు డ్రైవర్లను సమకూర్చినా అధికారులు మాత్రం డ్రైవర్లకు బస్సులు ఇవ్వకుండా ప్రభుత్వం చేపట్టిన ప్రత్యామ్నాయ చర్యలను విఫలంచేసేలా కుట్రలుచేస్తున్నారు. ఈ విషయంపై రవాణాశాఖ అధికారులు కమిషనర్ సందీప్‌కుమార్ సుల్తానియాతోపాటు, ముఖ్య కార్యదర్శి సునీల్‌శర్మకు నివేదిక అందించారు. బస్సులు కండిషన్లో లేవని, తాత్కాలిక డ్రైవర్లు నడిపితే మైలేజీ రావటంలేదంటూ సాకులు చెప్తున్నారు. తాత్కాలిక డ్రైవర్లను చీదరించుకుంటుండటంతో ఆత్మాభిమానం చంపుకొని పనిచేయడం ఇష్టంలేని చాలామంది డ్రైవర్లు వెనుదిరిగిపోతున్నారు. మూడు రోజుల్లో వందశాతం బస్సులు తిరుగాలని ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు ఉన్నప్పటికీ డిపో మేనేజర్లు, డీవీఎంలు సమ్మెకు అండగా నిలుస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పావులు కదుపుతున్నారు. కొంతమంది ఆర్‌ఎంలు కూడా ఇటువంటి వాటిని ప్రోత్సహిస్తున్నారు. బస్సుల కోసం డ్రైవర్లు గంటలకొద్దీ డిపోల వద్ద వేచిచూడాల్సిన పరిస్థితులను డీఎంలు కల్పిస్తున్నారు. ప్రతి డిపో దగ్గర ఇలాంటి పరిస్థితే ఉన్నట్లు సమాచారం. అధికారుల సహాయసహకారాలతో తాత్కాలిక డ్రైవర్లు, కండక్టర్లపై సమ్మెలో ఉన్న కార్మికులు బెదిరింపులకు దిగుతున్నట్లు సమాచారం. దీంతో భయాందోళనలకు గురవుతున్న తాత్కాలిక డ్రైవర్లు, కండక్టర్లు విధులకు హాజరు కావటంలేదు. అధికారులు సహకరించకపోవడంతో డ్రైవర్లను సమకూర్చడం తలకు మించిన భారంగా మారుతున్నదని రవాణా శాఖ అధికారులు, సిబ్బంది వాపోతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 10,206 బస్సులు నడుపడానికి కండిషన్‌లో ఉండగా 3,294 ఆర్టీసీ బస్సులను మాత్రమే తిప్పుతున్నారు. అద్దె బస్సుల విషయానికి వస్తే 3,875 ఉండగా 1,652 బస్సులు మాత్రమే తిరుగుతున్నాయి.

### సహకరించని అద్దె బస్సు యజమానులు

ఆర్టీసీ అధికారుల ఉద్దేశపూర్వకమైన అలసత్వం వల్ల ఆర్టీసీ బస్సులే కాదు..అద్దె బస్సులు కూడా పూర్తిస్థాయిలో రోడ్డెక్కడం లేదు. అద్దె బస్సుల్లో కూడా బినామీ పేర్లతో కొంతమంది అధికారులు, యూనియన్ నాయకుల బస్సులు కూడాఉన్నట్లు సమాచారం. అందుకే రాష్ట్ర వ్యాప్తంగా 2,223 బస్సులు తిరుగకుండా ఆపేశారనే నివేదికను రవాణాశాఖ అధికారులు ప్రభుత్వానికి అందజేశారు. నిబంధనల ప్రకారం ప్రభుత్వ ఆదేశాలు పాటించకుండా సహకరించని బస్సుల టెండర్లు రద్దుచేసి కొత్త నోటిఫికేషన్‌తో కొత్త అద్దెబస్సులను ఎంపికచేసే అధికారం ప్రభుత్వానికి ఉంటుంది. ఇదే జరిగితే ఇప్పటివరకు సహకరించని హైర్ బస్సుల పరిస్థితి అగమ్యగోచరంగా మరే అవకాశమున్నది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 8,564 బస్సులు తిరుగుతున్నప్పటికీ ఇందులో ఆర్టీసీ సొంత బస్సులు, అద్దె బస్సులు తక్కువగానే తిరుగుతున్నాయి. టెండరు ఖరారులో భాగంగా అద్దె బస్సులు తప్పనిసరిగా ప్రయాణ అవసరాలు తీర్చాల్సి ఉంటుంది. వీరు కూడా సహకరించడం లేదు. వీటన్నింటిపై ప్రభుత్వానికి అధికారులు నివేదిక ఇచ్చినట్లు తెలిసింది.

**రాష్ట్రవ్యాప్తంగా తిరుగుతున్న వాహనాల వివరాలు**

| బస్సులు | తిరుగుతున్నవి | తిరుగనివి |
|---|---|---|
| ఆర్టీసీ బస్సులు | 3294 | 6912 |
| ఆర్టీసీ హైర్ బస్సులు | 1652 | 2223 |
| ప్రైవేటు బస్సులు | 880 | |
| విద్యాసంస్థల బస్సులు | 409 | |
| మ్యాక్సీ క్యాబ్స్ | 2229 | |
| సెట్విన్ బస్సులు (హైదరాబాద్) | 100 | |
| **మొత్తం** | **8564** | |

**గ్రేటర్‌లో వాహనాల వివరాలు**

| | | | | | తిరుగుతున్నవి | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| జిల్లా | తిరుగుతున్న ఆర్టీసీ బస్సులు | తిరుగని ఆర్టీసీ బస్సులు | తిరుగుతున్న అద్దె బస్సులు | తిరుగని అద్దె బస్సులు | ప్రైవేటు బస్సులు | విద్యాసంస్థల బస్సులు | క్యాబులు | సెట్విన్ బస్సులు |
| మేడ్చల్ | 272 | 1303 | 74 | 123 | 213 | 161 | 200 | -- |
| హైదరాబాద్ | 356 | 0 | 145 | 312 | 152 | 5 | 158 | 100 |
| సంగారెడ్డి | 195 | 355 | 66 | 77 | 55 | 56 | 95 | -- |
| రంగారెడ్డి | 378 | 1138 | 200 | 213 | 188 | 85 | 5 | -- |
| **మొత్తం** | **1203** | **2796** | **485** | **725** | **608** | **307** | **458** | **100** |



ఆదివారం హైదరాబాద్‌లోని టీఎన్జీవోభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న ఉద్యోగసంఘాల జేఏసీ అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి. చిత్రంలో ఉద్యోగ సంఘాల జేఏసీ సెక్రటరీ జనరల్ మమత, సెక్రటరీ మామిళ్ల రాజేందర్, ఇతర సంఘాల నాయకులు తదితరులు ఉన్నారు.

# రాజకీయ సమ్మె

మూడోపేజీ తరువాయి...

ఉద్యోగసంఘాల జేఏసీ సమావేశం జరిగింది. ముందుగా ఆర్టీసీ జేఏసీ నేతలు మద్దతు కోరేందుకు వస్తామని చెప్పడంతో ఉద్యోగ జేఏసీ అత్యవసరంగా సమావేశమైంది. ఆర్టీసీ జేఏసీ ఈ సమావేశానికి హాజరుకాలేదు. ఉద్యోగసంఘాలు పలు అంశాలపై చర్చించాయి. అనంతరం రవీందర్‌రెడ్డి, మమత మీడియాతో మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికుల సమ్మెలో రాజకీయనేతలు చక్రం తిప్పే పరిస్థితి రావటం బాధాకరమని అన్నారు. సకలజనుల సమ్మెలో అందరం కలిసి వచ్చామని, అప్పటి ఉద్యోగ సంఘాల నేతలు స్వామిగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, దేవీప్రసాద్, విఠల్ అంతా కలిసి ప్రతి ఉద్యోగ సంఘం నాయకుడి ఇంటి గడప తొక్కి మద్దతు అడిగారని గుర్తుచేశారు. అప్పుడు తెలంగాణ ఉద్యమాన్ని అడ్డుకుని, అణిచివేసేందుకు సమైక్యనేతల చెప్పుచేతల్లో ఉండి ఉద్యమాన్ని అణిచివేయాలని చూసినవాళ్లే ఇప్పుడు ఆర్టీసీ కార్మికులతో కలిసి సమ్మె చేసేందుకు ముందుకు రావడం కుట్రపూరితమేనని అన్నారు. సమ్మెకు వెళ్తున్నామని ఆర్టీసీ జేఏసీ నాయకులు తమతో ఒక్కమాట కూడా చెప్పలేదని, ఇప్పుడు సమ్మె మొదలైనాక మద్దతు ఇవ్వడం లేదంటూ దుష్ప్రచారం చేస్తున్నారని అభ్యంతరం వ్యక్తంచేశారు. ఆర్టీసీ సమస్యలకు ఉద్యోగ సంఘాలకు సంబంధం లేనప్పటికీ, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం జేఏసీ పక్షాన నిలబడి ఉన్నామన్నారు. ఉద్యోగ సమస్యలపై సీఎం కేసీఆర్‌ను కలిస్తే దాన్ని కూడా రాజకీయకోణంలో చూస్తూ విమర్శిస్తున్నారని మండిపడ్డారు. ఉద్యోగుల సమస్యల కోసం సీఎంతో కాకుంటే ఇంకెవ్వరితో చర్చిస్తామని ప్రశ్నించారు. ఉద్యోగులకు సంబంధించిన 16 అంశాలపై నివేదికను సీఎంకు ఇచ్చామని, ముందుగా ఆర్టీసీ ఉద్యోగసంఘాలు కూడా వారి సమ్మె, డిమాండ్లు చెప్తే 17వ అంశంగా సీఎంకు వివరించేవారమని తెలిపారు. ఉద్యోగసంఘాల జేఏసీ, టీఎన్జీవో, టీజీవో నేతలను విమర్శించే నైతికహక్కు రాజకీయపక్షాలకు లేదని అన్నారు. సమ్మె సాకుగా ఉద్యోగసంఘాలపై ఉద్దేశపూర్వకంగా దుష్ప్రచారం జరుగుతున్నదని చెప్పారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసమే సీఎంతో భేటీ అయ్యామని స్పష్టంచేశారు. భోజన సమయంలో మన ఇంటికి ఎవరు వచ్చినా భోజనంచేయాలని ఆహ్వానిస్తామని, సీఎం కేసీఆర్‌ను కలిసిన రోజు కలెక్టర్లు, డీపీవోలు, అధికారుల సమావేశం జరుగుతున్నదని.. భోజన సమయంలో వెళ్లడంతో అందరితో కలిసి అక్కడే భోజనం చేశామని రవీందర్‌రెడ్డి, మమత వివరించారు. దీన్ని కూడా వక్రీకరించడం బాధాకరమని పేర్కొన్నారు.

### ఆర్టీసీ జేఏసీ కలిస్తే సీఎం దృష్టికి తీసుకెళ్తాం

ఆర్టీసీ జేఏసీ ప్రతినిధులు ఆదివారం వచ్చి సమ్మెకు మద్దతు అంశంపై చర్చిస్తామన్నారని, రెండు గంటలు వారికోసం వేచిచూశామని, కారణాలేమైనా వారు రాకపోవడంతో మద్దతుపై చర్చించుకోలేదని రవీందర్‌రెడ్డి, మమత చెప్పారు. ఆర్టీసీ జేఏసీ తమను కలిసి మాట్లాడితే సమస్యలను సీఎం దృష్టికి తీసుకుపోతామని సూచించారు. రాజకీయపక్షాలతో కలిసి ఏదో చేయాలనే ఉద్దేశం ఉద్యోగసంఘాల జేఏసీకి లేదని తేల్చిచెప్పారు. ఉద్యోగసంఘాలు ప్రభుత్వంలో భాగమేనని తెలిపారు. ఆర్టీసీ జేఏసీ కూడా తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిందని, ఆ తర్వాత ఆర్టీసీ నేతలు ఎలాంటి అంశాల్లోనూ ఉద్యోగసంఘాలతో కలిసిరాలేదని స్పష్టంచేశారు. ఉద్యోగ జేఏసీలో ఆర్టీసీ ఉద్యోగసంఘాలు సభ్యులుగా లేవని చెప్పారు. ఆర్టీసీ కార్మికులు తొందరపాటు చర్యలకు దిగరాదని, యాజమాన్యంపై ఒత్తిడితేవాలని సూచించారు. ఆర్టీసీ కార్మికుల డిమాండ్లు న్యాయబద్ధమేనని, సమస్యలకోసం పోరాటం చేయడం తప్పుకాదని చెప్పారు. కార్మికులు అధైర్యపడవద్దని, ఆత్మహత్యలకు పాల్పడవద్దని రవీందర్‌రెడ్డి, మమత కోరారు. ఖమ్మంలో ఆర్టీసీ డ్రైవర్ శ్రీనివాస్‌రెడ్డి ఆత్మహత్యపై సంతాపం వ్యక్తంచేశారు.

### ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై ఒత్తిడి

ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నామని జేఏసీ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, సెక్రటరీ జనరల్ మమత తెలిపారు. ఈ నెల 21 తర్వాత ఎన్నికల కోడ్ ముగియగానే ప్రభుత్వంపై మరింత ఒత్తిడితెస్తామని, ఉద్యోగులకు సంబంధించిన సమస్యలు తీరుతాయనే నమ్మకం ఉన్నదని పేర్కొన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పాటుపడుతున్న ఉద్యోగుల జేఏసీపై దుష్ప్రచారంచేస్తే సహించబోమని హెచ్చరించారు. రాజకీయ పక్షాలు సమ్మెను చేతుల్లోకి తీసుకోకుండా కాపాడుకోవాలని ఆర్టీసీ జేఏసీకి హితవు పలికారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు చీమూ, నెత్తురు లేదని ఆర్టీసీ జేఏసీ వ్యాఖ్యానించడంపై పలుసంఘాలు ఈ సమావేశంలో ఆగ్రహం వ్యక్తంచేశాయి. ఈ సమావేశంలో జేఏసీ సెక్రటరీలు మామిళ్ల రాజేందర్, ఏనుగుల సత్యనారాయణ, తెలంగాణ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పద్మాచారి, టీటీయూ అధ్యక్షుడు మణిపాల్ రెడ్డి, టీయూటీఎఫ్ అధ్యక్షుడు మల్లారెడ్డి, తెలంగాణ గ్రూప్-1 ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు హనుమంతునాయక్, రెవెన్యూ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వంగ రవీందర్‌రెడ్డి, తెలంగాణ వాణిజ్య పన్నుల శాఖ గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షుడు బీ వెంకటయ్య, నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు జ్ఞానేశ్వర్, తెలంగాణ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ప్రవీణ్, తెలంగాణ పర్యాటకశాఖ కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి సబ్బు రాజమౌళి, అగ్రికల్చర్ యూనివర్సిటీ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, భాషా పండితుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జగదీశ్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుల సంఘం ప్రధాన కార్యదర్శి సురేందర్‌రెడ్డితోపాటు టీఎన్జీవో, టీజీవో ప్రతినిధులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్ల లక్ష్యం 92 లక్షల టన్నులు

మూడోపేజీ తరువాయి...

ప్రారంభించాలని నిర్ణయించింది. స్థానిక అవసరాలను బట్టి రైతులకు అందుబాటులో ఉండేలా ఐకేపీ, పీఏసీఎస్, డీసీఎంఎస్, హాకా ఆధ్వర్యంలో 2,544 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేస్తున్నది. అవసరమైతే అప్పటికప్పుడు కేంద్రాలను నెలకొల్పేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని అధికారులను ఆదేశించింది. ధాన్యాన్ని తీసుకొచ్చిన రైతులు కొనుగోలు కేంద్రాల్లో వేచిఉండాల్సిన పరిస్థితి రాకుండా తగిన చర్యలు తీసుకుంటున్నది. తేమకొలిచే యంత్రాలు, టార్పాలిన్లు, ప్యాడి క్లీనర్స్, విన్నోవింగ్ మిషన్లు, మాయిశ్చరైజ్ మీటర్లు, తాగునీరు, టాయిలెట్స్ వంటి కనీస వసతులు కల్పిస్తున్నది.

### ధాన్యం సేకరణ కమిటీలు

ధాన్యం రవాణా, పర్యవేక్షణ, కనీస మద్దతు ధర, వివిధ విభాగాల మధ్య సమన్వయం కోసం మొదటిసారిగా ప్రభుత్వం రాష్ట్రస్థాయిలో పౌరసరఫరాలశాఖ కమిషనర్ చైర్మన్‌గా రాష్ట్రస్థాయి సమన్వయ కమిటీని ఏర్పాటుచేసింది. ఈ కమిటీలో వ్యవసాయశాఖ కమిషనర్, మార్కెటింగ్‌శాఖ డైరెక్టర్, పోలీస్ శాఖ నుంచి ఒకరు, సీడబ్ల్యూసీ రీజినల్ మేనేజర్, ఎస్‌డబ్ల్యూసీ మేనేజింగ్ డైరెక్టర్, సెర్ప్ సీఈవో, ఎఫ్‌సీఐ జనరల్ మేనేజర్ సభ్యులుగా ఉంటారు. జిల్లాస్థాయిలో జాయింట్ కలెక్టర్ల ఆధ్వర్యంలో ధాన్యం సేకరణ కమిటీలను ఏర్పాటుచేసింది. ఈసారి జిల్లా ఎస్పీ / నగర పోలీస్ కమిషనర్, జిల్లా లేబర్ ఆఫీసర్, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్లను కొత్తగా సభ్యులుగా చేర్చారు.

### కమాండ్ కంట్రోల్ రూంల ఏర్పాటు

ధాన్యానికి కనీస మద్దతు ధర, ఇతర ఫిర్యాదుల కోసం రాష్ట్రస్థాయిలో, జిల్లాస్థాయిలో కంట్రోల్ రూంలను ఏర్పాటుచేయడంతోపాటు, హైదరాబాద్‌లోని పౌరసరఫరాల భవన్‌లో టోల్ ఫ్రీ నంబర్ 180042500333, 1967ను అందుబాటులోకి తీసుకొచ్చింది. పౌరసరఫరాల శాఖ కన్సల్టెంట్ ఆధ్వర్యంలో పౌరసరఫరాలశాఖ డిప్యూటీ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్లు, పౌరసరఫరాల సంస్థ జనరల్ మేనేజర్ (మార్కెటింగ్) సభ్యులుగా హైదరాబాద్ కేంద్ర కార్యాలయంలో సెంట్రల్ మానిటరింగ్ సెల్‌ను కూడా ఏర్పాటు చేయడం జరిగింది.

### అందుబాటులో 12 కోట్ల గోనె సంచులు

55 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్య సేకరణకు 12 కోట్ల గోనె సంచులు అవసరమవుతాయని అధికారులు అంచనావేశారు. ప్రాధాన్య క్రమంలో జిల్లాలు, కేంద్రాల వారీగా గోనె సంచుల పంపిణీకి సిద్ధం చేశారు. ఆన్‌లైన్ ప్రొక్యూర్‌మెంట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఓపీఎంఎస్) ద్వారా రైతుల నుంచి ధాన్యం కొనుగోలు, చెల్లింపుల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటున్నది. రైతులకు ప్రయోజనకరంగా ఉండేలా ఆయాప్రాంతాల్లోని కొనుగోలు కేంద్రాల సమాచారాన్ని ఎస్‌ఎంఎస్ ద్వారా తెలియజేసేలా ఓపీఎంఎస్ సాఫ్ట్‌వేర్ అభివృద్ధి చేసింది.

### రికార్డుస్థాయిలో ధాన్యం కొనుగోళ్లు



సీఎం కేసీఆర్ దూరదృష్టితో చేపట్టిన రైతు సంక్షేమ చర్యలు, ముఖ్యంగా సాగునీటి ప్రాజెక్టులు, 24 గంటల కరంటుతో రాష్ట్రంలో సాగువిస్తీర్ణం పెరిగి ఈ వానాకాలంలో రికార్డుస్థాయిలో ధాన్యం దిగుబడి కానున్నది. మొత్తం 92 లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని నిర్ణయించాం. గతేడాది రెండు సీజన్లు కలిపి 77 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయగా, ఈసారి అదనంగా 15లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయనున్నాం. రైతులు పండించిన ప్రతిగింజను మద్దతు ధరకు కొనుగోలు చేయాలనే లక్ష్యంతో ఉన్నాం.

\- మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, పౌరసరఫరాల సంస్థ చైర్మన్

### ధాన్యం సేకరణకు పక్కాగా ఏర్పాట్లు



ధాన్యం సేకరణ కోసం పూర్తి ఏర్పాట్లుచేస్తున్నాం. సాంకేతికత సాయంతో ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసుకుంటాం. రైస్ మిల్లుల సామర్థ్యం మేరకు ధాన్యం కేటాయిస్తున్నాం. ఆయాజిల్లాల్లో మిగిలిన ధాన్యాన్ని రవాణా వ్యయం దృష్టిలో పెట్టుకొని ఇతర జిల్లాలకు కేటాయిస్తున్నాం. ఈ వానాకాలంలో కేవలం 12 లక్షల టన్నుల రా రైస్‌ను మాత్రమే పౌరసరఫరాల సంస్థ తీసుకుంటున్నది. మిగిలిన ధాన్యాన్ని బాయిల్డ్ రైస్ మిల్లర్లు మిల్లింగ్ చేసి ఎఫ్‌సీఐకి అప్పగించాల్సి ఉంటుంది.

\- అకున్ సబర్వాల్, పౌరసరఫరాలశాఖ కమిషనర్



## కొనసాగుతున్న చేపపిల్లల విడుదల

- ఈ ఏడాది లక్ష్యం 82.23 కోట్లు
- ఇప్పటివరకు 55.60 కోట్ల చేపపిల్లలు విడుదల

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఇటీవల కురిసిన వర్షాలతో రాష్ట్రవ్యాప్తంగా ప్రాజెక్టులు, చెరువులు, కుంటల్లో జలకళ ఉట్టిపడుతున్నది. దీంతో మూడోవంతు నీరు చేరినవాటిల్లో మత్స్యశాఖ ఉచితంగా చేపపిల్లలను వదులుతున్నది. వర్షాలు సమృద్ధిగా కురిసి, అలుగు పోస్తే వేసిన చేపపిల్లలు కొట్టుకుపోయే ప్రమాదం ఉండటంతో అధికారులు ఆచితూచి వదులుతున్నారు. ఈ ఏడాది 22,203 జలాశయాల్లో 82.23 కోట్ల చేపపిల్లలను వదలాలని మత్స్యశాఖ అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటివరకు 12,778 జలాశయాల్లో నీరు చేరడంతో వాటిల్లో దాదాపు 55.60 కోట్ల (60శాతం) చేపపిల్లలను వదిలారు. నీటి సామర్థ్యానికి తగిన సైజులో చేపపిల్లలను పంపిణీ చేసేలా మత్స్యశాఖ మార్గదర్శకాలను రూపొందించింది. మూడేండ్లుగా ఉచిత చేపపిల్లల పంపిణీ పథకాన్ని మత్స్యశాఖ కొనసాగిస్తున్నది. 2016-17లో 27.85 కోట్లు, 2017-18లో 51 కోట్లు, 2018-19లో 49.15 కోట్ల చేపపిల్లలను జలాశయాల్లోకి వదిలింది.

## ఆర్టీసీ డ్రైవర్ మృతికి మంత్రుల సంతాపం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఆర్టీసీ కార్మికుడు శ్రీనివాస్‌రెడ్డి మృతి పట్ల రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ తీవ్ర సంతాపం వ్యక్తంచేశారు. శ్రీనివాస్‌రెడ్డి మరణం బాధించిందని మంత్రులు పేర్కొన్నారు. యూనియన్ల స్వార్థం వల్లనే ఇలాంటి అనర్థాలు ఏర్పడుతున్నాయన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ కార్మికులు కోరినదానికంటే ఎక్కువ పీఆర్సీ ఇచ్చారని, కొత్త బస్సులు, కార్మికుల రెగ్యులరైజేషన్‌కు కూడా అనుమతించారని చెప్పారు. కార్మికులు ఇప్పటికైనా సమ్మె విషయంలో ఆలోచన చేయాల్సిన అవసరం ఉన్నదని.. ప్రాణం అన్నింటికంటే విలువైనదని పేర్కొన్నారు. స్వార్థపూరితమైన రాజకీయపు ఉచ్చులో కార్మికులు పడవద్దని సూచించారు. కార్మికులు సావధానంగా ఆలోచన చేయాలని కోరారు.

# అది ఆక్యుప్రెజర్ రోలర్

తన చేతిలోని వస్తువుపై ప్రధాని మోదీ ట్వీట్



**న్యూఢిల్లీ:** ప్రధాని మోదీ చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో అనధికార భేటీ నేపథ్యంలో రెండు రోజులపాటు తమిళనాడులోని మామల్లాపురంలో పర్యటించిన సంగతి తెలిసిందే. శనివారం అక్కడి బీచ్‌లో మార్నింగ్ వాక్ సందర్భంగా ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించారు. అప్పుడు మోదీ చేతిలో ఉన్న పరికరం ప్రజల్లో ఆసక్తిని కలిగించింది. ఇది ఏమిటన్నదానిపై రకరకాలుగా చర్చించుకున్నారు. ఈ నేపథ్యంలో దీనిపై మోదీ స్పష్టత ఇచ్చారు. 'మామల్లాపురం బీచ్‌లో చెత్త ఏరుతున్నప్పుడు నా చేతిలోని పరికరం ఏమిటని చాలా మంది నిన్నటి నుంచి అడుగుతున్నారు. అది ఆక్యుప్రెజర్ రోలర్. నేను తరచుగా వాడతాను. నాకు ఎంతో మేలు చేస్తున్నది' అని ట్విట్టర్‌లో పేర్కొన్నారు.

# మోదీ ఇన్‌స్టా @ 3 కోట్లు

అత్యధిక ఫాలోవర్లు కలిగిన నేతగా రికార్డు

**న్యూఢిల్లీ:** ప్రధాని మోదీ సోషల్ మీడియాలో దూసుకుపోతున్నారు. ఇన్‌స్టాగ్రామ్‌లో ఫాలోవర్ల సంఖ్య 3 కోట్లు దాటింది. ప్రపంచ రాజకీయ నేతల్లో ఇన్‌స్టాగ్రామ్‌లో అత్యధిక ఫాలోవర్లు ఉన్న నేత మోదీనే కావడం విశేషం. తర్వాతి స్థానాల్లో అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా (2.48 కోట్లమంది ఫాలోవర్లు), అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్(1.49 కోట్ల మంది ఫాలోవర్లు) ఉన్నారు. ఈ విషయాన్ని బీజేపీ కార్యనిర్వాహక అధ్యక్షుడు జేపీ నడ్డా తెలిపారు. ట్విట్టర్లో మోదీకి 5.07 కోట్ల మంది ఫాలోవర్లు ఉన్నారు. సామాజిక మాధ్యమాల్లో అత్యధిక ఫాలోవర్లు గల ముగ్గురు ప్రముఖ నేతల్లో మోదీ ఒకరని గాలప్ అంతర్జాతీయ సర్వే పేర్కొంది.

# 'చెత్త' రాజకీయం ఎల్లకాలం సాగదు

- మోదీపై రాజస్థాన్ సీఎం అశోక్ గెహ్లాట్ వ్యాఖ్య
- దేశభద్రతకు ముప్పు వాటిల్లుతున్నా చెత్త ఏరుకుంటున్నారు: అసదుద్దీన్

**జైపూర్/ చెన్నై/ హైదరాబాద్:** తమిళనాడులోని మామల్లాపురంలో సముద్ర తీరాన ప్రధాని మోదీ ప్లాస్టిక్ వ్యర్థాలను ఏరడంపై కాంగ్రెస్, ఎంఐఎం విమర్శలు ఎక్కుబెట్టాయి. రాజస్థాన్ సీఎం అశోక్ గెహ్లాట్ ఆదివారం మీడియాతో మాట్లాడుతూ 'ప్లాగింగ్ ద్వారా జాతికి సందేశం ఇవ్వాలని ప్రధాని నరేంద్రమోదీ కోరుకుంటే ఎవరికీ ఇబ్బంది లేదు. చెత్త ఏరివేస్తున్న పేరుతో ప్రజాస్వామ్యాన్ని కాలరాయాలని భావిస్తే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారు' అని అన్నారు. ఇలాంటి రాజకీయాలు ఎంతోకాలం మనుగడ సాగించలేవని వ్యాఖ్యానించారు. దర్యాప్తు సంస్థలపై ఒత్తిడి తీసుకొస్తూ.. ఐటీ దాడుల ద్వారా కాంగ్రెస్ నేతలను ప్రధాని మోదీ లక్ష్యంగా చేసుకున్నారని ఆరోపించారు. తమిళనాడు పీసీసీ అధ్యక్షుడు కేఎస్ అళగిరి స్పందిస్తూ.. ప్రధాని పర్యటన నేపథ్యంలో ముందుగానే పారిశుద్ధ్య సిబ్బంది ఈ ప్రాంతాన్ని పరిశుభ్రం చేశారని గుర్తు చేశారు. అయినా ప్రధాని అక్కడ ప్లాస్టిక్ వ్యర్థాలతో కూడిన చెత్త ఏరడం 'నాటకమా' అని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ట్విట్టర్ వేదికగా స్పందిస్తూ.. 'దేశ భద్రతకు చైనా సవాల్ విసురుతున్నా.. ప్రధాని మోదీ చెత్త ఏరడంలో బిజీగా గడుపొచ్చు' అని ఎద్దేవా చేశారు. భారత సరిహద్దు వరకు రైల్వే లైన్ల నిర్మాణం గురించి జిన్‌పింగ్ మాట్లాడుతున్నారని గుర్తు చేశారు.



# చితిపై నుంచి లేచి కూర్చున్నాడు

ఒడిశాలో విచిత్ర ఘటన



**బరంపురం(ఒడిశా), అక్టోబర్ 13:** చనిపోయాడనుకొని ఓ వ్యక్తిని అతని కుటుంబ సభ్యులు స్మశానవాటికకు తీసుకెళ్లారు. చితి పేర్చి అంతిమ సంస్కారాలను నిర్వహిస్తున్న క్రమంలో ఆ వ్యక్తి తన తలను నెమ్మదిగా అటూ, ఇటూ తిప్పడం ఆరంభించాడు. ఆ తరువాత నిద్రలోనించి లేచినట్టుగా ఒక్కసారిగా లేచి కూర్చున్నాడు. అంతే, అంతిమ సంస్కారాల తంతుకు సాయపడుతున్న వాళ్లు భయంతో కాళ్లకు పనిచెప్తూ పరుగు లంకించుకున్నారు. ఈ ఘటన ఒడిశాలోని గంజాం జిల్లాలో ఆదివారం చోటుచేసుకున్నది. కపఖల్లా గ్రామంలో నివసిస్తున్న సిమనాచ్ మల్లిక్ (55) పశువులకాపరి. శనివారంనాడు తన గొర్రెలు, మేకల్ని దగ్గర్లోని అడవిలోకి మేతకు తీసుకెళ్లాడు. అయితే, అనారోగ్యం కారణంగా మల్లిక్ అక్కడే స్పృహ కోల్పోయి పడిపోయాడు. ఆరోజు సాయంత్రం పశువులు ఇల్లు చేరుకున్నప్పటికీ, మల్లిక్ తిరిగి రాలేదు. దీంతో ఆయన కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. ఆదివారం ఉదయం అడవి గుండా వెళ్తున్న కొందరు మల్లిక్ కదలకుండా పడి ఉండటాన్ని గమనించి ఆయన కుటుంబ సభ్యులకు తెలియజేశారు. అయితే, మల్లిక్ చనిపోయాడని భావించిన అతని కుటుంబ సభ్యులు అంతిమ సంస్కారాలకు సిద్ధమయ్యారు. అయితే, అదే సమయంలో మల్లిక్‌కు స్పృహ రావడంతో అతన్ని వెంటనే సమీప దవాఖానకు తరలించారు. నీరసం, ఎక్కువగా జ్వరం ఉండటం వల్లే మల్లిక్ స్పృహ కోల్పోయాడని, చికిత్స అనంతరం అతని పరిస్థితి నిలకడగా ఉన్నదని దవాఖాన వైద్యుడు తెలిపారు. స్పృహ కోల్పోయిన తన భర్తను దవాఖానలో చూపించకుండా.. స్మశానానికి తీసుకెళ్లడంపై తాను చింతిస్తున్నట్టు మల్లిక్ భార్య సోలి కన్నీటి పర్యంతమయ్యారు.

# చనిపోయిన బిడ్డను పూడ్చాలని గొయ్యి తవ్వితే..

## బతికున్న బిడ్డ దొరికింది

యూపీలో అరుదైన ఘటన



**బరేలీ(యూపీ):** పురిట్లోనే నూరేండ్లు నిండిన తన కూతురిని పూడ్చిపెట్టడానికి స్మశానవాటికకు ఓ తండ్రి వెళ్లాడు. బిడ్డను పూడ్చేందుకు గొయ్యి తవ్వుతున్న క్రమంలో మూసిపెట్టిన ఓ మట్టి కుండ చేతికి తగిలింది. తెరిచి చూసిన ఆయనకు మతిభ్రమించినంత పనైంది. ముక్కుపచ్చలారని ఆడ పసికందు అత్యంత కష్టంగా ఊపిరితీస్తూ కనిపించింది. తేరుకున్న అతను ఆ పసిగుడ్డును సమీప దవాఖానలో చేర్పించి ప్రాణం పోశాడు. ఈ అనూహ్య ఘటన ఉత్తర్ ప్రదేశ్‌లోని బరేలీలో జరిగింది. హితేశ్ కుమార్ సిరోహి అనే వ్యాపారి భార్య వైశాలి. బరేలీలో సబ్‌ఇన్‌స్పెక్టర్‌గా ఆమె విధులు నిర్వహిస్తున్నారు. గర్భవతి అయిన వైశాలి గురువారం ఓ ప్రైవేట్ దవాఖానలో నెలలు నిండని ఆడ శిశువుకు జన్మనిచ్చారు. పురిట్లోనే చనిపోయిన బిడ్డను సిరోహి దగ్గర్లోని స్మశానానికి తీసుకెళ్లి అంతిమ సంస్కారాలు నిర్వహించేందుకు గొయ్యి తవ్వాడు. మూడు అడుగుల లోతులో ఆయన చేతికి ఓ కుండ తగిలింది. తెరిచి చూస్తే, ఓ ఆడ పసికందు చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతూ కనిపించింది. వెంటనే దవాఖానకు తరలించి చికిత్స అందించాడు. ప్రస్తుతం శిశువు పరిస్థితి నిలకడగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు. పసి బిడ్డను పాతిపెట్టిన వారికోసం వెదుకుతున్నట్టు ఎస్పీ అభినందన్ సింగ్ పేర్కొన్నారు. శిశువు చికిత్స ఖర్చుల్ని బిథరి చైన్‌పూర్ ఎమ్మెల్యే రాజేశ్ మిశ్రా భరిస్తున్నట్లు చెప్పారు.

# సెయింట్ థ్రెసియా

- పునీతురాలిగా ప్రకటించిన పోప్ ఫ్రాన్సిస్
- మరో నలుగురికి సైతం 'సెయింట్' హోదా





వాటికన్‌లో థ్రెసియాను సెయింట్‌గా ప్రకటించడంతో హర్షం వ్యక్తం చేస్తున్న భారతీయులు.. (పక్కన) ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న పోప్ ఫ్రాన్సిస్

**వాటికన్ సిటీ, అక్టోబర్ 13:**

కేరళకు చెందిన ప్రఖ్యాత క్రిస్టియన్ సన్యాసిని మరియం థ్రెసియాకు 'పునీతురాలు' హోదా దక్కింది. ఆదివారం వాటికన్ నగరంలోని సెయింట్ పీటర్ స్క్వేర్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో పోప్ ఫ్రాన్సిస్.. మరియం థ్రెసియాను 'సెయింట్'గా ప్రకటించారు. ఆమెతోపాటు ఇంగ్లండ్‌కు చెందిన కార్డినల్ జాన్ హెన్రీ న్యూమన్, స్విట్జర్లాండ్‌కు చెందిన మార్గరైట్ బేస్, బ్రెజిల్‌కు చెందిన సిస్టర్ డుల్స్ లోప్స్, ఇటలీకి చెందిన సిస్టర్ గియుసెప్పినా వన్నినికి కూడా సెయింట్‌హుడ్‌ను ప్రకటించారు. 'వీరందరి ద్వారా ప్రభువుకు కృతజ్ఞతలు తెలుపుతున్నాం' అని ఈ సందర్భంగా పోప్ ఫ్రాన్సిస్ వ్యాఖ్యానించారు. సెయింట్ పీటర్స్ బెసిల్లికాలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి వేలాది మంది భక్తులు హాజరయ్యారు. భారత్ నుంచి వెళ్లిన ప్రతినిధుల బృందానికి విదేశాంగ శాఖ సహాయ మంత్రి వీ మురళీధరన్ నేతృత్వం వహించారు. బ్రిటన్ రాజు ప్రిన్స్ చార్లెస్‌తోపాటు వివిధ దేశాల ప్రతినిధులు సైతం ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. 'థ్రెసియా.. జీసస్ బాటలో నడుస్తూ పేదలకు సహాయం చేశారు. రోగులకు వైద్యం చేశారు. ఒంటరిగా జీవిస్తున్నవారి వద్దకు వెళ్లి, వారిని ఓదార్చారు. ఆమెకు ప్రవచనం, స్వస్థత చేకూర్చడం, దివ్యత్వం, పారవశ్యం వంటి అనేక మహత్యాలు ఉండేవి. ఎన్నో దురాత్మలు ఆమెను జీవితాంతం వేధించాయి. అయినా ఈ ప్రపంచంలోని పాప విముక్తికోసం ఆమె ఆ వేదనను భరించారు' అని వాటికన్ న్యూస్ ఒక ప్రకటనలో కొనియాడింది. ఇటీవల ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మన్ కీ బాత్‌లో సైతం థ్రెసియా సేవలను కొనియాడారు. థ్రెసియా కేరళలోని పుతెన్‌చిరాలో 1876 ఏప్రిల్ 26న జన్మించారు. ఆమె పూర్తిపేరు థ్రెసియా చిరమెల్ మంకిడియాన్. థ్రెసియా 16 ఏండ్ల వయసు నుంచే సామాజిక సేవలో పాల్గొనడం ప్రారంభించారు. ఆమె కోరిక మేరకు 1904లో ఆమె పేరుకు ముందు 'మరియం'ను కలిపారు. థ్రెసియా 1914లో కేరళలోని త్రిసూర్‌లో 'కాంగ్రిగేషన్ ఆఫ్ ద సిస్టర్స్ ఆఫ్ హోలీ ఫ్యామిలీ' అనే సంస్థను స్థాపించారు. అదే ఏడాది 38 ఏండ్ల వయసులో నన్‌గా మారారు. పేదలకు చాలా సేవలు చేశారు. 50 ఏండ్ల వయసులో 1926 జూన్ 8న తుదిశ్వాస విడిచారు.

## ఒకే చర్చి నుంచి నలుగురు పునీతులు

పోప్ ఫ్రాన్సిస్ ఆదివారం మరియం థ్రెసియాకు పునీతురాలి హోదా ప్రకటించడంతో కేరళలోని సైరో మలబార్ చర్చి ఓ అరుదైన ఘనతను సాధించింది. వందల ఏండ్ల చరిత్ర ఉన్న ఈ చర్చి నుంచి ఇప్పటివరకు నలుగురు సెయింట్ హోదా పొందారు. మొదటిసారిగా 2008లో సిస్టర్ అల్ఫోన్సాను సెయింట్‌గా ప్రకటించగా, 2014లో ఫాదర్ కురియాకోస్ ఎలాయిస్ చవర(చవర అకెన్), సిస్టర్ ఎవుప్రసియమ్మ (ఎవుప్రసియా)ను పునీతులుగా ప్రకటించారు. తాజాగా థ్రెసియాకు ఆ గౌరవం దక్కింది.

## నా వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నా

కేంద్ర మంత్రి రవిశంకర్ ప్రసాద్



**న్యూఢిల్లీ:** దేశ ఆర్థిక పరిస్థితిని సినిమా కలెక్షన్లతో ముడిపెడుతూ తాను చేసిన వ్యాఖ్యలపై విమర్శలు రావడంతో కేంద్ర మంత్రి రవిశంకర్‌ప్రసాద్ స్పందించారు. ఆ వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నట్లు చెప్పారు. 'అక్టోబర్ 2న మూడు సినిమాలు రూ.120 కోట్లను వసూలు చేశాయి. దేశ ఆర్థిక వ్యవస్థ బలంగా లేకపోతే కేవలం మూడు సినిమాలు ఒక్కరోజులోనే అన్ని కోట్లు ఎలా వసూలు చేయగలవు' అని రవిశంకర్ వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. దీనిపై తీవ్ర విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రి తన వ్యాఖ్యలపై వివరణ ఇచ్చారు. 'నేను చేసిన వ్యాఖ్య వాస్తవానికి సరైనదే. సినీ పరిశ్రమ లక్షలాది మందికి ఉపాధి కల్పిస్తుండడం పట్ల గర్విస్తున్నా. మీడియా సమావేశానికి సంబంధించిన నా వీడియో మొత్తం సామాజిక మాధ్యమాల్లో అందుబాటులో ఉంది. నా వ్యాఖ్యలను మీడియా వక్రీకరించింది. అయినా వాటిని వెనక్కి తీసుకుంటున్నా' అని పేర్కొన్నారు.

# 370ని పునరుద్ధరించే దమ్ముందా?

- మ్యానిఫెస్టోలో పెట్టగలరా?
- ప్రతిపక్షాలకు ప్రధాని మోదీ సవాల్
- 40 ఏండ్లుగా అశాంతితో రగిలిన కశ్మీర్‌ను నాలుగు నెలల్లో సాధారణ స్థితికి తెచ్చామని వెల్లడి






**జలగావ్, అక్టోబర్ 13:** జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే ఆర్టికల్ 370 రద్దు విషయంలో ప్రతిపక్షాలపై ప్రధాని నరేంద్రమోదీ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. దమ్ముంటే.. 370, 35ఏ అధికరణలను తిరిగి తీసుకొస్తామని తమ ఎన్నికల మ్యానిఫెస్టోలో పొందుపరచాలని సవాల్ విసిరారు. విపక్షాలు మొసలి కన్నీరు కార్చడం మానుకోవాలని, ఆర్టికల్ 370ని తిరిగి తీసుకురావాలని ప్రయత్నిస్తే వారికి రాజకీయ భవిష్యత్తు ఉండదని స్పష్టం చేశారు. జమ్ముకశ్మీర్ కేవలం కొంత భూభాగం మాత్రమే కాదని, భారతదేశానికి మకుటమని చెప్పారు. ఈ నెల 21న మహారాష్ట్ర అసెంబ్లీకి ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ఆదివారం జలగావ్, భండారాలో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభల్లో ప్రధాని మాట్లాడారు. ప్రతిపక్ష కాంగ్రెస్, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీలు (ఎన్సీపీ) ఆర్టికల్ 370 రద్దు అంశాన్ని రాజకీయం చేస్తున్నాయని ఆయన ధ్వజమెత్తారు. వాటి మాటలు పొరుగుదేశం తరహాలోనే ఉన్నాయని పరోక్షంగా పాకిస్థాన్‌ను ప్రస్తావించారు. గతంలో ఊహించడానికి కూడా సాహసించని నిర్ణయాన్ని తాము ధైర్యంగా చేపట్టామని, 40 ఏండ్లుగా అశాంతితో రగులుతున్న కశ్మీర్‌లో నాలుగు నెలల్లోనే సాధారణ పరిస్థితులను నెలకొల్పామని చెప్పారు. ఏండ్లుగా వేర్పాటువాదం, ఉగ్రవాదంతో సతమతమైన కశ్మీర్‌లో పేదలు, మహిళలు, దళితులు, పీడిత వర్గాల అభివృద్ధికి చోటు ఉండేది కాదన్నారు. జమ్ము, కశ్మీర్, లడఖ్‌లలో వాల్మీకి సామాజిక వర్గ ప్రజలు కనీసం తమ హక్కులను కూడా పొందలేకపోయారన్నారు. 'వాల్మీకి సోదరులను హత్తుకునే భాగ్యం నాకు కలిగిందని ఈ రోజు నేను భగవాన్ వాల్మీకి ఎదుట శిరస్సు వంచి చెప్పగలను' అని ప్రధాని పేర్కొన్నారు.

**ట్రిపుల్ తలాక్‌ను మళ్లీ తీసుకురాగలరా..?**

ట్రిపుల్ తలాక్ రద్దు అంశంపైనా విపక్షాలపై ప్రధాని విమర్శలు గుప్పించారు. ముస్లిం మహిళలకు న్యాయం దక్కకుండా చేయాలని ప్రతిపక్షాలు ప్రయత్నించాయని ధ్వజమెత్తారు. ముస్లిం తల్లులు, సోదరీమణులకు తానిచ్చిన మాటను నిలబెట్టుకున్నట్లు చెప్పారు. దమ్ముంటే ట్రిపుల్ తలాక్‌ను మళ్లీ తీసుకురావాలని ప్రతిపక్షాలకు సవాల్ విసిరారు.

**నవభారత నిర్మాణం**

బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ సర్కారుపై మరోసారి విశ్వాసం ఉంచి లోక్‌సభ ఎన్నికల్లో అఖండ మెజార్టీతో గెలిపించినందుకు ప్రజలకు మోదీ కృతజ్ఞతలు తెలిపారు. శక్తిమంతమైన నవభారత నిర్మాణానికి ప్రజలు ఓటేశారని చెప్పారు. ఈ తీర్పు వల్లే నేడు భారత గళాన్ని ప్రపంచం వింటున్నదని పేర్కొన్నారు. దేవేంద్ర ఫడ్నవీస్ నేతృత్వంలోని మహారాష్ట్ర ప్రభుత్వంపై ఆయన ప్రశంసలు కురిపించారు. ఫడ్నవీస్ అవినీతి రహిత పాలనను అందించారని, రైతులు, పారిశ్రామిక వర్గాల్లో విశ్వాసాన్ని పాదుగొల్పారని చెప్పారు. మరోసారి ఫడ్నవీస్‌కు అవకాశమివ్వాలని ప్రజలను ప్రధాని అభ్యర్థించారు.

**గ్రామాల అభివృద్ధికి రూ.25 లక్షల కోట్లు..**

ప్రస్తుతం ప్రపంచం సవాళ్లతో కూడిన సమయాన్ని ఎదుర్కొంటున్నదని, అయితే ఈ సవాల్‌ను ఎదుర్కొనగల శక్తి భారత్‌కు ఉందని ప్రధాని పేర్కొన్నారు. ప్రజలు తమపై ఉంచిన విశ్వాసమే ఇందుకు కారణమని, పెద్ద నిర్ణయాలు తీసుకునేందుకు అది తమకు స్ఫూర్తినిస్తున్నదని చెప్పారు. ఇంతకుముందు గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై ప్రభుత్వాలు దృష్టి సారించలేదని, తమ ప్రభుత్వం గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి 25 లక్షల కోట్ల రూపాయలను వెచ్చిస్తున్నదని తెలిపారు.

# రాజ్యాంగం వల్లే మాకు సంతోషం

- మెజారిటీ ఉదారత్వం వల్ల కాదు
- ఆరెస్సెస్ చీఫ్ వ్యాఖ్యలపై అసదుద్దీన్ మండిపాటు



**హైదరాబాద్:** హిందువుల వల్లే భారతదేశంలోని ముస్లింలు సంతోషంగా ఉన్నారని ఆరెస్సెస్ అధినేత మోహన్ భగవత్ చేసిన వ్యాఖ్యపై అఖిల భారత మజ్లిస్ ఏ ఇత్తెహాదుల్ ముస్లిమీన్ (ఏఐఎంఐఎం) అధినేత అసదుద్దీన్ ఒవైసీ మండిపడ్డారు. 'మేం సంతోషంగా ఉన్నది దేశ రాజ్యాంగం వల్లే తప్ప, మెజారిటీ హిందువుల ఉదారవాదం వల్ల కాదు' అని పేర్కొన్నారు. 'భారత్‌లో నా చరిత్రను మోహన్ భగవత్ తుడిచేయలేరు' అని ఆదివారం ట్వీట్‌చేశారు. ముస్లింల సంస్కృతి, విశ్వాసాలు హిందూయిజం నుంచి రాలేదన్నారు. 'భారత్‌కు హిందూ పేరు పెట్టి నా చరిత్రను మోహన్ భగవత్ తుడిచేయలేరు. అది సాధ్యం కాని పని. హిందూయిజం వల్లే మా సంస్కృతులు, విశ్వాసాలు, మతాలు, ప్రత్యేక గుర్తింపులు వచ్చాయని ఆయన చెప్పలేరు' అని పేర్కొన్నారు. 'విదేశీ ముస్లింలతో మమ్మల్ని అనుసంధానించేందుకు భగవత్‌కు అర్హత లేదు. ఆయన ప్రయత్నం వల్ల నాలోని భారతీయత ఏమాత్రం తగ్గదు. హిందూ ఆధిపత్యాన్ని ప్రదర్శించే హిందూ దేశం మాకు ఆమోదయోగ్యం కాదు' అని అన్నారు.

# కేసుల వల్ల 22 కేజీలు తగ్గాను

ఆజంఖాన్ భావోద్వేగం

**రాంపూర్:** తనపై నమోదైన కేసుల కారణంగా 22 కేజీల బరువు తగ్గినట్లు సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ ఆజంఖాన్ పేర్కొన్నారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని రాంపూర్ అసెంబ్లీ నియోజకవర్గానికి జరుగనున్న ఉప ఎన్నికల్లో ఆయన భార్య తజీన్ ఫాతిమా బరిలో నిలిచారు. ఆమె తరపున ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఆజంఖాన్.. తనపై నమోదైన కేసులను ప్రస్తావిస్తూ భావోద్వేగానికి లోనయ్యారు. 'సుదీర్ఘ రాజకీయ జీవితంలో నేను ఒక్క కేజీ కూడా పెరుగలేదు. కానీ కేసుల కారణంగా 22 కేజీలు తగ్గాను. లోక్‌సభ ఎన్నికల విజయం తర్వాత ఇదే నాకు దక్కింది' అని పేర్కొన్నారు. తనపై నమోదైన కేసులకు సంబంధించి ఆజంఖాన్ ఇదివరకే విచారణకు హాజరయ్యారు.

# జాబిల్లిని చూస్తే ఉద్యోగాలొస్తాయా?

- మోదీ సర్కార్‌పై రాహుల్ విసుర్లు
- సంపన్నులకు రుణమాఫీ, రైతుల కడగండ్లపై మీడియా మౌనం వహిస్తున్నదని వ్యాఖ్య



**లాతూర్/ ముంబై, అక్టోబర్ 13:** ఉద్యోగావకాశాల కల్పనలో కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం తీరుపై కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాహుల్‌గాంధీ నిప్పులు చెరిగారు. తమకు పని కల్పించాలని యువత కోరితే చందమామను చూడాలని కేంద్ర ప్రభుత్వం కబుర్లు చెబుతున్నదని ఇటీవల చంద్రయాన్-2 ప్రయోగాన్ని గుర్తు చేస్తూ వ్యాఖ్యానించారు. 'ఉద్యోగాలు కల్పించాలని యువత కోరుతుంటే 370 అధికరణం (రద్దు) గురించి, జాబిల్లి గురించి సర్కార్ కబుర్లు చెబుతుంది. కానీ దేశం ఎదుర్కొంటున్న సమస్యలపై మాత్రం మౌన ముద్ర వహిస్తుంది' అని మండిపడ్డారు. చంద్రుడిపైకి ఇస్రో ఉపగ్రహాన్ని ప్రయోగించినంత మాత్రాన మహారాష్ట్రలోని పేదల కడుపు నిండదన్నారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం ఆయన లాతూర్‌లోని ఔసాలో జరిగిన సభలో మాట్లాడారు. కీలక అంశాలపై ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, మీడియాను తప్పుదోవ పట్టిస్తున్నాయని ధ్వజమెత్తారు. 'ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్‌షా, మీడియా పనితీరు కీలక అంశాలపై ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఉంది. రైతుల కడగండ్లు, ఉద్యోగాల కొరతపైనా మీడియా నిశ్శబ్దంగా ఉంది. సంపన్నులకు రుణమాఫీపై మీడియా మౌనం వహిస్తున్నది. మీడియా సంస్థలకు సంపన్నులే సారథ్యం వహిస్తున్నారు' అని పేర్కొన్నారు. కేవలం 15 మంది సంపన్నులకు మాత్రమే రూ. 5.5 లక్షల కోట్ల రుణాలను మోదీ ప్రభుత్వం మాఫీ చేసిందని రాహుల్ ఆరోపించారు. 'ఇటీవల చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్‌తో భేటీలో 2017 డోక్లాం ప్రతిష్టంభన గురించి ప్రశ్నించారా? అన్న సంగతి దేశ ప్రజలు తెలుసుకోవాలని భావిస్తున్నారన్నారు. మరోవైపు, ముంబైలోని చాందీవాలీలో జరిగిన ఎన్నికల సభలో రాహుల్ మాట్లాడుతూ.. ఫ్రాన్స్ నుంచి కొనుగోలు చేసిన రాఫెల్ యుద్ధ విమానాల సామర్థ్యంపై బీజేపీకి సందేహాలు ఉన్నట్లున్నాయని ఎద్దేవా చేశారు.

# '370'రద్దును సమర్థిస్తున్నారా? లేదా?

ప్రతిపక్షాలకు అమిత్ షా ప్రశ్న



**కొల్హాపూర్, అక్టోబర్ 13:** జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370ని కేంద్ర ప్రభుత్వం రద్దు చేయడాన్ని కాంగ్రెస్, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీలు సమర్థిస్తున్నాయా? లేదా? అని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రశ్నించారు. 370ని రద్దు చేయడానికి గత పాలకులు ధైర్యం చేయలేకపోయారని, కానీ 56 అంగుళాల ఛాతి ఉన్న ప్రధాని మోదీ ఆ ధైర్యం చేశారని చెప్పారు. జమ్ముకశ్మీర్‌ను భారత ప్రధాన స్రవంతిలో చేర్చడానికి ఆర్టికల్ 370 అడ్డంకిగా ఉండేదని, దాన్ని రద్దు చేయడం ద్వారా ఇప్పుడు ప్రధాన స్రవంతిలో కలిసిపోయిందని తెలిపారు. ఆదివారం ఆయన మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో నిర్వహించిన ఎన్నికల సభలో మాట్లాడుతూ.. తమకు రెండోసారి అధికారం కట్టబెట్టిన ప్రజలకు మంచి పని చేయాలనుకున్న ప్రధాని మోదీ 70 ఏండ్ల నుంచి అపరిష్కృతంగా ఉన్న ఆర్టికల్ 370 సమస్యను పరిష్కరించారని తెలిపారు. పాకిస్థాన్‌కు చెందిన చొరబాటుదారులు మన సైనికులను చంపుతుంటే యూపీఏ పాలనలో ప్రధానిగా ఉన్న మన్మోహన్‌సింగ్ ఒక్క మాట కూడా మాట్లాడలేదని చెప్పారు. కానీ యురి, పుల్వామా ఉగ్రదాడుల అనంతరం తాము ఉగ్రస్థావరాలపై దాడులు జరిపించి ప్రతీకారం తీర్చుకున్నామని పేర్కొన్నారు.

# మా సైన్యాన్ని పంపిస్తాం

- ఉగ్రవాదాన్ని అంతం చేయాలనుకుంటే సాయం చేస్తాం
- పాకిస్థాన్‌కు రాజ్‌నాథ్ ఆఫర్



**కర్నాల్ (హర్యానా), అక్టోబర్ 13:** ఉగ్రవాదాన్ని అంతం చేసేందుకు పాకిస్థాన్ కృత నిశ్చయంతో ఉంటే.. అందుకు భారత్ సహకారం అందిస్తుందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. అవసరమైతే పాకిస్థాన్‌కు సైనికులను పంపేందుకు కూడా భారత్ సిద్ధంగా ఉందన్నారు. 'పాక్ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌కు నేను ఒక సలహా ఇవ్వదలచుకున్నా. ఉగ్రవాద వ్యతిరేక పోరాటానికి మీరు నిబద్ధతతో ఉంటే.. సాయం అందించడానికి మేం సిద్ధం. మీరు మా సైన్యం కావాలని కోరితే.. మీకు సాయం చేసేందుకు మా బలగాలను అక్కడకు పంపుతాం' అని రాజ్‌నాథ్ పేర్కొన్నారు. ఆదివారం హర్యానాలోని కర్నాల్‌లో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన పాల్గొన్నారు. 'నేను ఇమ్రాన్ ప్రసంగం విన్నా. కశ్మీర్‌కు స్వేచ్ఛ కల్పించే వరకు పోరాటం కొనసాగిస్తామని ఆయన చెప్పారు. అంతర్జాతీయ వేదికలపై కశ్మీర్ అంశాన్ని ప్రస్తావిస్తూనే ఉంటామని కూడా ఆయన పేర్కొన్నారు. కశ్మీర్ గురించి మర్చిపోండి. ఎప్పటికీ దాని గురించి ఆలోచించద్దు. మీరు కశ్మీర్‌ను లేవనెత్తినా, ఏమీ జరుగదు. మాపై ఎవ్వరూ ఒత్తిడి తేలేరు' అని రాజ్‌నాథ్ స్పష్టంచేశారు.

# రుణాలు.. స్మార్ట్ ఫోన్లు..

హర్యానాలో ఎన్నికల మ్యానిఫెస్టోను విడుదల చేసిన బీజేపీ

**చండీగఢ్:** హామీ లేకుండా దళితులకు రూ.3 లక్షల వరకు రుణాలు ఇస్తామని బీజేపీ తెలిపింది. ఈ నెల 21న జరుగనున్న హర్యానా అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ఆ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోను విడుదల చేసింది. రాష్ట్రంలోని 25 లక్షల యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణను ఇస్తామని, ఏడాదికి రూ.1.80 లక్షల లోపు ఆదాయం, లేదా ఐదు ఎకరాలలోపు వ్యవసాయ భూమి ఉన్నవారు డిజిటల్ అక్షరాస్యత సర్టిఫికెట్ కలిగి ఉంటే స్మార్ట్ ఫోన్లను అందజేస్తామని మ్యానిఫెస్టోలో పేర్కొంది.

# యూపీలో 11 స్థానాలకు 21న పోలింగ్

విజయావకాశాలపై బీజేపీ, కాంగ్రెస్ ధీమా

**లక్నో:** ఉత్తర్‌ప్రదేశ్ అసెంబ్లీలోని 11 స్థానాలకు జరిగే ఉప ఎన్నికల్లో తమదే విజయమని అధికార బీజేపీ ధీమా వ్యక్తం చేస్తున్నది. ఏకపక్ష ఫలితాలే వస్తాయని ఆ పార్టీ నేతలు అంటున్నారు. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో తుడిచిపెట్టుకుపోయిన విపక్షాలు సైతం మెరుగైన ఫలితాలు వస్తాయని ఆశాభావంతో ఉన్నాయి. 11 స్థానాలకు 110 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. ఇటు బీజేపీ, అటు కాంగ్రెస్ నేతలు తమ అభ్యర్థుల విజయంపై ధీమాగా ఉన్నారు. ఈ రెండు పార్టీలతోపాటు సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ), బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) లతో పూర్తిగా చతుర్ముఖ పోటీలు జరుగనున్నాయి. మహారాష్ట్ర, హర్యానా అసెంబ్లీలతోపాటే యూపీలోని 11 స్థానాలకు కూడా ఈ నెల 21న పోలింగ్ జరుగనున్నది. ఇటీవలే యూపీసీసీ అధ్యక్షుడిగా నియమితుడైన అజయ్‌కుమార్ లల్లూ మాట్లాడుతూ.. 'కార్యకర్తలు సమస్యలను అధిగమించి పార్టీ కోసం ఉమ్మడిగా కృషి చేయాలని' అని పిలుపునిచ్చారు. బీజేపీ యూపీ అధ్యక్షుడు స్వతంత్రదేవ్ సింగ్ మాట్లాడుతూ ఉప ఎన్నికల ఫలితాలు బీజేపీకి అనుకూలంగా ఏకపక్షంగా వస్తాయన్నారు.


**తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ** — **టెండరు ప్రకటన**

తెలంగాణ రాష్ట్రంలో గుర్తించిన రూట్లలో నడిపేందుకు 'హైర్ స్కీమ్' క్రింద బస్సులను సరఫరా చేయుటకై ... టి.ఎస్.ఆర్టీసీ దరఖాస్తులు కోరుచున్నది. ... 15-10-2019 నుండి టి.ఎస్.ఆర్.టి.సి వెబ్ సైట్ https://tsrtc.telangana.gov.in నందు ఉంచబడును. ...

No.P9/359(55)2018-OPD(P), Dt:13-10-2019

**అమ్మకం ప్రకటన**

**కామినేని స్టీల్ & పవర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ (లిక్విడేషన్‌లో ఉన్నది)**
**నమోదిత కార్యాలయం: "కామినేని", 4వ అంతస్తు, కింగ్ కోఠి, హైదరాబాద్, తెలంగాణ-500001**
**లిక్విడేటర్ చిరునామా: T-202, టెక్నోపోలిస్, 1-10-74/B, రత్నదీప్ సూపర్ మార్కెట్ పైన, చికోటి గార్డెన్స్, బేగంపేట్, హైదరాబాద్-500016.**

**ఇన్‌సాల్వెన్సీ అండ్ బ్యాంకరప్టసీ కోడ్, 2016 క్రింద E-వేలం**

ఇన్‌సాల్వెన్సీ అండ్ బ్యాంకరప్టసీ బోర్డ్ ఆఫ్ ఇండియా (లిక్విడేషన్ ప్రాసెస్) రెగ్యులేషన్స్, 2016లోని రెగ్యులేషన్ 32(e) క్రింద 26-10-2018 తేదీ గల ఉత్తర్వు ప్రకారం **గౌరవనీయ నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (NCLT), హైదరాబాద్ బెంచ్** ద్వారా నియమించబడిన లిక్విడేటర్‌చే నడుస్తున్న సంస్థగా కంపెనీ **M/s కామినేని స్టీల్ & పవర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ (లిక్విడేషన్‌లో ఉన్నది)** (''కంపెనీ'') యొక్క విక్రయం.
ఆసక్తిగల దరఖాస్తుదారులు కంపెనీ వెబ్‌సైట్ **https://www.kaminenis-teelpower.com** వద్ద లభించే ఆన్‌లైన్ ఇ-వేలం నియమ నిబంధనలు, ఇ-వేలం బిడ్ ఫారం, అర్హత ప్రమాణాలు, బిడ్డర్ల ద్వారా డిక్లరేషన్, ప్రాసెస్ పార్టిసిపేషన్ ఫీజు మొదలైన వివరాలు కలిగిన కంప్లీట్ ఇ-ఆక్షన్ ప్రాసెస్ ఇన్ఫర్మేషన్ డాక్యుమెంట్‌ను రిఫర్ చేయవచ్చును. వేలం అమ్మకం ఇ-వేలం ప్లాట్‌ఫారం **http://ncltauction.auctiontiger.net** ద్వారా నిర్వహించబడుతుంది.

| వివరణ | అమ్మకం విధానం | తనిఖీ తేది | వేలం తేది మరియు సమయం | రిజర్వు ధర INR | బయానా మొత్తం & డాక్యుమెంట్ల దాఖలు గడువు తేది | బిడ్ పెంపుదల మొత్తం |
|---|---|---|---|---|---|---|
| కంపెనీ మొత్తంగా | నడుస్తున్న సంస్థగా | 7 నవంబర్ 2019 | 14 నవంబర్ 2019, ఉ. 11.30 గం. నుండి మ. 3.30 గం. | రూ. 610 కోట్లు | రూ. 5 కోట్లు, 9 నవంబర్, 2019 | రూ. 5 లక్షలు |

E- వేలం వివరాల కొరకు సంప్రదించండి శ్రీ తిలక్ మరాఠా (+91-6351896834/ 079-61200586), Ms. Neha Gyani (079-61200574) లేదా లిక్విడేటర్. E-మెయిల్: neha.gyani@auctiontiger.net, tilak.maratha@auctiontiger.net

సం/- CS R. రామకృష్ణ గుప్తా, లిక్విడేటర్,
IBBI Reg No.: IBBI/IPA-002/IP-N00012/2016-17/10029
తేది: 12-10-2019
ప్రదేశం: హైదరాబాద్
E-మెయిల్: rp.ramakrishnagupta@gmail.com

# చెలిమె



## ప్రకటనలు

### ఓల్గాకు శిఖామణి సాహితీ పురస్కారం

సాహిత్యంలో జీవన సాఫల్య కృషికి గాను రచయిత్రి ఓల్గాకు శిఖామణి సాహితీ పురస్కారం-2019ని ప్రకటించారు. 2019 అక్టోబర్ 20న సాయంత్రం 5 గంటలకు యానాంలోని గీతాభవన్‌లో జరిగే పురస్కార ప్రదాన సభలో మల్లాడి కృష్ణారావు, డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్,కె.శివారెడ్డి, డాక్టర్ డి. విజయభాస్కర్, ఖాదర్ మొహియుద్దీన్, డాక్టర్ ఆర్. సీతారాం, డాక్టర్ కె.ఎన్. మల్లీశ్వరి, మధునాపంతుల పాల్గొంటారు. డాక్టర్ ఆలూరి విజయలక్ష్మి, ఎల్.ఆర్.స్వామి, అదృష్టదీపక్, శాంతినారాయణ, భూసురపల్లి వెంకటేశ్వర్లు, సన్నిధానం నరసింహశర్మ, మువ్వా శ్రీనివాసరావు, గూటం స్వామి 'కవిసంధ్య ప్రతిభా పురస్కారం' అందుకుంటారు. ఈ సందర్భంగా శిఖామణి కవితా సంపుటి 'యానాం కవితలు' ఆవిష్కరణ ఉంటుంది.

**- దాట్ల దేవదానంరాజు,**
**శిఖామణి సాహితీ పురస్కారం అధ్యక్షులు**

### డాక్టర్ వేదగిరి రాంబాబు పురస్కారాల ప్రదానోత్సవం

తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో సింహప్రసాద్ సాహిత్య సమితి నిర్వహణలో పురస్కారాల ప్రదాన సభ 2019 అక్టోబర్ 14న సాయంత్రం 6 గంటలకు హైదరాబాద్ రవీంద్రభారతిలో జరుగుతుంది. వేదగిరి రాంబాబు బాల సాహిత్య పురస్కారం-ఎమ్‌వీవీ సత్యనారాయణ, కథానికా పురస్కారం- వహీద్‌ఖాన్ అందుకుంటారు. శ్రీ విహారి అధ్యక్షతన జరుగు సభలో డాక్టర్ కె.వి.రమణాచారి, ఎ.ఎన్. జగన్నాథ శర్మ, డాక్టర్ పత్తిపాక మోహన్ గౌరవ అతిథులుగా హాజరవుతారు. వానిశ్రీ సభా నిర్వహణ చేస్తారు..

**- సింహప్రసాద్, కన్వీనర్**

### ఆహ్వానం

2019, అక్టోబర్ 16 బుధవారం రోజున సాయంత్రం 6 గంటలకు హైదరాబాద్, బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం షోయబ్ హాల్‌లో అమ్జద్ రచించిన 'తొలకరి చినుకులు' కవితా సంపుటి, 'పూలచాదర్' కథా సంపుటి ఆవిష్కరణ సభ ఉంటుంది. ఈ సభకు కవి యాకూబ్ అధ్యక్షత వహిస్తారు. కె.శివారెడ్డి, ఏనుగు నరసింహారెడ్డి, ఎం.నారాయణశర్మ, వాహెద్‌లు హాజరు కానున్నారు. అందరూ ఆహ్వానితులే.

**- కవి సంగమం, పాలపిట్ట బుక్స్**

### ఆవిష్కరణ సభ

2019, అక్టోబర్ 17 గురువారం రోజున సాయంత్రం 6 గంటలకు హైదరాబాద్‌లోని రవీంద్రభారతి, కాన్ఫరెన్స్‌హాల్‌లో డాక్టర్ నందిని సిధారెడ్డి రచించిన 'నూరుపూలు' ముందుమాటల ఆవిష్కరణ సభ జరుగనున్నది. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో జరిగే ఈ ఆవిష్కరణ సభలో కె.శివారెడ్డి, డాక్టర్ నాళేశ్వరం శంకరం, డాక్టర్ కాశీం, డాక్టర్ గుమ్మన్నగారి బాల శ్రీనివాసమూర్తి, డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి, డాక్టర్ వి.శంకర్, డాక్టర్ బెల్లంకొండ సంపత్‌కుమార్, కందుకూరి శ్రీరాములు, డాక్టర్ తూర్పు మల్లారెడ్డిలు హాజరుకానున్నారు. అందరికీ ఆహ్వానం.

**- తెలంగాణ రచయితల సంఘం**

### కథాసాగరం-2019

కథలను చదువడంలో ఒకరకమైన అనుభూతి ఉంటే, వినడంలో మరో రకమైన అనుభూతి ఉంటుంది. కథలను చదువడానికి సమయం లేని వారు వినడానికి ఇష్టపడుతారు. కథలను వినేటప్పుడు కథలోని ఎమోషన్స్ ఇంకా బాగా అర్థమవుతాయి. కథాసాగరం పేరుతో ప్రతిలిపి నిర్వహించే అతిపెద్ద జాతీయ కథల పోటీలో పాల్గొని మీ కథలను ఆడియో చేసుకునే సౌకర్యం పొందండి. చివరి తేదీ 2019, నవంబర్ 5. వివరాలకు.. జాని తక్కెడశిల, 7259511956 నంబర్‌లో సంప్రదించండి.



## అమర హరితం!

మనకు మనం
దిగంబరమై
నాగరికత గురించి మాట్లాడుకుంటున్నం
పర్యావరణంపై
ఆందోళన పడుతున్నం !

మూడొందల గజాల ప్లాట్లో
ఆరంతస్తుల బంగ్లా
నీడనిచ్చే చెట్టుకు అడ్రస్ లేదు

ఇండ్లు, గోడలు మిద్దెల మీద
రంగురంగుల టాటా స్కైలు, నెట్వర్క్ టవర్లు
హోదాకు సంకేతంగా
గేట్ల ముందర టామీలు
పచ్చదనం పంచే చెట్లు
కిచకిచ స్వాగతాలు పలికే పిట్టలేవి

తడి తగులకుండా నిండుగా గ్రానైట్ మార్బుల్
మట్టి అంటకుండా పార్కింగ్ ఫ్లోరింగ్ టైల్స్
రోడ్లు అద్దాలై, బావులు భవంతులై
చెరువులు రియల్ లై
భూమి వ్యాపారమై మెరుస్తుంటే
చెట్టు భరోసా నేలను వెతుకుతున్నది
ఆసరయ్యే మనిషిని గాలిస్తున్నది

పేపర్ ప్లేట్లల్ల డిన్నర్ లు
ప్లాస్టిక్ గ్లాసుల్ల డ్రింక్స్
పాలప్యాకెట్లు, విత్తనాలు
కిరాణం సరుకు రవాణాలు
ప్లాస్టిక్ వియ్యాలై నేలను కబలిస్తున్నయి

నెత్తిన ముండ్లకంపేసుకొని
శరీర గోడలకు ఎయిర్ కూలర్లు
ఏసీలను బిగించుకుంటున్నం
తలంబ్రాలు తద్దినాలకు విరివిగా క్రాకర్స్
పుట్టలో పాలు పోసినా నెత్తిన కిరీటం మొలిచినా
వీధులన్నీ డీజేల హింసల విన్యాసాలు
మట్టి జీవితాలన్ని మల్టిప్లెక్స్ లైనంక
హరితహారాలకు మానవహారాలైతున్నం

ఆస్తికోసం అమ్మయ్యలను రాత్రిపూట
రోకలిబండతో మోదినట్లు
కనిపించిన ప్రతి చెట్టును దరువాజను చేస్తే
అడవి నగరమైనాక
ఇగుర్లపై సెమినార్లు దట్టించి దంచుతున్నం

గుట్కాలూ,గోవాలు
పాన్ మహల్‌లు దసరా దీపావళులై
పొగాకు జర్దాలు ఉగాదులు సంక్రాంతులై
దవడలు గిర్నీలై భక్షాల్లా నములుతూ
స్వచ్ఛభారత్ లకై కోటి దీపాల్నీ వెలిగిస్తున్నం
ప్రకృతి పర్యావరణానికై నిప్పుల్లో నడుస్తున్నం

చెట్లుంటేనే
మైసమ్మలు పోషమ్మలు పొలిచల్లుకునేది
చెట్లుంటేనే
ఋతుపవనాలు స్వేచ్ఛగా వీచేది
చెట్టుకిందనే
మహాతపస్సు ఫలించి సిద్ధార్థుడు
జ్ఞాన బుద్ధుడైంది
చెట్లు చిగురిస్తేనే చరిత్ర ఇగురుపోసేది

ఎన్కట
ఏ తోవల నడిచినా
సైన్యం పహారా కాస్తున్నట్లు ఆకుపచ్చ చెట్లు
ఇప్పుడు
సరిహద్దుల ఉగ్రవాదుల చేతుల్లో
హతమైన మరిత అమరులు

**- వనపట్ల సుబ్బయ్య, 9492765358**







నా పుస్తకాలు ఇంకా ముందే ఇంగ్లిష్‌లోకి అనువాదమై ఉంటే నా జీవితం ఎట్లా ఉండేదా అని ఒక్కోసారి ఆశ్చర్యంగా ఉంటుంది. ఇంగ్లిష్ ప్రపంచ భాష. ఏదైనా పుస్తకం ఇంగ్లిష్‌లోకి వస్తే సార్వజనీనమవుతుంది. గ్లోబల్ పబ్లికేషన్ అవుతుంది. ఇది వాంఛనీయం కాదు. కానీ ప్రపంచంలోని భిన్న ప్రాంతాల రచయితలకు ఇదొక జీవిత వాస్తవికత.

## గమ్యంలేని సంచారం

**జాత్యభిమానం బలంగా గల పోలిష్ సంప్రదాయ సమాజంలో ఓల్గా టోకర్క్‌జుక్ ఒక సంచలనం. శాకాహారి, మహిళావాది. పోలెండ్ ఒక బాధిత సమాజంగా మాత్రమే కాదు, చరిత్రలో ఆధిపత్యం నెరిపిన సందర్భాలను కూడా గుర్తించాలని ఆమె అన్నప్పుడు పోలిష్ సంప్రదాయ సమాజం భగ్గుమన్నది. ఆమెను దేశద్రోహిగా ముద్రవేసింది. ఆమె పుస్తకాల ప్రచురణకర్త అంగరక్షకులను ఏర్పాటు చేయవలసి వచ్చింది. అయినా ఓల్గా సాహిత్యం ఆమెను ప్రపంచ సాహిత్యంలో నిలిపాయి. దేశంలోని అత్యున్నత సాహితీ అవార్డు నైక్‌ను ఆమె రెండుసార్లు అందుకున్నారు.**

సాహిత్యంలో 2018 సంవత్సరపు నోబెల్ పురస్కారాన్ని అందుకున్న ఓల్గా టొకర్క్‌జుక్ పోలిష్ భాషలో రాసిన 'బెగునీ' అనే నవలను ఇంగ్లిష్‌లోకి జెనిఫెర్ క్రాఫ్ట్ 'ఫ్లైట్స్' పేరుతో అనువదించారు. బెగునీ అంటే నిరంతర సంచారం వల్ల దుష్ట ప్రభావం ఉండదని నమ్మే ఒక క్రైస్తవ సంచార కాల్పనిక తెగ. కానీ ఈ నవల ఒక సంచార తెగ గురించిన కథనం కాదు. మానవ జీవితాల సంచారం ఇందులో ద్యోతకమవుతుంది. ఈ నవలలో ఒక దగ్గర చేరిన మనుషులంతా ఒక తెగ కాదు. ఎవరి జీవనాలు, ప్రయాణాలు వారికి. ఎవరికి వారుగానే ఒక చోట కలుస్తారు. ప్రయాణాలు సాగిస్తుంటారు.

ఫ్లైట్ సారాంశం ప్రకారమే అయితే ఇదొక నవల కాదు. అనేక ఖండికలు ఉల్లుల్లుగా అతుక్కపోయి ఉంటయి. మానవ శరీరం, చలనం వివరించే అనేక కథలు ఇందులో ఉంటయి. ఇట్లా చెప్పడం కూడా ఈ నవల గురించి సంపూర్ణంగా చెప్పినట్టు కాదు. ఇందులో అనేక కథలు చిన్న ముక్కలుగా కనిపిస్తయి. ద్రవ రూపంలో అతుకుబొతుకు లేనట్టుగా నవల నిండా పరచుకుని ఉంటాయి. అర నిండా అనేక కుతూహలాలు! జీవుల చరిత్ర మ్యూజియం నిర్మాణానికి ముందున్నట్టుగా ఉంటుంది. అనేక భిన్న పరిమాణాల సొరుగులు.. అందులో వీక్షకులకు ఆసక్తిదాయకంగా .. జంతువులు, మొక్కల జాతుల నమూనాలు, ఖనిజాలు, మానవ నిర్మితాలు. ఒక సొరుగు తెరిస్తే మరో సొరుగు కనిపిస్తుంది. వాటిలో అనేక నిక్షేపాలు. ఎవరి జీవిత కథలు వారివి. సెలవుల సందర్భంగా యాత్రకు వెళ్ళినప్పుడు భార్య, కొడుకు తప్పిపోయిన మనిషి వెదుకులాట. మానవ అంగాలను గాజు సీసాల్లో భద్రపరిచే వైద్యుడి ఆలాపనలు. రసాయన లేపనం చేసిన రాజోద్యోగి భౌతికకాయం ప్రదర్శనకు పెట్టిన నేపథ్యంలో- కుమార్తె వ్యథార్థ లేఖల పరంపర. ఈ కథనాలన్నీ వేటికవే.. కానీ ఏదో తాత్త్విక భావజాలం వాటిని కలుపుతుంది.

మానవ అవయవాలు (తెగిన అవయవం, ఖననం చేయడానికి కొంచబోతున్న గుండెకాయ, చేతిపై పచ్చబొట్టు), ప్రయాణాలు (పటాలు, విమానాశ్రయాలు, రహదారులు, పడవలు) ఇవన్నిటి మధ్య ఒక్కో అధ్యాయంలో నిర్మలత్వం. వీటిని చదువుతూ ఉంటే టెలిస్కోప్‌ను అటూఇటూ తిప్పుతూ ప్రపంచాన్ని చూస్తున్నట్టు ఉంటుంది. ఓల్గా నవలలోని పాత్రలు ఇతరులతో కలిసిపోవడానికి ఇబ్బంది పడుతుంటాయి. కథనాలన్ని విడిగా ఉంటాయి కనుక ప్రజల ముడుచుకున్న స్వభావాన్ని ఒలిచి చూపుతూ ఉంటుంది. భిన్న స్రవంతుల భావజాలాలు అభిరుచులను కలగాపులంగా కలబోసినట్టు సాగుతుంది. ఇందులో పాత్రలకు పరస్పర సంబంధం ఉండదు. అయినా ఒకే ప్రదేశంలోకి చేరుతారు కనుక ఒక దగ్గర ఉంటారు. విమానాశ్రయం కావచ్చు, మ్యూజియం కావచ్చు. ఏదో వింతదనం, అధివాస్తవికత నిండిపోయినట్టుగా కనిపిస్తుంది. రచయిత్రి ఓల్గా టోకర్క్‌జుక్ భిన్న అంశాలపై చర్చిస్తారు. కానీ పాత్రలన్నీ వింతగానూ ఉంటాయి.

ఈ పుస్తకాన్ని ఏకబిగిన చదివితే తలనొప్పి రావడం ఖాయం. చాక్లెట్స్ అన్నీ నోట్లో కుక్కుకున్నట్టుగా ఉంటుంది. తీరికగా ఒక్కో చాక్లెట్‌ను చప్పరించినట్టుగా కొంతకొంత చదువాలె. ఇదొక గమ్యం లేని ప్రయాణం. సూటిగా సాగే కథను కోరుకునే పాఠకులు నిరాశపడుతరు. కానీ భూమి అంచులు దాటి ప్రయాణించాలనే బాపతు మనుషులకు మాత్రం ఈ 'సంచారం' నచ్చుతుంది.

**- సిల్వియా మారినో- గార్సియా**
**(కెనడా రచయిత్రి, ఎడిటర్, ప్రచురణకర్త)**

**ఎన్పీఆర్ సౌజన్యంతో...**

పాశ్చాత్య మీడియా యుద్ధాన్ని సొమ్ము చేసుకుంటున్నది. మొదట మీరు బాంబులు కురిపిస్తారు. ఆ తరువాత వాటి కథనాలు ప్రచారం చేసి సొమ్ము చేసుకుంటారు. మొదట విధ్వంసం చేసి ఆ తరువాత శాంతిదూతల అవతారం ఎత్తే దేశాల మాదిరిగానే మీడియా కూడా వ్యవహరిస్తున్నది.

## నోబెల్ వివాదం

**నోబెల్ బహుమతి వివాదాలకు అతీతం కాదు. ఈ నోబెల్ కమిటీ ఎప్పుడూ యూరప్ దాటి బయటకు రాదనేది ఒక విమర్శ. 1913లో రవీంద్రనాథ్ టాగోర్‌కు సాహిత్యంలో నోబెల్ బహుమతి లభించింది. దీంతో యూరప్ కేంద్రంగా ఉండే ఈ బహుమతి ప్రపంచస్థాయికి ఎదిగిందనే అభిప్రాయం ఏర్పడ్డది. కానీ ఇప్పటికీ యూరప్, ఉత్తర అమెరికా రచయితలకే ఈ పురస్కారం ఎక్కువగా లభిస్తూ ఉంటుంది. ఈసారి రెండేండ్ల బహుమతులూ యురోపియన్ రచయితలకే లభించాయి.**

ఆసియాకు చెందిన మరో ఇద్దరికి కూడా నోబెల్ పురస్కారం లభించింది. లాటిన్ అమెరికాకు చెందిన గాబ్రియెలా మిస్త్రాల్, మైగెల్ ఏంజిలా ఆస్టురియాస్, పాబ్లో నెరుడా, గాబ్రియెల్ గార్సియా మార్క్వెజ్‌లకు లభించడం కొంత ఊరట. కెన్యాకు చెందిన గూగీ థియాంగో, సిరియా దేశపు ఆదోనిస్ వంటి గొప్ప రచయితలను నోబెల్ కమిటీ ఎందుకు గుర్తించడం లేదనే విమర్శలున్నాయి. ఆఫ్రికాకు చెందిన వోలె సోయింకా, గార్డిమెర్, మేరీ యో వర్గాస్ లోసా కూడా నోబెల్ బహుమతి లభించింది. టోనీ మారిసన్ ఆఫ్రికన్ అమెరికన్ రచయిత కూడా ఈ పురస్కారం అందుకున్నారు. అయినా నోబెల్ బహుమతి ప్రపంచస్థాయికి ఎదుగలేదనేది వాస్తవం.

ఈ ఏడాది సాహిత్య రంగ నోబెల్ పురస్కారం పీటర్ హండ్‌కేకు ప్రకటించడం పట్ల ప్రపంచ వ్యాప్తంగా సాహితీవేత్తలలో వ్యతిరేకత వ్యక్తమైంది. యుగోస్లావియా ముక్కలైన నేపథ్యంలో జాతుల వైరం నెలకొని ఊచకోతలు సాగాయి. ఈ నేపథ్యంలో ఊచకోతకు పాల్పడిన సెర్బ్ నాయకుడు మైలొసెవిక్‌ను హండ్‌కే సమర్థించాడు. యుద్ధనేరాలకు పాల్పడిన మైలొసెవిక్ విచారణను ఎదుర్కొంటున్న దశలోనే మరణించాడు. హండ్‌కే ఆయన అంత్యక్రియలకు హాజరై నివాళి అర్పిస్తూ మాట్లాడాడు. ఊచకోతను సమర్థించిన రచయితకు నోబెల్ పురస్కారం ఇవ్వడమేమిటనే విమర్శలు అమెరికా, యూరప్ అంతటా వెల్లువెత్తుతున్నాయి. కానీ హండ్‌కే పాశ్చాత్య దేశాల ప్రచారాన్ని తప్పు పడుతున్నాడు. ఇరాక్, లిబియా, అఫ్ఘనిస్థాన్, సిరియా దేశాల కన్నా ముందే అమెరికా నేతృత్వంలోని నాటో దళాలు సెర్బియాలో విధ్వంసం సృష్టించాయి. పాశ్చాత్య మీడియా ఏకపక్షంగా వ్యవహరిస్తున్నదనేది హండ్‌కే ఆరోపణ. నాటో క్రిమినల్స్ సెర్బియాపై బాంబులు కురిపిస్తే, ఆ సెర్బియానే నా నివాస స్థలమవుతుంది అన్నాడాయన. పాశ్చాత్య మీడియా యుద్ధాన్ని సొమ్ము చేసుకుంటున్నాయి. మొదట మీరు బాంబులు కురిపిస్తారు. ఆ తర్వాత వాటి కథనాలు ప్రచారం చేసి సొమ్ము చేసుకుంటారు. మొదట విధ్వంసం చేసి ఆ తర్వాత శాంతిదూతల అవతారం ఎత్తే దేశాల మాదిరిగానే మీరు కూడా అని హండ్‌కే మీడియాను దుయ్యబట్టాడు. ఇటీవల కొసోవా అల్బేనియన్ శరణార్థులను కూడా ప్రస్తావిస్తూనే, నాటో బాంబుదాడుల వల్ల బాధితులైన సెర్బులను కూడా ప్రస్తావించారు. ఆ పరిస్థితుల్లో మైలొసావిక్ చేయగలిగేదే చేశాడు అంటూ సమర్థించాడు. 1996 నాటి ట్రావెలాగ్- 'ఎ జర్నీ టు ది రివర్స్: జస్టిస్ ఫర్ సెర్బియా' వివాదం సృష్టించిం ది. బెల్‌గ్రేడ్‌పై నాటోబాంబు దాడులకు నిరసనగా 1999లో జర్మనీ ప్రతిష్ఠాత్మక బ్యూష్న ర్ ప్రైజ్‌ను హండ్‌కే తిరస్కరించారు. సెర్బుల పరిస్థితిని నాజీల పాలనలో యూదులతో పోల్చి ఆ తర్వాత ఈ వ్యాఖ్యను ఉపసంహరించుకున్నారు. ఇందుకు జర్మన్‌ల మనోభావాలు దెబ్బతింటాయనే కారణం కావచ్చు. సెర్బుల పట్ల ఆయన వైఖరిలో మాత్రం మార్పు లేదు. అయితే బోస్నియా తదితర జాతులపై ఊచకోతలను ఖండించాల్సిందే. ఈ ఘర్షణలను ప్రేరేపించి, దాడులకు దిగిన నాటో దుశ్చర్యల మూలాలను గుర్తించి తప్పు పట్టాల్సిందే.

## తెలంగాణ కథాన్వేషి 'ముదిగంటి'

**తెలంగాణలో** కవులు లేరని ఎవరో ఆంధ్ర అహంకారి చేసిన ఆరోపణలకు గోలకొండ కవుల సంచిక ద్వారా చెంపపెట్టు లాంటి సమాధానం చెప్పారు ఆనాడు సురవరం ప్రతాపరెడ్డి. ఈ పట్టుదల నేటికీ తెలంగాణ పరిశోధకులలో ఉండటం హర్షణీయం. ఇక్కడ గొప్ప కథకులు ఉన్నారని తెలంగాణ తొలితరం కథలు ద్వారా నిరూపించారు డాక్టర్ ముదిగంటి సుజాతారెడ్డి. హైదరాబాద్ రాష్ర్టాన్ని ఆంధ్రప్రదేశ్‌లో విలీనం చేయకమునుపే సుమారు 80కి పైగా కథకులను వెలుగులోకి తెచ్చారు సుజాతారెడ్డి. వారి పరిశోధనకు రెండవ భాగం తొలినాటి కథలులో సహ సంపాదకులుగా సంగిశెట్టి శ్రీనివాస్ సహకారం అందించారు.

సుజాతారెడ్డి సంపాదకత్వంలో వచ్చిన అమూల్యగ్రంథం తెలంగాణ తొలితరం కథలు. తెలంగాణ కథపై పరిశోధన చేసేవారికి దీపం లాంటి గ్రంథమిది. 35 మంది తొలితరం కథకుల కథలు ఇందులో చోటుచేసుకున్నాయి. మొదటి కథగా మాడపాటి హనుమంతరావు రాసిన మల్లికా గుచ్ఛము కథల సంపుటి నుంచి స్వీకరించిన హృదయశల్యము అనే కథ కాకతీయుల కాలం నాటి ఓరుగల్లు వైభవాన్ని తెలియజేస్తున్నది. ఈ కథ 1912 జనవరి ఆంధ్రభారతి పత్రికలో ప్రచురితమైంది. 1927 సెప్టెంబర్లో సుజాతలో ప్రచురించబడిన కథ ఒద్దిరాజు రాఘవ రంగారావు రాసిన లండన్ విద్యార్థి. వరంగల్లు ప్రాంతానికి చెందిన వీరు తెనుగు పత్రిక వ్యవస్థాపకులుగా సుప్రసిద్ధులు. 1927 డిసెంబర్‌లో సుజాత పత్రికలోనే అచ్చయిన మరొక కథ పరమాణువులో మేజువాని. ఈ కథా రచయిత సిరుగూరి జయరావు. అటు సైన్స్ ఇటు ప్రబంధ పాండిత్యం అటు గ్రాంథికము ఇటు తెలంగాణ మాండలికం మేళవించిన కథ ఇది. ఆ రోజుల్లోనే విజ్ఞానశాస్త్రం ఇతివృత్తంగా కథ రావడం విశేషం. ఒద్దిరాజు సోదరులలో ఒకరు ఒద్దిరాజు సీతారామ చంద్రరావు రాసిన కథ రక్తమూల్యం. 1928 మార్చి నెలలో సుజాత పత్రికలో ప్రచురించబడింది. కర్తవ్య పాలన, సంఘ సంస్కరణ దృష్టి, దేశభక్తి, మానవతా దృక్పథం ఈ కథలో అద్భుతంగా చిత్రీకరించబడ్డాయి. తెలంగాణ భీష్ముడిగా ప్రసిద్ధికెక్కిన ఆదిరాజు వీరభద్రరావు రాసిన ఆదిలక్ష్మి కథ ఇంకొకటి. 1928 జులై నెలలో సుజాత పత్రికలో ప్రచురించబడింది.

స్వాతంత్ర సమరయోధుడు నందగిరి వెంకటరావు రచించిన కథ ప్రతిఫలం. 1934 మే నెలలో భారతి పత్రికలో ప్రచురితమైనది. గోల్కొండను ఔరంగజేబు జయించే చారిత్రక ఘట్టం ఇందులో చిత్రించబడింది. ఎల్లాప్రగడ సీతాకుమారి రాసిన ఈ రాధే నా అనే కథ పసి పిల్లలను ముసలివారికి ఇచ్చి వివాహం చేసే దుష్ట సంస్కృతిని చిత్రించింది. ఈ కథ 1938 జూలై నెలలో భారతిలో ప్రచురితమైనది. సామాజిక ఇతివృత్తం కలిగిన కథ సంఘాల పంతులు. సురవరం ప్రతాపరెడ్డి రాశారు.

1940లో ఆంధ్రకేసరిలో వచ్చిన కథ తిరుగుబాటు. కథారచయిత వెంకట రాజన్న అవధాని. స్త్రీ విద్య ఆవశ్యకతను తెలియజేస్తూ స్త్రీ స్వేచ్ఛను కాంక్షించిన కథ ఇది. నల్లగొండ జిల్లా చిత్తలూరు గ్రామానికి చెందిన బోయినపల్లి రంగారావు రచించిన కథ వారం రోజుల అవస్థ. ఒక కథ రాయడానికి కథకుడు పడే అవస్థను ఈ కథలో చిత్రిక పట్టారు. 1940లో ఆంధ్రకేసరి పత్రికలో ఈ కథ ప్రచురితమైనది. గోపాలరెడ్డి రాసిన కథ గప్ చుప్. పేద రైతుల దీన స్థితిని ఈ కథలో వర్ణించారు. 1940 ఆంధ్రకేసరిలో ఈ కథ ప్రచురించబడింది. నందగిరి ఇందిరాదేవి రాసిన కథ పందెం. 1941 జనవరి నెలలో గృహలక్ష్మి పత్రికలో ప్రచురించబడింది. 10 సంవత్సరాల పాటు గృహనిర్బంధం చేయబడిన వ్యక్తి ఈ ప్రపంచం పట్ల వైరాగ్యభావన ప్రకటించడం ఈ కథలో కనిపిస్తుంది. తెలియక ప్రేమ తెలిసి ద్వేషము కథా రచయిత కాళోజీ నారాయణరావు. ఈ కథలో హాస్యం వ్యంగ్యం అద్భుతంగా పండించారు కాళోజీ నారాయణరావు.

1945లో వచ్చిన జైలుకథల సంపుటిలో ఒక చక్కని కథ సమాధి స్థలం. పొట్లపల్లి రామారావు రాశారు. భూమి ఆక్రమణ, పేదల బతుకులు చిత్రణ ఈ కథలో ఇతివృత్తం. బూర్గుల రామకృష్ణారావు కుమారుడు బూరుగుల రంగనాథరావు రాసిన కథ ప్రమాదం. 1942లో భారతి పత్రికలో అచ్చయింది. ప్రేమ ఇతివృత్తంగా చమత్కారమైన కల్పనలతో సాగిన కథ ఇది. నల్లగొండ జిల్లా చండూరు ప్రాంతానికి చెందిన ధరణి కోట శ్రీనివాస్‌రావు రచించిన కథ చల్ల పులుసు. నీలగిరి సాహిత్య సమితి వ్యవస్థాపకులు. అన్నంలోకి అనే పేరుతో కథాసంపుటి వేశారు. ఇవి అలభ్యము. సంఘ సంస్కరణ భావాలను చిత్రించే కథ ఆత్మఘోష. ఇది జి.రాములు రాశారు. 1945లో ముద్రితమైంది. నల్లగొండ జిల్లా సూర్యాపేట సమీపంలోని రావిపాడు గ్రామానికి చెందిన కాంచనపల్లి చిన వెంకటరామారావు రాసిన కథ చెరువు ఒడ్డున. తెలంగాణలో దొరలు దేశ్‌ముఖ్‌లపై సాధారణ ప్రజల తిరుగుబాటు ఈ కథలో ఇతివృత్తం ఇది 1946లో రాశారు. పీవీ నరసింహారావు రాసిన సుప్రసిద్ధ కథ గొల్ల రామవ్వ 1949లో కాకతీయ పత్రికలో విజయ కలం పేరుతో అచ్చయింది.

జి.సురమౌళి రాసిన అంగుడు పొద్దు కథ నాటి తెలంగాణ సమాజాన్ని ప్రతిబింబించింది. భాస్కరభట్ల కృష్ణారావు రాసిన ఇజ్జత్ కథలో తెలంగాణ రైతు జీవితం తెలంగాణ గ్రామీణ వాతావరణం కనిపిస్తాయి. వెల్దుర్తి మాణిక్యరావు రాసిన ఎయిర్ మేల్ కథ భార్యాభర్తల అనురాగాన్ని చిత్రించింది. పి.వెంకటరామారావు రాసిన కథ కొత్త నాగలి. మృగశిర కార్తెలో రైతుల ఏరువాక సంబురాలను చిత్రించింది. నవ దంపతుల మధ్య ప్రేమానురాగాలను వ్యక్తీకరించిన మరొక కథ పెండ్యాల చిన్న రాఘవరావు రచించిన తిరిగిరాను.

సుజాతారెడ్డి తెలంగాణ తొలితరం కథలు కథా సంపుటం ద్వారా తెలంగాణలో మొదటితరం నుంచే సామాజిక అంశాలు కథావస్తువులు అయ్యాయనే విషయం తెలుస్తుంది. భాష విషయంలోనూ గ్రాంథికం నుంచి వ్యవహారిక భాష వరకు రచయితలు కథలు మలిచిన విధానం, పాత్రోచిత మాండలికాలను ఉపయోగించడం గమనించవచ్చు. వస్తువు విషయంలో మాత్రం తెలంగాణ కథ సామాజిక అంశాలకే పెద్దపీట వేసింది. కథ నిర్మాణం శిల్పం విషయంలో కాలక్రమేణా పరిణతి కనిపిస్తుంది. తెలంగాణ తొలితరం కథల సంకలనం తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక. తెలంగాణ భాషాశైలికి సంస్కృతి సంప్రదాయాలకు పట్టుగొమ్మ.

ఈ సంకలనం వెలువరించడంలో డాక్టర్ ముదిగంటి సుజాతారెడ్డి కృషి అభినందనీయం. తెలంగాణ సాహితీ జగత్తుకు గర్వకారణం.

> **సుజాతారెడ్డి తెలంగాణ తొలితరం కథలు కథాసంపుటం ద్వారా తెలంగాణలో మొదటితరం నుంచే సామాజిక అంశాలు కథావస్తువులు అయ్యాయనే విషయం తెలుస్తుంది. భాష విషయంలోనూ గ్రాంథికం నుంచి వ్యవహారిక భాష వరకు రచయితలు కథలు మలిచిన విధానం, పాత్రోచిత మాండలికాలను ఉపయోగించడం గమనించవచ్చు. వస్తు వు విషయంలో మాత్రం తెలంగాణ కథ సామాజిక అంశాలకే పెద్దపీట వేసింది. కథ నిర్మాణం శిల్పం విషయంలో కాలక్రమేణా పరిణతి కనిపిస్తుంది. తెలంగాణ తొలితరం కథల సంకలనం తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక. తెలంగాణ భాషాశైలికి సం స్కృతి సంప్రదాయాలకు పట్టుగొమ్మ.**

**- ఉప్పల పద్మ, 8340933244**

## కొత్తపుస్తకాలు

### రగులుతున్న అడవి



ఆలోచించే ప్రతీ భారతీయుడు, గణతంత్ర భవిష్యత్తు గురించి ఆలోచించే ప్రతీ పౌరుడూ రగులుతున్న అడవి పుస్తకాన్ని చదువాలి. ఎంతో క్షుణ్ణంగా పరి శోధించి అద్భుతంగా రాసిన పుస్తకం రగులుతున్న అడవి. దీనినిండా లోతైన అవగాహనలున్నాయి.

**రచన: నందిని సుందర్,**
**తెలుగు: రివేరా, వెల: రూ. 290,**
**ప్రతులకు: 3-6- 677/2,ఫ్లాట్ నెం:302, ఎం.ఎస్.కె. టవర్స్ స్ట్రీట్ నెం:11, హిమాయత్‌నగర్, హైదరాబాద్-29.**

### రాఘవరెడ్డి రచనలు



పద్యరచనను పాటిస్తూ, పౌరాణిక కథా సన్నివేశాలు, పాత్రలు వస్తువు లుగా స్వీకరించి రచనలు చేసిన వారిలో పేరెన్నికగన్న వారిలో రాఘవరెడ్డి ఒకరు. తాత్త్విక జ్ఞాన భూమికలున్న రాఘవరెడ్డి పద్య కవిత్వంలో జీవయా త్ర, సామాజిక స్పృహ, వైయక్తికం నుంచి సమిష్ఠి వరకు మానవ వేదన అంతస్స్రోతస్సులుగా ప్రవహిస్తాయి.

**రచన: గార్లపాటి రాఘవరెడ్డి,**
**వెల: రూ.30. ప్రతులకు: తెలంగాణ సాహిత్య అకాడమీ, కళాభవన్, రవీంద్రభారతి, హైదరాబాద్-4.**
**ఫోన్: 040-29703142**

## ఆకలి

ప్రపంచంలో
అన్నింటి కన్న పెద్ద వాస్తవం
ఆకలే!

ఆ గుడిసెలో ఓ కొడవలి
చంద్రవంకలా
గోడకు తగిలించి వుంటుంది.
సూర్యుడు ఉదయించగానే
దానికి రెక్కలు మొలుస్తాయి.

ఆ యింట్లో ఓ పిల్లవాడు
ఏడుపుకీ ఏడుపుకీ మధ్య
లేచి గంతులేస్తుంటాడు.
వాళ్లమ్మ
పెంకమీద తన గుండెను
పరిచినిట్టు
రొట్టెను కాలుస్తుంటుంది.
వాడు ఖాళీ రాతెండి గిన్నెతో
ఆడుతుంటాడు
ఇప్పటిదాకా అదే వాడి బంతి.

ఆమె గొంతులోంచి వెలువడే
ఏదో సనాతన రాగానికి
పెంకా సలాకీ
తాళం వేస్తుంటాయి.

చివరికి ఓ రొట్టె ఎగిరొచ్చి
వాడి గిన్నెలో పడుతుంది.
మెరిసే కళ్లతో వెంటనే
దానిని మృదువుగా
నిమురుతాడు
ఆమె కూడా చూపుల్తోనే
కాస్త కాస్త తుంచి తినిపిస్తుంది.

రండి! చూడండి!
యావత్ సృష్టిలో
ఆకలి తీరటం కన్న
అందమైన దృశ్యం మరోటి
వుండదు.

**- డాక్టర్ ఎన్.గోపి**

Printed and Published by Damodar Rao Divakonda, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: Katta Shekar Reddy. Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.

epaper.ntnews.com



శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన రథోత్సవం.. భక్తుల కోలాటాలు, చిన్నారుల నృత్యాల మధ్య శోభాయమానంగా సాగింది. రాష్ట్రంలోనే అతిపెద్ద రథం కావడంతో ఉత్సవాన్ని వీక్షించేందుకు లక్షకుపైగా భక్తులు తరలిరాగా, కలెక్టర్ కృష్ణ భాస్కర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. - సిరిసిల్ల టౌన్

### నల్లమలలో ఆంక్షల సడలింపు

**అమ్రాబాద్ రూరల్:** నల్లమలలో పెద్దపులి జత కట్టు సమయంకావడంతో గత జూలై 1 నుంచి సెప్టెంబర్ 30 వరకు అమ్రాబాద్ రిజర్వు అడవుల్లో పర్యటనలపై విధించిన ఆంక్షలను అధికారులు సడలించారు. ఆదివారం జిల్లా అటవీశాఖాధికారి జోజి మాట్లాడుతూ.. సోమవారం నుంచి ఆంక్షల సడలింపు అమలవుతుందని తెలిపారు. అయితే మూడు నెలల నిషేధం ముగిసినా వర్షాలు సమృద్ధిగా కురవడంతో మరో 15 రోజులు నిషేధాన్ని అమలుచేసినట్టు చెప్పారు. ప్రస్తుతం అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ అడవుల్లో 17 పెద్ద, 2 చిన్న పులులు ఉన్నాయన్నారు. వన్యప్రాణులు సంచరించే ప్రదేశాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు రికార్డు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.



యాదాద్రి లక్ష్మీనరసింహుడి క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. ఆదివారం సెలవురోజు కావడంతో స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులు గంటలకొద్దీ క్యూలో నిల్చున్నారు. శ్రీసత్యనారాయణ స్వామి వారి వ్రత పూజల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. శ్రీవారి ఖజానాకు రూ.14,83,559 ఆదాయం సమకూరిందని ఆలయ అధికారులు తెలిపారు. - యాదాద్రి భువనగిరి ప్రతినిధి, నమస్తే తెలంగాణ



# కృష్ణమ్మకు మళ్లీ వరదపోటు

- జూరాలకు 98వేలు.. శ్రీశైలానికి 1.51 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- నాగార్జునసాగర్‌కు 2.02 లక్షల క్యూసెక్కుల వరద
- 10 క్రస్టుగేట్ల ద్వారా దిగువకు నీరు
- శ్రీరాంసాగర్‌కు స్వల్పంగా కొనసాగుతున్న ఇన్‌ఫ్లో
- ఎల్ఎండీ నుంచి కాకతీయ కాల్వకు నీటి విడుదల



ఆదివారం శ్రీశైలం నుంచి నాలుగు గేట్ల ద్వారా దిగువకు విడుదలవుతున్న నీరు



నాగార్జునసాగర్ పది గేట్ల ద్వారా దిగువకు వెళ్తున్న నీరు

**హైదరాబాద్, జోగుళాంబ గద్వాల ప్రతినిధి, నాగర్ కర్నూల్, నమస్తే తెలంగాణ/అయిజ/నందికొండ:** కృష్ణా బేసిన్‌లో మరోసారి వరద పోటెత్తుతున్నది. ఎగువ నుంచి వస్తున్న వరదతో ప్రాజెక్టులు నిండుకుండల్లా మారుతుండగా, దిగువకు నీటి విడుదల కొనసాగుతున్నది. ఆల్మట్టికి 55 వేల క్యూసెక్కుల నీరు వస్తుండటంతో ప్రాజెక్టు అధికారులు అంతేమేర దిగువకు వదులుతున్నారు. జూరాలకు వరద ప్రవాహం పెరుగుతుండటంతో 8 గేట్లు ఎత్తి నదిలోకి నీటిని విడుదల చేస్తున్నారు. జూరాలకు 98 వేల క్యూసెక్కులు వస్తుండగా.. 1,07,030 క్యూసెక్కుల అవుట్ ఫ్లో ఉంది. ఆదివారం సాయంత్రానికి స్పిల్‌వే ద్వారా నదిలోకి 59,948 క్యూసెక్కుల నీటిని నదిలోకి విడుదల చేస్తున్నారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1,045 అడుగుల ఎత్తులో 9.657 టీఎంసీలకు గాను ప్రస్తుతం 1,044.9 అడుగుల ఎత్తులో 9.5 టీఎంసీల నీటిని నిల్వ చేస్తున్నారు. మరోవైపు ఎగువనున్న ఆల్మట్టి, నారాయణపుర ప్రాజెక్టుకు వరద క్రమంగా పెరుగుతున్నది. ఆల్మట్టి ప్రాజెక్ట్ పూర్తి సామర్థ్యం 129.72టీఎంసీలకు గాను ప్రస్తుతం 128.19 టీఎంసీల నీరు నిల్వ ఉన్నది. నారాణయణపుర ప్రాజెక్ట్ ఇన్‌ఫ్లో 77,576 క్యూసెక్కులు, అవుట్‌ఫ్లో 82,287 క్యూసెక్కులు నమోదైంది. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటిమట్టం 37.64 టీఎంసీలు కాగా ప్రస్తుతం 37.12 టీఎంసీల నీరు నిల్వ ఉన్నది. తుంగభద్ర నుంచి కూడా 22 వేలపైచిలుకు క్యూసెక్కుల ఇన్‌ఫ్లో స్థిరంగా వస్తుండగా.. అంతేమొత్తంలో నీటిని దిగువకు వదులుతున్నారు. ఈ క్రమం లో శ్రీశైలం జలాశయంలోకి 1.51 లక్షల క్యూసెక్కుల వరద చేరుతున్నది. 95 వేల క్యూసెక్కుల నీటిని అధికారులు కిందికి విడుదల చేస్తున్నారు. ఆదివారం రాత్రి 9 గంటల సమయంలో నాగార్జునసాగర్‌కు 2.02 లక్షల క్యూసెక్కుల వరద వస్తుండగా.. 10 క్రస్టుగేట్ల ద్వారా దిగువకు దాదాపు 2.02 లక్షల క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

## ఎస్సారెస్పీకి స్వల్ప ఇన్‌ఫ్లో

**మెండోరా:** శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతాల నుంచి స్వల్ప ఇన్‌ఫ్లో కొనసాగుతున్నదని ప్రాజెక్టు ఏఈఈ మహేందర్ తెలిపారు. ప్రాజెక్టులోకి ఆదివారం ఉదయం 6 గంటలకు 19,036 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా.. 7 గంటలకు 6,060 క్యూసెక్కులకు తగ్గిపోయిందన్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,091అడుగులు (90.313 టీఎంసీలు)కాగా, ఆదివారం సాయంత్రానికి 1,089.40 అడుగుల (81.696 టీఎంసీలు) మేర నీటి నిల్వ ఉన్నదన్నారు. గతేడాది ఇదే రోజున ప్రాజెక్టు నీటిమట్టం 1,079.00 అడుగులు (49.698 టీఎంసీల) నీటి నిల్వ ఉన్నదని తెలిపారు.



నిండుకుండలా శ్రీరాంసాగర్ ప్రాజెక్టు

## ఎల్ఎండీ నుంచి దిగువకు నీటి విడుదల



**తిమ్మాపూర్, నమస్తేతెలంగాణ:** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం ఎల్ఎండీ కాలనీలోని లోయర్ మానేర్ డ్యాం (ఎల్ఎండీ) నుంచి ఆదివారం కాకతీయ కాల్వ ద్వారా దిగువకు నీటిని విడుదల చేశారు. ప్రభుత్వం, ఎస్సారెస్పీ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎస్సారెస్పీ ఏఈలు కాళీదాస్, వంశీ, ఏఈఈ అంజుం ఉన్నీసా హెడ్ రెగ్యులేటర్ నుంచి దిగువకు నీటిని వదిలారు. కాకతీయ కాల్వ ద్వారా స్టేజీ -1, 2 పరిధిలోని కరీంనగర్, వరంగల్, నల్లగొండ, ఖమ్మం పరిధిలోని ఆయకట్టుతోపాటు చెరువులు, కుంటలకు నీటిని విడుదల చేశామని అధికారులు తెలిపారు. మొదట కాకతీయ కాల్వ ద్వారా దిగువకు 500 క్యూసెక్కుల నీటిని విడుదల చేశామనీ, మధ్యాహ్నం వరకు రెండు వేల క్యూసెక్కుల వరకు పెంచినట్టు వారు పేర్కొన్నారు.



వనపర్తి జిల్లా కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

## వాల్మీకులకు అండగా టీఆర్ఎస్

- వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి
- ఘనంగా వాల్మీకి జయంతి వేడుకలు

**వనపర్తి, నమస్తే తెలంగాణ :** వాల్మీకులకు టీఆర్ఎస్ సర్కారు అండగా ఉంటుందని వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం వనపర్తి జిల్లాకేంద్రంలో నిర్వహించిన వాల్మీకి మహర్షి జయంతి వేడుకలకు మంత్రి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. వాల్మీకులను ఎస్టీ జాబితాలో విలీనం చేయడానికి చెల్లప్ప కమిటీ ద్వారా తయారుచేసిన నివేదికను అసెంబ్లీలో తీర్మానంచేసి కేంద్రానికి పంపించామనీ, కేంద్రంలో పెండింగ్‌లో ఉన్నదని వివరించారు. నాగవరంలో 20గుంటల ప్రభుత్వ భూమిని వాల్మీకి భవన నిర్మాణానికి కేటాయించినట్టు మంత్రి తెలిపారు.



మహబూబ్‌నగర్‌లో వాల్మీకి మహర్షి చిత్రపటం వద్ద పూజలు చేస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

## టీఆర్ఎస్‌తోనే వాల్మీకులకు ప్రత్యేక గుర్తింపు

మంత్రి శ్రీనివాస్‌గౌడ్

**మహబూబ్‌నగర్,నమస్తే తెలంగాణ :** టీఆర్ఎస్ ప్రభుత్వంతోనే వాల్మీకులకు ప్రత్యేక గుర్తింపు వచ్చిందని ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన వాల్మీకి జయంతి వేడుకల్లో మంత్రి పాల్గొన్నారు. వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ రామాయణం రాసిన వాల్మీకి మహర్షిని అందరూ ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. అంతకుముందు బోయపల్లి వద్ద ఉన్న వాల్మీకి మహర్షి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసి, ఆలయ ప్రాంగణంలో మొక్కలను నాటారు.



ఫిలిప్పీన్స్ అమ్మాయి, తెలంగాణ అబ్బాయి వివాహబంధంతో ఒక్కటయ్యారు. ఆదివారం నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ హిల్‌కాలనీలోని విజయవిహార్‌లో వీరి వివాహం వైభవంగా జరిగింది. హిల్‌కాలనీకి చెందిన సందీప్ హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సు పూర్తిచేసి సౌదీలోని ఓ హోటల్‌లో పనిచేస్తున్నారు. అదే హోటల్‌లో పనిచేస్తున్న ఫిలిప్పీన్స్‌కు చెందిన రిచ్చల్ బోర్నాల్స్ (చందన)తో ఏర్పడిన పరిచయం ప్రేమకు దారితీసింది. విషయాన్ని తమ కుటుంబ పెద్దలకు చెప్పి వివాహానికి ఒప్పించారు. ఆదివారం వీరి వివాహం హిల్‌కాలనీ విజయవిహార్‌లోని కల్యాణ మండపంలో హిందూ సంప్రదాయం ప్రకారం జరిగింది. - నందికొండ

## క్యారమ్స్ ఆటకోసం ఘర్షణ

కత్తిపోట్లతో నలుగురికి గాయాలు.. ఒకరి పరిస్థితి విషమం

**నవీపేట:** క్యారమ్స్ ఆటకోసం జరిగిన గొడవ కత్తిపోట్లకు దారితీసింది. ఈ ఘటన నిజామాబాద్ జిల్లా నవీపేట మండలం ఫత్తేనగర్‌లో శనివారం రాత్రి చోటుచేసుకున్నది. నవీపేట ఎస్సై వెంకటేశ్వర్లు, ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. గ్రామంలోని సర్ఫరాజ్ హోటల్‌లో నిత్యం క్యారం ఆడుతుంటారు. శనివారం రాత్రి ఇబ్రహీం, ఆరిఫ్ అనే వ్యక్తు లు తాగిన మైకంలో క్యారం ఆడేందుకు హోటల్‌కు వచ్చారు. రాత్రి 11:30 కావడంతో బంద్ చేసేందుకు హోటల్ బాయ్ నసీర్ సిద్ధమయ్యాడు. తాగిన మైకంలో ఉన్న ఇబ్రహీం హోటల్ బాయ్ నసీర్‌ను తోసేశాడు. అక్కడే ఉన్న హోటల్ నిర్వాహకులు సర్ఫరాజ్, షానవాజ్‌తో గొడువకు దిగారు. మాటామాట పెరుగడంతో షానవాజ్ కత్తితో ఇబ్రహీంను పొడిచాడు. మధ్యలో కలుగజేసుకొన్న ఇంతియాజ్‌ఖాన్, ఆరిఫ్‌లను సైతం పొడిచాడు. ఘర్షణలో షానవాజ్‌కు కూడా గాయాలయ్యాయి. అపస్మారక స్థితిలో ఉన్న ఇబ్రహీంను కుటుంబసభ్యులు నిజామాబాద్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. అతని పరిస్థితి విషమంగా ఉన్నదని పోలీసులు తెలిపారు. తన భర్తను హత్యచేసేందుకు సర్ఫరాజ్ కుటుంబం ప్రయత్నిస్తున్నదని ఇబ్ర హీం భార్య పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## పాముకాటుతో చిన్నారి మృతి

**బుగ్గారం:** పాముకాటుకు ఏడాది పాప బలైంది. ఈ ఘటన జగిత్యాల జిల్లా బుగ్గారం మండలం గోపులాపూర్‌లో ఆదివారం చోటుచేసుకున్నది. గోపులాపూర్ గ్రామానికి చెందిన కొత్తకొండ సంతోష్-సుమలత దంపతుల కూతురు సహస్ర(01) ఇంటి పరిసరాల్లో ఆడుకుంటుండగా చెట్ల పొదల్లోంచి వచ్చిన నాగుపాము కాటువేయడంతో స్పృహ తప్పి పడిపోయింది. తల్లిదండ్రులు గమనించి హుటాహుటిన బైక్‌పై జగిత్యాలలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తీసుకెళ్లగా వారు ప్రభుత్వ దవాఖానకు తీసుకెళ్లాలని సూచించారు. అక్కడికి చేరుకునేలోగా పాప కన్నుమూసింది. పాము కాటు వేసిన అరగంటలోపు వైద్యం అంది ఉంటే బతికే అవకాశం ఉండేదని వైద్యులు తెలిపారు.

# నిరాటంకంగా బస్సులు

మూడోపేజీ తరువాయి...

మొత్తం 97 బస్సులను నడిపించినట్లు డిపో మేనేజర్ భూక్యా ధరంసింగ్ తెలిపారు. జనగామ జిల్లాలో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి అశోక్ నేతృత్వంలో బస్సులను తనిఖీచేసి కండక్టర్లకు సూచనలిస్తూ.. రవాణా వ్యవస్థ సవ్యంగా కొనసాగేందుకు చర్యలు తీసుకొన్నారు. మహబూబ్‌నగర్‌లో ట్రాఫిక్ అంచనామేరకు 94 బస్సులు వివిధ రూట్లలో రాకపోకలు సాగించాయి. వనపర్తి డిపో పరిధిలో గ్రామీణప్రాంతాలకు బస్ సర్వీసులను పునరుద్ధరించారు. కలెక్టర్ ఆదేశాలమేరకు రెవెన్యూ సిబ్బంది సహకారంతో 98 బస్సులను నడిపించారు. వికారాబాద్, తాండూరు, పరిగి డిపోల పరిధిలో ప్రగతి చక్రం ఆగకుండా పరుగులు పెట్టింది. ఈ మూడు డిపోల నుంచి మొత్తం 174 బస్సులు నడిచాయి. సంగారెడ్డి జిల్లాలో సమ్మె ప్రభావం కనిపించలేదు. తాత్కాలిక డ్రైవర్లు, కండక్టర్లు ఉమ్మడి జిల్లాలోని ఎనిమిది డిపోల పరిధిలో 450 బస్సులను నడిపించారు. ఇందులో 300 వరకు ఆర్టీసీ సొంత బస్సులే. మంచిర్యాల డిపో పరిధిలో 38 ఆర్టీసీ బస్సులతోపాటు మొత్తం 106 బస్సులు, 60 క్యాబ్‌లు ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చాయి. ఆర్టీవో అధికారులు ప్రైవేట్ వాహనాలను తనిఖీచేసి, టోకెన్లు ఇచ్చిన తర్వాతే నిర్దేశిత రూట్లలో అనుమతిస్తున్నారు. నల్లగొండ జిల్లాలోని నాలుగు డిపోల పరిధిలో మొత్తం 292 బస్సులద్వారా సుమారు 60వేల మంది ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు చేర్చారు. సూర్యాపేట జిల్లా కోదాడ, సూర్యాపేట డిపోల పరిధిలో మొత్తం 176 బస్సులతోపాటు 42 స్కూలు బస్సులను నడిపించారు. యాదగిరిగుట్ట డిపోలో మొత్తం 60మంది డ్రైవర్లు, 60మంది కండక్టర్లను తాత్కాలిక పద్ధతిలో నియమించారు. గుట్టలో ప్రయాణికుల రద్దీ ఎక్కువ కావడంతో మొత్తం అరవై ఆర్టీసీ, అద్దె బస్సులతోపాటు ఇతరవాహనాలు 84 నడిపించారు. ఆదివారం కావడంతో యాదగిరిగుట్ట బస్‌స్టేషన్ ప్రయాణికులతో కిటకిటలాడింది. కాగా, ఆదివారం హైదరాబాద్‌లో మృతిచెందిన ఆర్టీసీ డ్రైవర్ శ్రీనివాస్‌రెడ్డి భౌతికదేహాన్ని అంత్యక్రియల నిమిత్తం ఖమ్మం తరలించారు. కాగా హైదరాబాద్ మెహిదీపట్నం పరిధిలోని కార్వాన్‌కు చెందిన సురేందర్‌గౌడ్ అనే ఆర్టీసీ కండక్టర్ అప్పుల బాధతో ఆదివారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకొన్నాడు. సురేందర్‌గౌడ్ రాణీగంజ్ డిపోలో కండక్టర్‌గా పనిచేస్తున్నాడు. అతని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు.



ఆదివారం హైదరాబాద్ ఎంజీబీఎస్‌లో ప్రయాణికుల రద్దీ



సూర్యాపేట జిల్లా కోదాడలో బస్సులో వెళ్తున్న ప్రయాణికులు



వనపర్తి బస్టాండ్‌లో విధులు నిర్వహిస్తున్న రెవెన్యూ, కో-ఆపరేటివ్ సిబ్బంది

## ఈతకు వెళ్లి సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి

- స్థానికుడి సాయంతో బయటపడ్డ మరో ముగ్గురు

**కమలాపూర్:** వాగులో ఈతకు దిగిన నలుగురిలో ఒకరు మృతి చెందగా, ముగ్గురు ప్రాణాలతో బయటపడ్డారు. ఈ ఘటన వరంగల్ అర్బన్ జిల్లా కమలాపూర్ మండలం అంబాల శివారులో ఆదివారం చోటుచేసుకున్నది. పోలీసుల కథనం ప్రకారం.. హన్మకొండలోని లష్కర్‌బజార్‌కు చెందిన పుల్లూరి సన్నిత్‌కుమార్(32) మహారాష్ట్రలోని థానేలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. నగరంలోని రెడ్డి కాలనీకి చెందిన బాదేండ్ల శ్రీకాంత్, రాపర్తి రాజేశ్‌కుమార్, తాటికొండ రాధాకృష్ణ, నీలేటి సంతోష్‌కుమార్ ఇతడి స్నేహితులు. వీరంతా ఆదివారం ద్విచక్ర వాహనాలపై అంబాల శివారులోని చెక్‌డ్యామ్‌కు వెళ్లారు. సంతోష్ కుమార్ తనకు పని ఉన్నదని చెప్పి వెళ్లిపోగా మిగతా నలుగురు ఈత కోసం వాగులోకి దిగారు. ఇంతలో సన్నిత్‌కుమార్ లోతులోకి వెళ్లి మునిగిపోయాడు. మిగిలిన ముగ్గురు సైతం మునిగిపోతూ కేకలు వేశారు. అటుగా వెళ్తున్న గోనెల ప్రశాంత్ గమనించి వెంటనే వాగులోకి దూకి శ్రీకాంత్, రాజేశ్‌కుమార్, రాధాకృష్ణను కాపాడాడు. సన్నిత్‌కుమార్ మాత్రం అప్పటికే మృతిచెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని సన్నిత్‌కుమార్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించారు. సన్నిత్‌కుమార్‌కు ఏడాది క్రితమే వివాహం కాగా ప్రస్తుతం అతని భార్య ఎనిమిది నెలల గర్భిణి. అతడి మృతితో లష్కర్‌బజార్‌లో విషాదం అలుముకున్నది.



తాను పెంచుకున్న కుక్కకు ఐదు పిల్లలు పుట్టగా, వాటికి పురుడు చేశారు కరీంనగర్ జిల్లా గన్నేరువరానికి చెందిన ఇక్కుర్తి విజయలక్ష్మి. తనకు సంతానం లేకపోవడంతో విజయలక్ష్మి ఓ కుక్కను పెంచుకున్నారు. దానికి దసరా రోజు 5 పిల్లలు పుట్టగా, ఆదివారం సంప్రదాయ పద్ధతిలో కొత్త బట్టలు తొడిగి, బంధువులను ఆహ్వానించి విందు ఇచ్చారు. - గన్నేరువరం

నమస్తే తెలంగాణ
ఆట
8
[ కరీంనగర్ ]
సోమవారం 14 అక్టోబర్ 2019
www.ntnews.com




# ద్యుతీకి రెండో స్వర్ణం

## నాలుగో స్థానంలో నిలిచిన తెలంగాణ స్ప్రింటర్ హారిక

## జాతీయ ఓపెన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్

**రాంచీ:** భారత అగ్రశ్రేణి మహిళా స్ప్రింటర్ ద్యుతీ చంద్ జాతీయ ఓపెన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో మరోసారి సత్తా చాటింది. ఇప్పటికే 100 మీటర్ల స్వర్ణాన్ని నెగ్గిన ద్యుతీ.. చాంపియన్‌షిప్ చివరిరోజైన ఆదివారం జరిగిన 200 మీటర్ల మహిళల పరుగులోనూ అగ్రస్థానంలో నిలిచింది. 23.17 సెకన్లలో లక్ష్యాన్ని చేరి ద్యుతీ పసిడి పట్టగా.. తెలంగాణ అమ్మాయి హారికా దేవీ కొద్దిలో పతకం సాధించే అవకాశాన్ని చేజార్చుకుంది. 24.10 సెకన్లలో గమ్యాన్ని చేరిన హారిక నాలుగో స్థానంలో నిలిచింది. అర్చనా సుశీంద్రన్ (23.41సెకన్లు), చంద్రలేఖ (23.74సెకన్లు) వరుసగా రజత, కాంస్య పతకాలు సాధించారు.



సౌత్‌జోన్ ఇంటర్ స్కూల్ సీబీఎస్ఈ జూడో టోర్నమెంట్‌లో రెండో స్థానంలో నిలిచిన రాష్ట్ర జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న కరీంనగర్ ఏసీపీ అశోక్, జిల్లా జూడో సంఘం అధికారి వినీల్ కుమార్, ప్రధానోపాధ్యాయురాలు లలితా కుమారి, జిల్లా ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి జనార్దన్ రెడ్డి, సుధాకర్ రావు



మంజు రాణి

## రజతంతో

# 'రాణి'ంచింది

## ఫైనల్లో రష్యా బాక్సర్ చేతిలో మంజు ఓటమి

## ప్రపంచ మహిళల బాక్సింగ్ చాంపియన్‌షిప్

**ఉలాన్ ఉదె (రష్యా):** ప్రపంచ చాంపియన్‌షిప్‌లో అడుగుపెట్టిన తొలిసారే అద్భుత పోరాటంతో భారత మహిళా బాక్సర్ మంజూ రాణి రజత పతకాన్ని సొంతం చేసుకుంది. ఆదివారం ఇక్కడ జరిగిన 48కేజీల విభాగం ఫైనల్లో ఆరో సీడ్ మంజు 1–4తో రెండో సీడ్ ఏక్‌తెరీనా పాల్ట్‌సేవా (రష్యా) చేతిలో పరాజయం పాలై, స్వర్ణాన్ని చేజార్చుకుంది. మ్యాచ్ తొలి రౌండ్‌లో ఇరువురు బాక్సర్లు హోరాహోరీగా పంచ్‌లు విసురుకున్నారు. అయితే రష్యా బాక్సర్ పర్‌ఫెక్ట్ లెఫ్ట్‌హుక్స్‌తో ఆధిపత్యం ప్రదర్శించింది. రెండో రౌండ్‌లో మంజు స్ట్రయిట్ పంచ్‌లతో ప్రత్యర్థిపై విరుచుకుపడి పైచేయి సాధించింది. ఇక మూడో రౌండ్‌లో ఇద్దరు బాక్సర్లు ఆచితూచి ఆడారు. పోటీ ముందుకు సాగకపోవడంతో రిఫరీ పలుసార్లు కలుగజేసుకోవాల్సి వచ్చింది. అయితే చురుకైన కదలికలతో పంచ్‌లు కురిపించిన పాల్ట్‌సేవ ఆ తర్వాత ఆధిక్యం ప్రదర్శించింది. దీంతో న్యాయనిర్ణేతలు రష్యా బాక్సర్‌ను విజేతగా ప్రకటించారు. ఆ సమయంలో మంజూ రాణి కాస్త అసంతృప్తిగా కనిపించింది. ఆరుసార్లు ప్రపంచ చాంపియన్ మేరీ కోమ్ సహా భారత్ తరఫున టోర్నీలో బరిలోకి దిగిన మహిళా బాక్సర్లలో మంజూ రాణి మాత్రమే ఫైనల్‌కు చేరుకోగలిగింది. ఇక శనివారం జరిగిన సెమీస్ పోటీల్లో పరాజయం చెందిన మేరీ కోమ్ (51 కేజీలు), జమునా బోరో (54 కేజీలు), లవ్లీనా బోర్గోహైన్ (69 కేజీలు) కాంస్యాలు సాధించిన విషయం తెలిసిందే. ఈ ఏడాది జరిగిన జాతీయ చాంపియన్‌షిప్‌లో పంజాబ్ తరఫున బరిలోకి దిగిన రాణి.. విజేతగా నిలిచి తొలిసారి జాతీయ క్యాంపునకు ఎంపికైంది. హర్యానాలోని రోహ్‌తక్ జిల్లా రితల్ ఫొగట్ గ్రామానికి చెందిన మంజు.. ఈ ఏడాది మొదట్లో జరిగిన ప్రతిష్ఠాత్మక స్ట్రాంజా మెమోరియల్ టోర్నీలోనూ రజతంతో సత్తా చాటింది.

# డచ్ విజేత లక్ష్యసేన్

**అల్మెరె (నెదర్లాండ్):** భారత యువ షట్లర్ లక్ష్యసేన్ అద్వితీయ ఆటతీరుతో డచ్ ఓపెన్ పురుషుల సింగిల్స్ టైటిల్ కైవసం చేసుకున్నాడు. వరుస విజయాలతో ఫైనల్ చేరిన 18 ఏండ్ల లక్ష్య ఆదివారం జరిగిన తుదిపోరులో 15–21, 21–14, 21–15తో యుసుకె ఒండెరా (జపాన్)పై గెలిచి విజేతగా నిలిచాడు. జూనియర్ స్థాయిలో మెరుపులు మెరిపించి యూత్ ఒలింపిక్స్‌లో రజతం, ప్రపంచ జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో కాంస్యం నెగ్గిన లక్ష్యసేన్ సీనియర్ స్థాయిలోనూ అదే జోరు కనబర్చాడు. గత నెలలో బెల్జియం ఓపెన్ నెగ్గిన లక్ష్యసేన్‌కు కెరీర్‌లో ఇదే తొలి బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ టైటిల్. తొలి గేమ్ కోల్పోయి వెనుకబడిన ప్రపంచ 72వ ర్యాంకర్ లక్ష్యసేన్.. ఆ తర్వాత వరుసగా రెండు గేమ్‌లు నెగ్గి మ్యాచ్‌ను తన పేరిట రాసుకున్నాడు.




63 నిమిషాల పాటు సాగిన పోరులో తొలి గేమ్ మినహా లక్ష్యసేన్ సాధికారికంగా కనిపించాడు. ప్రత్యర్థికి ఎలాంటి అవకాశం ఇవ్వకుండా చెలరేగుతూ తొలి మెగా టైటిల్ ఒడిసిపట్టాడు.



# భళా బైల్స్

## 25 పతకాలతో ఆల్‌టైం రికార్డు బ్రేక్

**స్టట్‌గార్ట్:** జిమ్నాస్టిక్స్ సంచలనం సిమోన్ బైల్స్ (అమెరికా) చరిత్ర సృష్టించింది. ప్రపంచ చాంపియన్‌షిప్‌లో 25వ పతకం సాధించి.. బెలారస్ పురుష జిమ్నాస్ట్ విటాలీ షెర్బో (23 పతకాలు) పేరిట ఉన్న ఆల్‌టైమ్ రికార్డును బద్దలు కొట్టింది. ప్రపంచంలో అత్యంత విజయవంతమైన జిమ్నాస్ట్‌గా బైల్స్ నిలిచింది. ప్రపంచ జిమ్నాస్టిక్ చాంపియన్‌షిప్‌లో చివరిరోజైన ఆదివారం ఇక్కడ జరిగిన బీమ్, ఫ్లోర్ ఫైనల్ పోటీల్లో అగ్రస్థానంలో నిలిచి స్వర్ణ పతకాలను చేజిక్కించుకోవడంతో బైల్స్ ఈ ఘనతలను అందుకుంది. మొత్తంగా ఈ ఏడాది చాంపియన్‌షిప్‌లో సిమోన్ ఏకంగా ఐదు స్వర్ణాలు తన ఖాతాలో వేసుకుంది. ఇప్పటి వరకు ఐదుసార్లు చాంపియన్‌షిప్‌లో పాల్గొన్న బైల్స్ 19 పసిడి పతకాలను పట్టడం విశేషం.

# నేటి నుంచి ప్లే ఆఫ్స్

**అహ్మదాబాద్:** ప్రొకబడ్డీ లీగ్ ఏడో సీజన్ తుది అంకానికి చేరింది. మూడు నెలల పాటు హోరాహోరీగా సాగిన లీగ్ మ్యాచ్‌ల్లో అత్యున్నతంగా ఆడిన ఆరు జట్లు నాకౌట్‌లో తలపడేందుకు సిద్ధమయ్యాయి. ప్లేఆఫ్స్‌లో భాగంగా సోమవారం ఇక్కడి ఇకా ఎరీనా స్టేడియంలో రెండు ఎలిమినేటర్ మ్యాచ్‌లు జరుగనున్నాయి. పాయింట్ల పట్టికలో మూడో స్థానంలో నిలిచిన యూపీ యోధా, ఆరో స్థానంలో ఉన్న బెంగళూరు బుల్స్ మధ్య తొలి ఎలిమినేటర్ నిర్వహించనున్నారు. అలాగే రెండో ఎలిమినేటర్‌లో యు ముంబా (4వ స్థానం)– హర్యానా (5వ స్థానం) తాడోపేడో తేల్చుకోనున్నాయి. 16వ తేదీన సెమీఫైనల్ మ్యాచ్‌లు జరుగుతాయి. మొదటి ఎలిమినేటర్‌లో గెలిచిన జట్టు పాయింట్ల పట్టికలో టాప్‌లో ఉన్న ఢిల్లీ దబాంగ్‌తో తొలి సెమీస్‌లో తలపడుతుంది. అలాగే రెండో ఎలిమినేటర్ విజేత.. బెంగాల్ వారియర్స్‌ను రెండో సెమీస్ మ్యాచ్‌లో అదే రోజు ఢీకొంటుంది. సెమీస్ విజేతల మధ్య ఈ నెల 19న ఫైనల్ జరుగుతుంది.

PRO KABADDI

| | |
|---|---|
| యూపీ యోధా X బెంగళూరు బుల్స్ | రాత్రి 7.30 నుంచి |
| యు ముంబా X హర్యానా స్టీలర్స్ | రాత్రి 8.30 నుంచి |

# ఏక్..దో..తీన్..11

## సొంతగడ్డపై వరుసగా పదకొండో సిరీస్ చేజిక్కించుకుని ప్రపంచ రికార్డు

## రెండో టెస్టులో ఇన్నింగ్స్ 137 పరుగులతో టీమ్‌ఇండియా జయభేరి.. రాణించిన ఉమేశ్, జడేజా

**అంచనాలు తప్పలేదు. అద్భుతాలు జరుగలేదు. అంతా అనుకున్నట్లే మరో మ్యాచ్ మిగిలుండగానే టీమ్‌ఇండియా సిరీస్ చేజిక్కించుకుంది. బ్యాట్స్‌మెన్ వీర విజృంభణతో కొండంత స్కోరు చేసిన భారత్.. ప్రత్యర్థిని రెండుసార్లు ఆలౌట్ చేసి మ్యాచ్‌ను కైవసం చేసుకుంది. సొంతగడ్డపై తమకు తిరుగులేదని విరాట్ సేన మరోసారి నిరూపించింది. ఫలితంగా స్వదేశంలో వరుసగా 11 సిరీస్‌లు చేజిక్కించుకొని.. ఆస్ట్రేలియా (10) పేరిట ఉన్న రికార్డును తిరగరాసింది. దశాబ్ద కాలం తర్వాత ఫాలోఆన్ ఆడిన దక్షిణాఫ్రికా ఏమాత్రం పోరాటం కనబర్చలేకపోయింది. నాలుగేండ్ల క్రితం డివిలియర్స్, ఆమ్లా, డుమినీతో కూడిన బ్యాటింగ్.. స్టెయిన్, మోర్నీ మోర్కెల్, ఇమ్రాన్ తాహిర్‌ల బౌలింగ్ దళం ఉండి కూడా ఒక్క మ్యాచ్ నెగ్గలేకపోయిన సఫారీలు ఈ సారి ఆ మాత్రం ప్రతిఘటన కూడా లేకుండానే సిరీస్ అప్పగించేశారు.**



**30**

**కెప్టెన్‌గా కోహ్లీ సాధించిన విజయాల సంఖ్య. 50 టెస్టులకు సారథ్యం వహించిన విరాట్ విజయవంతమైన కెప్టెన్‌ల జాబితాలో మూడో స్థానంలో ఉన్నాడు. తొలి 50 టెస్టుల్లో స్టీవ్ వా 37, రికీ పాంటింగ్ 35 విజయాలతో కోహ్లీ కంటే ముందున్నారు.**

**పుణె:** ఊహించిందే జరిగింది. సొంతగడ్డపై వరుస సిరీస్ విజయాలతో దూసుకెళ్తున్న భారత్ ఖాతాలో మరో సిరీస్ చేరింది. పర్యటన ఆరంభానికి ముందు 'గత పర్యటనలో జరిగిన తప్పిదాలను సరిచేసుకొని సత్తాచాటుతాం. సీనియర్లు దూరమైనా యువకులతో కూడిన జట్టు బలంగా ఉంది'అని బీరాలు పలికిన దక్షిణాఫ్రికా కెప్టెన్ ఫాఫ్ డుప్లెసిస్ మాటలు ఉట్టి నీటి మూటలే అని తేలేందుకు ఎక్కువ సమయం పట్టలేదు. వరుసగా రెండు మ్యాచ్‌ల్లోనూ జయభేరి మోగించిన టీమ్‌ఇండియా మరో మ్యాచ్ మిగిలుండగానే 2–0తో సిరీస్ కైవసం చేసుకుంది. దీంతో సొంతగడ్డపై వరుసగా అత్యధిక టెస్టు సిరీస్ విజయాలు సాధించిన జట్టుగా ఆస్ట్రేలియా (10 టెస్టు సిరీస్ విజయాలు, రెండు సార్లు)ను వెనక్కినెట్టి అగ్రస్థానానికి చేరింది. బౌలర్లకు విశ్రాంతి నిచ్చేందుకు టీమ్‌ఇండియా ఆదివారం రెండో ఇన్నింగ్స్ బరిలో దిగుతుందని భావిస్తే.. అందుకు భిన్నంగా విరాట్ కోహ్లీ దక్షిణాఫ్రికాను ఫాలోఆన్ ఆడించాడు. అప్పటికే భారీ టార్గెట్ ఉండటంతో పాటు పిచ్ నుంచి స్పిన్నర్లకు సహకారం లభించే అవకాశాలు కనిపించడంతో కోహ్లీ ఈ నిర్ణయం తీసుకున్నాడు. సారథి నమ్మకాన్ని నిలబెట్టిన మన బౌలర్లు మూడు సెషన్‌లకు ముందే ప్రత్యర్థిని ఆలౌట్ చేసి జట్టుకు ఇన్నింగ్స్ తేడాతో విజయాన్నందించారు. గత కొంతకాలంగా తుదిజట్టులో స్థానం దక్కక బెంచ్‌కే పరిమితమవుతున్న ఉమేశ్ యాదవ్ (3/22) నిప్పులు చెరిగితే.. రవీంద్ర జడేజా (3/52), అశ్విన్ (2/45) తమకు అలవాటైన రీతిలో తిప్పేశారు. దీంతో వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయిన దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్‌లో చివరకు 67.2 ఓవర్లలో 189 పరుగులకు ఆలౌటైంది. డీన్ ఎల్గర్ (48) టాప్‌స్కోరర్. ఫలితంగా భారత్ ఇన్నింగ్స్ 137 పరుగుల తేడాతో విజయ ఢంకా మోగించింది. 50వ టెస్టుకు సారథ్యం వహించిన విరాట్ కోహ్లీ.. 30వ విజయాన్ని తన ఖాతాలో వేసుకున్నాడు. దీంతో పాటు ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్‌లో 200 పాయింట్లతో భారత్ తన అగ్రస్థానాన్ని మరింత పటిష్ఠం చేసుకుంది. తొలి ఇన్నింగ్స్‌లో అద్వితీయ ఆటతో అదరగొట్టిన ద్విశతక ధీరుడు కోహ్లీకి 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'అవార్డు దక్కింది. మూడో టెస్టు శనివారం రాంచీలో ప్రారంభం కానుంది.

### డుప్లెసిస్ 54 బంతుల్లో.. 5 పరుగులు

తొలి ఇన్నింగ్స్ చివర్లో కాస్త ప్రతిఘటించిన దక్షిణాఫ్రికా.. దశాబ్దం తర్వాత ఫాలోఆన్ ఆడుతూ ఆకట్టుకోలేకపోయింది. మొదటి ఇన్నింగ్స్‌లో ఒక్క వికెట్ కూడా దక్కించుకోలేకపోయిన సీనియర్ పేసర్ ఇషాంత్ శర్మ (1/17) నాలుగో రోజు రెండో బంతికే మార్క్‌రమ్ (0)ను వికెట్ల ముందు దొరకబుచ్చుకొని సఫారీల పతనానికి నాంది పలికాడు. నాన్‌స్ట్రయికర్ ఎండ్‌లో ఉన్న ఎల్గర్‌తో మంతనాలు జరిపిన అనంతరం రివ్యూ కోరకుండానే మార్క్‌రమ్ పెవిలియన్ బాటపట్టాడు. అయితే రిప్లేలో బంతి లెగ్‌స్టంప్ పక్కనుంచి వెళ్తున్నట్లు కనిపించడం మార్క్‌రమ్‌ను మరింత బాధపెట్టి ఉంటుంది. ఈ టెస్టులో రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ మార్క్‌రమ్ ఖాతా తెరవకుండానే ఔటై 'పెయిర్'నమోదు చేసుకున్నాడు. కాసేపటికే సాహా పట్టిన చూడచక్కటి క్యాచ్‌కు డిబ్రుయిన్ (8) నిష్క్రమించాడు. ఈ దశలో ఎల్గర్‌తో కలిసి కెప్టెన్ డుప్లెసిస్ (54 బంతుల్లో 5) ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే ప్రయత్నం చేశాడు. షమీ ఓవర్‌లో మూడు ఫోర్లు కొట్టిన ఎల్గర్ జోరు కనబర్చడంతో.. కోహ్లీ స్పిన్నర్లను రంగంలోకి దించాడు. ఆ మార్పు ఫలితాన్నిచ్చింది. మూడో వికెట్‌కు 49 పరుగులు జోడించాక డుప్లెసిస్‌ను అశ్విన్ వెనక్కిపంపాడు. కాసేపటికే ఎల్గర్‌ను కూడా అతడే ఔట్ చేశాడు.

### మళ్లీ విసిగించిన తోక

లంచ్ తర్వాత రెండో ఓవర్‌లో జడేజా.. డికాక్ (5)ను ఔట్ చేయడంతో ప్రొటీస్ సగం వికెట్లు కోల్పోయింది. కొన్ని చక్కటి షాట్లు కొట్టిన బవుమా (38)కు జడ్డూ డగౌట్ దారి చూపితే.. ముత్తుస్వామి (9) కథ షమీ ముగించాడు. ఎదురుదాడికి దిగిన ఫిలాండర్ (37) జడేజా ఓవర్‌లో రెండు భారీ సిక్సర్లు బాదాడు. మరో ఎండ్‌లో కేశవ్ మహారాజ్ (22) నుంచి సహకారం అందడంతో టీ విరామానికి దక్షిణాఫ్రికా మరో వికెట్ కోల్పోలేదు. తొలి ఇన్నింగ్స్ మాదిరే క్రీజులో పాతుకుపోయిన వీరిద్దరూ 8వ వికెట్‌కు 21.2 ఓవర్ల పాటు బ్యాటింగ్ చేసి 56 పరుగులు జోడించారు. ఈ దశలో ఉమేశ్ ఒకే ఓవర్‌లో ఫిలాండర్, రబాడ (4)ను ఔట్ చేస్తే.. కేశవ్‌ను వెనక్కి పంపడం ద్వారా జడేజా సఫారీల ఇన్నింగ్స్‌కు తెరదించాడు.

> ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్‌లో భాగంగా ఆడే ప్రతిమ్యాచ్ కీలకమే. అది సొంతగడ్డపై అయినా.. విదేశాల్లోనైనా పాయింట్లు సమానమే. మూడో టెస్టులోనూ ఇదే తీవ్రత కొనసాగిస్తాం. రిలాక్స్ అయ్యే ప్రసక్తే లేదు. జోరు కనబరుస్తూ సిరీస్ క్లీన్ స్వీప్ చేయడమే మా ముందున్న లక్ష్యం. నాలుగైదేండ్లుగా మా అందరిలో గెలవాలన్న కసి పెరిగింది. అందుకు తగ్గట్లే చక్కటి బృందం కుదిరింది. తొలి ఇన్నింగ్స్‌లో రహానేతో కలిసి జోడించిన భాగస్వామ్యమే మ్యాచ్‌ను మనవైపు మొగ్గేలా చేసింది.
>
> **- విరాట్ కోహ్లీ, భారత కెప్టెన్**

**1**

**దక్షిణాఫ్రికాపై భారత్‌కిదే భారీ విజయం. 2009-10 కోల్‌కతా టెస్టులో ఇన్నింగ్స్ 57 పరుగులతో సఫారీలపై గెలిచిన టీమ్‌ఇండియా ఈ మ్యాచ్‌లో ఇన్నింగ్స్ 137 పరుగులతో ప్రొటీస్‌ను చిత్తుచేసింది.**

**2**

**ఈ దశాబ్దంలో దక్షిణాఫ్రికా రెండు సార్లు ఇన్నింగ్స్ పరాభవాలు చవిచూసింది. ఆ రెండు భారత్ చేతిలోనే కావడం విశేషం.**

### అగ్రస్థానం మనదే..

ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్‌లో భారత్ జైత్రయాత్ర కొనసాగుతున్నది. వెస్టిండీస్ టూర్‌తో ప్రారంభమైన భారత విజయాల జోరు.. సొంతగడ్డపై మరింత పదునెక్కింది. కరీబియన్ గడ్డపై రెండు మ్యాచ్‌ల సిరీస్‌ను 2–0తో కైవసం చేసుకున్న టీమ్‌ఇండియా 120 పాయింట్లు ఖాతాలో వేసుకోగా.. తాజా సిరీస్‌లో ఇప్పటికే రెండు మ్యాచ్‌లు నెగ్గి పాయింట్ల సంఖ్యను 200కు పెంచుకుంది. ప్రస్తుతం పట్టికలో రెండో స్థానంలో ఉన్న న్యూజిలాండ్ (60) కంటే భారత్ 140 పాయింట్ల ఆధిక్యంలో ఉంది.

**11**

**సొంతగడ్డపై భారత్ సాధించిన వరుస సిరీస్‌ల సంఖ్య. టెస్టు క్రికెట్‌లో ఏ జట్టుకైనా ఇదే అత్యధికం. గతంలో ఆస్ట్రేలియా రెండుసార్లు (1994-2001, 2004-2008 మధ్య) వరుసగా 10 టెస్టు సిరీస్ విజయాలు సాధించింది.**

### అందుకే సాహాకు చాన్స్

సిరీస్ ప్రారంభానికి ముందు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కోహ్లీ మాట్లాడుతూ.. 'ప్రస్తుతం ప్రపంచంలో అత్యుత్తమ వికెట్ కీపర్ వృద్ధిమాన్ సాహానే.. భారత్‌లో బంతి ఊహించని రీతిలో దూసుకొస్తుంది కాబట్టి బెస్ట్ కీపర్‌ని ఎంచుకున్నాం. అందుకే పంత్‌ను పక్కన పెట్టాల్సి వచ్చింది'అని అన్నాడు. ఆ మాటలు అక్షర సత్యాలని నిరూపిస్తూ.. సాహా పుణెలో చెలరేగిపోయాడు. దాదాపు రెండో స్లిప్ ముందు వరకు డైవ్ కొట్టినా.. లెగ్ సైడ్ వెళ్తున్న బంతిని అమాంతం దూకి రెప్పపాటులో అందుకున్నా అతడికే చెల్లింది. ఇక సఫారీ సారథి డుప్లెసిస్ క్యాచ్ అందుకున్న తీరైతే అద్భుతం అనక తప్పదు. ప్లెసిస్ బ్యాట్, ప్యాడ్‌కు తాకిన బంతి వికెట్ల ముందు వైపు కింద పడుతున్న సమయంలో ముందుకు డైవ్ చేసిన సాహా మూడు సార్లు ప్రయత్నించి విఫలమై.. చివరిగా నాలుగోసారి బంతి నేలకు తాకేందుకు అర క్షణం ముందు అందుకొని సాహో అనిపించుకున్నాడు.



### స్కోరు బోర్డు

**భారత్ తొలి ఇన్నింగ్స్:** 601/5 డిక్లేర్డ్, దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్: 275, దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్: మార్క్‌రమ్ (ఎల్బీ) ఇషాంత్ 0, ఎల్గర్ (సి) ఉమేశ్ (బి) అశ్విన్ 48, డిబ్రుయన్ (సి) సాహా (బి) ఉమేశ్ 8, డుప్లెసిస్ (సి) సాహా (బి) అశ్విన్ 5, బవుమా (సి) రహానె (బి) జడేజా 38, డికాక్ (బి) జడేజా 5, ముత్తుస్వామి (సి) రోహిత్ (బి) షమీ 9, ఫిలాండర్ (సి) సాహా (బి) ఉమేశ్ 37, మహారాజ్ (ఎల్బీ) జడేజా 22, రబాడ (సి) రోహిత్ (బి) ఉమేశ్ 4, నోర్జె (నాటౌట్) 0, **ఎక్స్‌ట్రాలు:** 13, **మొత్తం:** 67.2 ఓవర్లలో 189. **వికెట్ల పతనం:** 1–0, 2–21, 3–70, 4–71, 5–79, 6–125, 7–129, 8–185, 9–189, 10–189, **బౌలింగ్:** ఇషాంత్ 5–2–17–1, ఉమేశ్ 8–3–22–3, షమీ 9–2–34–1, అశ్విన్ 21–6–45–2, జడేజా 21.2–4–52–3, రోహిత్ 2–0–4–0, కోహ్లీ 1–0–4–0.



# బొటాస్‌దే జపాన్ గ్రాండ్‌ప్రి

**సుజుక (జపాన్):** ఫార్ములా వన్ జపాన్ గ్రాండ్‌ప్రి టైటిల్‌ను మెర్సిడెస్ రేసర్ వాల్తెరి బొటాస్ కైవసం చేసుకున్నాడు. ఆదివారం ఇక్కడ ఉత్కంఠ భరితంగా సాగిన రేసులో ఫెరారీ రేసర్ సెబాస్టియన్ వెటెల్‌ను, తన జట్టుకే చెందిన లూయిస్ హామిల్టన్‌ను వెనక్కి నెట్టి బొటాస్ అగ్రస్థానంలో నిలిచాడు. దీంతో డబుల్ పోడియం ఫినిష్‌తో మెర్సిడెస్ వరుసగా ఆరో ఏడాది కన్‌స్ట్రక్టర్స్ ప్రపంచ చాంపియన్‌షిప్‌ను గెలిచి రికార్డు సృష్టించింది. ఇదే రేసులో ఫెరారీకి చెందిన మరో డ్రైవర్ చార్లెస్ లెక్‌లెర్క్ ఆరోస్థానంలో నిలిచి నిరాశపరిచాడు. ఇక నాలుగో స్థానంలో రెడ్‌బుల్ రేసర్ అల్బోన్ నిలువగా, అదే జట్టుకు చెందిన స్టార్ వెర్‌స్టాపెన్ రేసును పూర్తి చేయలేకపోయాడు. ఓ దశలో మూడో స్థానంలో ఉన్న బొటాస్ చివరికి మెరుపువేగంతో టాప్‌లో నిలిచి టైటిల్‌ను ముద్దాడాడు.

### బీసీసీఐ హెడ్‌గా దాదా !

**ముంబై:** టీమ్‌ఇండియా విజయవంతమైన కెప్టెన్‌గా గుర్తింపు పొందిన బెంగాల్ టైగర్ సౌరభ్ గంగూలీ బీసీసీఐ అధ్యక్షపీఠం అధిరోహించే అవకాశాలు కనిపిస్తున్నాయి. తెర వెనుక అందుకు సంబంధించిన కార్యకలాపాలు చురుగ్గా సాగుతున్నాయి. దాదా జట్టులో కేంద్ర హోం మినిస్టర్ కుమారుడు జై షా కార్యదర్శిగా.. బీసీసీఐ మాజీ అధ్యక్షుడు అనురాగ్ ఠాకూర్ తమ్ముడు అరుణ్ ట్రెజరర్‌గా వ్యవహరించనున్నట్లు సమాచారం.

# షాంఘై కింగ్ మద్వెదెవ్

**షాంఘై:** రష్యా స్టార్ డానియల్ మద్వెదెవ్ (రష్యా) షాంఘై మాస్టర్స్ ఓపెన్ విజేతగా నిలిచాడు. ఆదివారం ఇక్కడ జరిగిన ఫైనల్లో మద్వెదెవ్ 6–4, 6–1 తేడాతో అలెగ్జాండర్ జ్వెరెవ్ (జర్మనీ)పై విజయం సాధించాడు. తొలి సెట్‌లో రష్యా స్టార్ ఓ దశలో 11 నిమిషాల్లోనే 3–0తో నిలిచాడు. అయితే కోలుకున్న జ్వెరెవ్ వరుసగా రెండు గేమ్‌లు నెగ్గి పోటీకి వచ్చేందుకు ప్రయత్నించినా... మద్వెదెవ్ పట్టు విడువకుండా తొలి సెట్ చేజిక్కించుకున్నాడు. అద్భుత ఆటతీరుతో అలవోకగా రెండో సెట్‌నూ గెలిచి టైటిల్ పట్టాడు.



# గాఫ్‌కు తొలి టైటిల్

**లింజ్ (ఆస్ట్రియా):** అమెరికా యువ సంచలనం 15 ఏండ్ల కోకో గాఫ్ తొలి డబ్ల్యూటీఏ టైటిల్ కైవసం చేసుకుంది. ఆదివారం జరిగిన లింజ్ ఓపెన్ ఫైనల్లో గాఫ్ 6–3, 1–6, 6–2 తేడాతో జెలెనా ఓస్టపెంకో (లాత్వియా)ను ఓడించింది. వాయ్‌దిసోవా (చెక్ రిపబ్లిక్) తర్వాత డబ్ల్యూటీఏ టైటిల్ సాధించిన పిన్న వయస్కురాలిగా గాఫ్ రికార్డు సృష్టించింది. వింబుల్డన్‌లో నాలుగో రౌండ్ చేరి ఆమె ప్రపంచ దృష్టిలో పడింది.

## నేడు బ్యాంకర్లతో ఆర్థిక మంత్రి భేటీ



**న్యూఢిల్లీ, అక్టోబర్ 13:** కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సోమవారం ప్రభుత్వ రంగ బ్యాంకుల అధిపతులతో సమావేశంకాబోతున్నారు. ఎన్‌బీఎఫ్‌సీ, ఎంఎస్‌ఎంఈ (సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు) రుణ లభ్యత గురించి ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై చర్చించనున్నట్లు ప్రభుత్వవర్గాలు వెల్లడించాయి. బ్యాంకుల ప్రస్తుత పనితీరు, స్టాక్ మార్కెట్ల నుంచి నిధుల సేకరణతోపాటు ఇతర ఆర్థికాంశాలపై ప్రధానంగా చర్చించనున్నారు. ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన ఐఎల్‌అండ్‌ఎఫ్‌ఎస్ దెబ్బకు ఇతర ఎన్‌బీఎఫ్‌సీ, హౌజింగ్ ఫైనాన్స్ కంపెనీల స్థితిగతుల వివరాలు కూడా సేకరించనున్నారు. రుణ పరిధిని మరింత పెంచుకోవడానికి ప్రభుత్వరంగ బ్యాంక్‌లు చేపట్టిన 226 జిల్లాల బాట పథకంపై కూడా చర్చించనున్నారు.

బ్యాంకుల అధిపతులతో నిర్మలా సీతారామన్ సమావేశం కావడం గడిచిన నెల రోజుల్లో ఇది రెండోసారి. వ్యవసాయ, వాహన, గృహ, ఎంఎస్‌ఎంఈ, విద్యా, వ్యక్తిగత రుణాలను గ్రామాల్లో అందించడానికి ఈ నెల 7 నుంచి ఐదు రోజుల పాటు లోన్‌మేలాను నిర్వహించిన విషయం తెలిసిందే. రెండో విడుత ఈ నెల 21 నుంచి 25 వరకు నిర్వహించనున్నారు. అలాగే రుణాలను వేగవంత చేయడానికి కేంద్ర ప్రభుత్వం 'psbloansin 59 minutes' పేరుతో ప్రత్యేక పోర్టల్‌ను ఆరంభించింది. అనుమతి పొందిన తర్వాత 7 నుంచి 8 రోజుల్లో రుణం మంజూరుకానున్నది.

# ఈసారి జీడీపీ 6 శాతమే

### దేశంలో తీవ్ర మందగమనం • వృద్ధిరేటు అంచనాల్ని తగ్గించిన ప్రపంచ బ్యాంక్

**వాషింగ్టన్, అక్టోబర్ 13:**




దేశ వృద్ధిరేటుపై అంచనాలు పడిపోతున్నా యి. మొన్న మూడీస్.. నిన్న ఇండియా రేటిం గ్స్.. తాజాగా ప్రపంచ బ్యాంక్.. వరుసగా భారత జీడీపీపై పెదవి విరిచాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2019-20) దేశ వృద్ధిరేటు 6 శాతానికే పరిమితమవుతుందని ఆదివారం వరల్డ్ బ్యాంక్ పేర్కొన్నది. గత ఆర్థిక సంవత్సరం (2018-19) భారత జీడీపీ 6.8 శాతంగా నమోదైన విషయం తెలిసిందే. అయితే మందగమన పరిస్థితుల నేపథ్యంలో ఈసారి 6 శాతం దాటకపోవచ్చని అంటున్నది ప్రపంచ బ్యాంక్. దక్షిణాసియా ఎకనామిక్ ఫోకస్ తాజా ఎడిషన్‌లో దేశ జీడీపీ గణాంకాలు వరుసగా రెండో ఏడాది తగ్గుముఖం పట్టనున్నాయన్న సంకేతాలనిచ్చింది. 2017 -18 ఆర్థిక సంవత్సరంలో 7.2 శాతంగా ఉన్న భారత వృద్ధిరేటు.. 2018-19లో 6.8 శాతానికి దిగింది. ఈ 2019-20లో మరింతగా క్షీణించి 6 శాతం గానే ఉండొచ్చని అభిప్రాయపడింది. అయితే క్రమంగా దేశ జీడీపీ గణాంకాలు పుంజుకోవచ్చన్న వరల్డ్ బ్యాంక్.. వచ్చే ఆర్థిక సంవత్సరం (2020-21) 6.9 శాతానికి, ఆపై ఆర్థిక సంవత్సరం (2021-22) 7.2 శాతానికి పెరుగగలదన్న ఆశాభావాన్ని కనబరిచింది. అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్)తో ప్రపంచ బ్యాంక్ వార్షిక సమావేశాలు జరుగడానికి ముందు విడుదలైన ఈ తాజా నివేదికలో భారత వృద్ధిరేటుపై ఒకింత ఆందోళన వ్యక్తం కావడం గమనార్హం. ఇప్పటికే మూడీస్, ఇండియా రేటింగ్స్.. భారత జీడీపీ వృద్ధి అంచనాలకు కోత పెట్టిన నేపథ్యంలో ప్రపంచ బ్యాంక్ కూడా అదే తరహా అంచనాను ప్రకటించడం దేశంలో నెలకొన్న మందగమన పరిస్థితులకు నిదర్శనంగా నిలుస్తున్నది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికిగాను మూడీస్ 5.8 శాతం, ఇండియా రేటింగ్స్ 6.1 శాతంగా దేశ జీడీపీని అంచనా వేసిన సంగతి విదితమే. ఇదిలావుంటే పారిశ్రామికోత్పత్తి పుంజుకోవచ్చని, తయారీ, నిర్మాణ రంగాల పనితీరు మెరుగు పడవచ్చని ఈ సందర్భంగా ప్రపంచ బ్యాంక్ అంచనా వేసింది. వ్యవసాయ, సేవా రంగాలూ ఆశాజనకంగా ఉండవచ్చన్నది. వీటిలో 2.9 శాతం, 7.5 శాతం వృద్ధిరేటు నమోదు కావచ్చన్నది. ఇక దేశంలో పేదరికం తగ్గుముఖం పడుతున్నదని, అయితే ఇటీవలికాలంలో ఈ క్షీణత కాస్త నెమ్మదించిందని ప్రపంచ బ్యాంక్ పేర్కొన్నది.

**దక్షిణాసియా జీడీపీ 5.9 శాతమే**

ప్రపంచ ఆర్థిక వ్యవస్థను మాంద్యం ప్రభావితం చేస్తున్న నేపథ్యంలో దక్షిణాసియా దేశాల జీడీపీ ఈసారి 5.9 శాతానికే పరిమితం కావచ్చని ప్రపంచ బ్యాంక్ తమ తాజా నివేదికలో అంచనా వేసింది. ఏప్రిల్‌తో పోల్చితే ఇది 1.1 శాతం తగ్గడం గమనార్హం. అయితే కొన్ని దేశాల వృద్ధిరేటు ప్రగతి దిశగా పయనిస్తున్నదని చెప్పింది. బంగ్లాదేశ్ జీడీపీ 8.1 శాతంగా, 6.5 శాతానికిపైగా ఉండొచ్చన్నది. అఫ్ఘానిస్తాన్, భూటాన్, మాల్దీవుల జీడీపీ కూడా పెరుగవచ్చని చెప్పింది. అయితే శ్రీలంక వృద్ధిరేటు 2.7 శాతంగానే ఉండొచ్చన్న వరల్డ్ బ్యాంక్.. పాకిస్తాన్ జీడీపీ 2.4 శాతానికి పతనం కావచ్చన్నది. ఇక ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో రెండో స్థానంలో ఉన్న చైనా జీడీపీ ఈసారి 6.1 శాతానికి తగ్గవచ్చని, వచ్చే ఏడాది 5.9 శాతం, ఆపై ఏడాది 5.8 శాతానికి పరిమితం కాగలదని చెప్పింది. అమెరికాతో వాణిజ్య యుద్ధం ఆ దేశ వృద్ధికి బ్రేకులు వేస్తున్నదని అభిప్రాయపడింది.

### ఇప్పటికీ ఆ సత్తా ఉన్నది

అంతర్జాతీయ ఆర్థిక మందగమనం ప్రభావంతో భారత జీడీపీ అంచనాలు దిగజారుతున్నాయని, అంతేతప్ప దేశ ఆర్థిక మూలాలు బలంగానే ఉన్నాయని ప్రపంచ బ్యాంక్ స్పష్టం చేసింది. ఇప్పటికీ అత్యంత వేగవంతమైన వృద్ధిరేటుగల ఆర్థిక వ్యవస్థగా నిలబడే సామర్థ్యం భారత్‌కు ఉందని తెలిపింది. నిజానికి ఏప్రిల్‌లో ఈసారి దేశ జీడీపీ వృద్ధిరేటు 7.5 శాతంగా ఉండొచ్చని ప్రపంచ బ్యాంక్ అంచనా వేసింది. అయితే మందగమనం కారణంగా ఒక్కసారిగా ఈ అంచనా భారీగా తగ్గిపోయింది. అయినప్పటికీ చాలా దేశాలతో పోల్చితే భారత్ వృద్ధిరేటు బాగానే ఉందని ప్రపంచ బ్యాంక్ దక్షిణాసియా విభాగం ముఖ్య ఆర్థికవేత్త హన్స్ టిమ్మర్ పీటీఐతో అన్నారు.

## రేపు జీఎస్టీ ప్యానెల్ సమావేశం




**న్యూఢిల్లీ, అక్టోబర్ 13:** జీఎస్టీ వసూళ్లను పెంచడానికి కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉన్నత స్థాయి ప్యానెల్ కమిటీ మంగళవారం తొలిసారిగా సమావేశంకాబోతున్నది. పన్నుల పరిధిని పెంచడానికి, ఎగవేతలను నియంత్రించడానికి గతవారంలో కేంద్రం ప్రత్యేక ప్యానెల్‌ను ఏర్పాటు చేసింది. సెప్టెంబర్ నెలకుగాను జీఎస్టీ వసూళ్లు 19 నెలల కనిష్ఠ స్థాయి రూ.91,916 కోట్లకు పడిపోవడంతో ప్రభుత్వం దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించింది. ఈ నెల 15న కమిటీ తొలిసారిగా సమావేశంకాబోతున్నదని జీఎస్టీ కౌన్సిల్ ప్రత్యేక కార్యదర్శి రాజీవ్ రాజన్ తెలిపారు. ఈ కమిటీ తన తుది నివేదికను సమర్పించడానికి పదిహేను రోజులు గడువు వచ్చినట్లు ఆయన చెప్పారు. జూలై 1, 2017 నుంచి అమలులోకి వచ్చిన నాటి నుంచి జీఎస్టీపై సమీక్ష నిర్వహించడం ఇదే తొలిసారి. పలు రాష్ట్రాలకు చెందిన జీఎస్టీ కమిషనర్లు, కేంద్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు కలిసి 12 మంది సభ్యులు ఉన్న ఈ కమిటీ..జీఎస్టీ పన్నుల విధానంపై ప్రధానంగా చర్చించి ఒక నివేదికను సమర్పించనున్నది. జీఎస్టీ పన్నుల విధానంలో నూతన సంస్కరణలు ప్రవేశపెట్టడం, ఇతర విషయాలను క్రోడీకరించి నివేదికను ఈ నెల చివర్లో కేంద్రానికి అందించనున్నది. ఈ కమిటీలో మహారాష్ట్ర, తమిళనాడు, ఉత్తర ప్రదేశ్, పశ్చిమ బెంగాల్, పంజాబ్‌లకు చెందిన జీఎస్టీ కమిషనర్లతోపాటు కేంద్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు, జీఎస్టీ ప్రధాన కమిషనర్, జాయింట్ కార్యదర్శి(రెవెన్యూ) అధికారులు ఉన్నారు.



హెచ్‌సీ3 ప్రారంభోత్సవం సందర్భంగా ఎయిర్‌పోర్టు ప్రతినిధులు

## కార్గోకు మరింత దన్ను

### శంషాబాద్ ఎయిర్‌పోర్టులో హెచ్‌సీ3 ప్రారంభం

**శంషాబాద్, నమస్తే తెలంగాణ:** జీఎమ్మార్ హైదరాబాద్ ఎయిర్‌పోర్టు కార్గో.. హైదరాబాద్ కార్గో చార్టర్ సర్కిల్ (హెచ్‌సీ3)ను ప్రారంభించింది. ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో హెచ్‌సీ3ని ఆవిష్కరించారు. దక్షిణాదిన హైదరాబాద్‌ను ఎయిర్ చార్టర్ హబ్‌గా అభివృద్ధి పరిచేందుకు కృషి చేస్తున్నామని శంషాబాద్ ఎయిర్‌పోర్టు వర్గాలు తెలిపాయి. అమెరికా, మిడిల్ ఈస్ట్, ఫార్ ఈస్ట్, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాలతో మార్కెట్ సంబంధాలు మెరుగు పరిచేందుకు జీఎమ్మార్ దీన్ని వ్యూహాత్మకంగా ప్రారంభించిందన్నాయి. కాగా, హెచ్‌సీ3 సభ్యత్వ పథకంలో చేరినవారికి అదనపు ఉచిత కార్గో స్టోరేజీ సమయం, కార్గో హ్యాండ్లింగ్‌కు సంబంధించి సింగిల్ పాయింట్ కాంటాక్ట్, 24 గంటల కస్టమర్ కేర్ సేవలు, ప్రాధాన్య స్టోరేజీ సదుపాయం, టెర్మినల్ పరిధిలో మొదటి నుంచి చివరిదాకా లాజిస్టిక్స్ సపోర్టు అందనున్నాయి. దేశంలో కార్గో రవాణా చాలా తక్కువగా ఉన్నప్పటికీ భవిష్యత్తులో పెరిగే అవకాశం ఉన్నదని జీఎమ్మార్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు లిమిటెడ్ సీఈవో ఎస్‌జీకే కిశోర్ విశ్వాసం వ్యక్తం చేశారు. హెచ్‌సీ3తో ఎయిర్‌పోర్టులో పారిశ్రామిక వర్గాల వాణిజ్యం పెరుగుతుందన్నారు.



కూకట్‌పల్లి సౌత్ ఇండియా షాపింగ్ మాల్‌లో దసరా బంపర్ డ్రా విజేతలను ప్రకటిస్తున్న దృశ్యం

## 'సౌత్ ఇండియా' విజేతలు వీరే

SOUTH INDIA shopping mall

**హైదరాబాద్, అక్టోబర్ 13:** ప్రముఖ దుస్తుల విక్రయ సంస్థ సౌత్ ఇండియా షాపింగ్ మాల్ దసరా సందర్భంగా ప్రకటించిన సరికొత్త ఆఫర్లకు వినియోగదారుల నుంచి విశేషన స్పందన లభించింది. కూకట్‌పల్లి బ్రాంచిలో నిర్వహించిన బంపర్ డ్రాలో గెలుపొందిన వారి పేర్లను సంస్థ ప్రకటించింది. వీరిలో 10 గ్రాముల విలువైన బంగారం నెక్లెస్‌లు 30 మంది గెలుచుకోగా, మూడు బైకులు, స్కూటీలు మూడు, 100 గ్రాముల బంగారం వడ్డాణం, శాంత్రో కార్లను ముగ్గురేసి చొప్పున గెలుచుకున్నారు. కారు గెలుచుకున్నవారిలో ఆర్ శరణ్య (కూ.నం: 773433), కే రాజేందర్ రెడ్డి (కూ.నం: 715303), సూర్జ్ (కూ.నం: 1574440) ఉండగా, వడ్డాణం గెలుచుకున్నవారిలో టీ సుమన్(కూ.నం: 1655064), జీ లక్ష్మీ (కూ.నం: 1819798), సీహెచ్‌బీ రాజు(కూ.నం: 1009212) ఉన్నారు. అలాగే బైకు గెలుచుకున్నవారిలో భాస్కర్‌రాజు (కూ. నం: 1403500), ఎస్ సాంబశివరావు (కూ.నం:1569338), డీ రాజేశం (కూ.నం: 275090), యాక్టివా స్కూటర్ దక్కించుకున్నవారిలో రిషి (కూ. 203867), కే విజయ(కూ.498541), టీ పాండ్యా (కూ.875517)లు ఉన్నారు. మిగతా 30 మంది నెక్లస్ గెలుచుకున్నారు.

## ఆ ప్లాస్టిక్‌ను వాడొద్దు

- సింగిల్-యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని క్రమంగా తగ్గించండి
- ఈ-కామర్స్ సంస్థలకు సూచించిన కేంద్రం



**న్యూఢిల్లీ, అక్టోబర్ 13:** ఒక్కసారి మాత్రమే వాడే ప్లాస్టిక్ వినియోగాన్ని క్రమంగా తగ్గించుకోవాలని ఈ-కామర్స్ సంస్థలకు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ సూచించింది. ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్న వివిధ వస్తూత్పత్తులను కస్టమర్లకు పంపించడంలో భాగంగా చేస్తున్న ప్యాకేజింగ్‌లో సింగిల్-యూజ్ ప్లాస్టిక్‌ను ఈ-కామర్స్ మార్కెటీర్లు పెద్ద ఎత్తున వినియోగిస్తున్నారు. దీంతో ఆ ప్లాస్టిక్‌ను వాడొద్దని సదరు మంత్రిత్వ శాఖ వర్గాలు ఆన్‌లైన్ వ్యాపార సంస్థలను కోరుతున్నాయి. పరిశ్రమ, అంతర్గత వాణిజ్య ప్రోత్సాహక శాఖ (డీపీఐఐటీ) సైతం ఈ మేరకు సూచనలు చేసింది. పర్యావరణ సమతుల్యతకు భంగం కలిగిస్తున్న సింగిల్-యూజ్ ప్లాస్టిక్‌ను నిర్మూలించాలని కేంద్రంలోని నరేంద్ర మోదీ సర్కారు లక్ష్యంగా పెట్టుకున్నది. ఈ క్రమంలోనే ప్యాకేజింగ్‌లో 40 శాతానికిపైగా సింగిల్-యూజ్ ప్లాస్టిక్‌ను వినియోగిస్తున్న ఈ-కామర్స్ మార్కెటీర్లకు అధికారులు పైవిధంగా సూచనలు చేశారు. వచ్చే ఏడాది జూన్ కల్లా దేశంలో ఈ సింగిల్-యూజ్ ప్లాస్టిక్‌ను నివారించాలన్న దిశగా ముందుకెళ్తున్నామని వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖకు చెందిన ఓ అధికారి తెలిపారు. కాగా, పర్యావరణ పరిరక్షణకు తమ సంస్థ ఎన్నో రకాల చర్యలను చేపట్టిందని ఫ్లిప్‌కార్ట్ చీఫ్ కార్పొరేట్ అఫైర్స్ ఆఫీసర్ రజ్నీశ్ కుమార్ చెప్పారు. లాజిస్టిక్స్‌లో విద్యుత్ ఆధారిత వాహనాల వినియోగం, వ్యర్థాల నిర్వహణ, ప్రభావవంతమైన ప్యాకేజింగ్ చేపడుతున్నామని వెల్లడించారు. సింగిల్-యూజ్ ప్లాస్టిక్ వాడకాన్నీ తగ్గిస్తున్నామని గుర్తుచేశారు. 57 ఇండస్ట్రియల్ ఎస్టేట్ల అధిపతులు, సీఈవోలకూ ప్లాస్టిక్ వాడకం నియంత్రణకు సబంధించి సూచనలు చేశామని డీపీఐఐటీ స్పష్టం చేసింది.

### భారత్ గుర్తించింది: ఐఎంఎఫ్

నిలకడైన పర్యావరణహిత అభివృద్ధి వ్యూహం అవసరాన్ని భారత్ గుర్తించిందని అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) ఆనందం వ్యక్తం చేసింది. 'భారత్ అభివృద్ధి చెందుతున్నది. భారత్ రూపాంతరం చెందుతున్నది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారత్ కీలక పాత్ర పోషించగలదు' అని ఐఎంఎఫ్ ఆర్థిక వ్యవహారాల శాఖ డైరెక్టర్ విటర్ గాస్పర్ పీటీఐకిచ్చిన ఇంటర్వ్యూలో అన్నారు. వాతావరణ మార్పులకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరులో పర్యావరణానికి భంగం కలిగించకుండా సమగ్ర అభివృద్ధిని సాధించడం ఎలా? అన్నదానిపై ప్రపంచ దేశాలు ఇప్పుడు తీవ్రంగా ఆలోచిస్తున్నాయని ఆయన తెలిపారు. భవిష్యత్ తరాల కోసం పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. కర్బన ఉద్గారాలు, ప్లాస్టిక్ నిర్మూలన, భూ, జల, వాయు కాలుష్యం వంటి వాటిని అరికట్టాలని పిలుపునిచ్చారు.

## స్కూటర్ సెగ్మెంట్‌లో సుజుకీ దూకుడు

### హీరోను దాటి మూడోస్థానానికి ఎగబాకిన ర్యాంక్



**న్యూఢిల్లీ, అక్టోబర్ 13:** దేశీయ స్కూటర్ విభాగంలో సుజుకీ మోటార్‌సైకిల్ తన సత్తాను చాటుతున్నది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల్లో అమ్ముడైన వాహనాల్లో సుజుకీ మూడో స్థానం దక్కించుకున్నది. ఈ స్థానంలో ఉన్న ప్రముఖ ద్విచక్ర వాహన సంస్థ హీరో మోటోకార్ప్ ఆ తర్వాతి స్థానానికి పడిపోయినట్లు భారత ఆటోమొబైల్ తయారీదారుల సంఘం(సియామ్) వెల్లడించింది. హోండా మోటార్‌సైకిల్ అండ్ స్కూటర్ ఇండియా(హెచ్‌ఎంఎస్‌ఐ) తొలిస్థానంలో కొనసాగుతుండగా, చెన్నైకు చెందిన టీవీఎస్ మోటార్ ఆ తర్వాతి స్థానంలో నిలిచింది. ఏప్రిల్-సెప్టెంబర్ మధ్యకాలంలో సుజుకీ మోటార్‌సైకిల్ 3,41,928 యూనిట్లను విక్రయించగా, ఇదే సమయంలో హీరో మోటో 2,49,365లను అమ్మింది. క్రితం ఏడాది ఇదే సమయంలో విక్రయించిన 2,91,847లతో పోలిస్తే సుజుకీ సేల్స్ భారీగా పెరుగగా, హీరో అమ్మిన 3,91,019లతో పోలిస్తే భారీగా పడిపోయాయి. గడిచిన ఆరు నెలల్లో సుజుకీ స్కూటర్ విక్రయాల్లో 17.16 శాతం పెరుగుదల నమోదైంది. ఇదే సమయంలో హీరో విక్రయాలు 36.23 శాతం పడిపోవడంతో ర్యాంక్ మూడో స్థానం నుంచి నాలుగో స్థానానికి పడిపోవడానికి కారణమైంది. మొత్తంమీద గత ఆరు నెలల్లో స్కూటర్ విక్రయాలు ఏడాది ప్రాతిపదికన 16.94 శాతం తగ్గి 31,17,433లకు పడిపోయాయి. ఇదే సమయంలో హెచ్‌ఎంఎస్‌ఐ 17,32,579ల స్కూటర్లను విక్రయించగా, టీవీఎస్ మోటర్ 5,98,617ల అమ్మకాలు జరిపింది. 1,57,483లతో యమహా మోటర్ ఐదోస్థానంలో కొనసాగింది.



## 5జీ సేవలకు దెబ్బ

### ఓ వైపు ఇస్రో స్పెక్ట్రం డిమాండ్ • మరోవైపు టెలికం శాఖ షరతులు

#### ఆందోళనలో పరిశ్రమ వర్గాలు

**న్యూఢిల్లీ, అక్టోబర్ 13:** భారత అంతరిక్ష్య పరిశోధనా సంస్థ (ఇస్రో)కున్న స్పెక్ట్రం డిమాండ్, 26 గిగాహెట్జ్ శ్రేణిలో మొబైల్ సేవలకు కేంద్ర టెలికం మంత్రిత్వ శాఖ ప్రతిపాదించిన షరతులు.. దేశంలో 5జీ సేవలకు సవాల్‌గా మారుతున్నాయని పరిశ్రమ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 26 గిగాహెట్జ్ బ్యాండ్‌లోని తరంగాలను ఇస్రో వాడుకునేందుకు టెలికం శాఖ అంగీకరించింది. 5జీ మొబైల్ సేవలకు కావాల్సిందీ ఇదే బ్యాండ్. దీంతో మొబైల్ సేవల కోసం షరతులతో కూడిన అనుమతులను టెలికం శాఖ జారీ చేయనున్నది. మెజారిటీ స్పెక్ట్రంను ఇస్రోనే వాడుకుంటుండటంతో శాటిలైట్ సేవలకు ఎలాంటి అంతరాయం కలుగకుండా, వాటి తో సంబంధం లేకుండా ఈ 26 గిగాహెట్జ్ శ్రేణి తరంగాలను టెలికం సంస్థలు వినియోగించుకోవాల్సి ఉంటుంది. ఈ క్రమంలోనే 26 గిగాహెట్జ్ బ్యాండ్‌లో ఏర్పాటు చేసే బేస్ స్టేషన్ల కోసం 200 మెగాహెట్జ్‌కు రేడియోధార్మిక శక్తి 7 డెసిబుల్ వాట్‌ను మించరాదని టెలికం శాఖ స్పష్టం చేసింది. కానీ టెలికం సంస్థలు 33 డెసిబుల్ వాట్‌ను ఆశిస్తున్నాయి. టెలికం శాఖ పరిమితి.. వైఫై హాట్‌స్పాట్‌ల కోసం వినియోగించే డెసిబుల్ వాట్స్‌కన్నా తక్కువగా ఉందని భారత సెల్యులార్ ఆపరేటర్ల సంఘం (సీవోఏఐ) డైరెక్టర్ జనరల్ రాజన్ ఎస్ మాథ్యూస్ పీటీఐతో అన్నా రు. అయితే ప్రపంచవ్యాప్తంగా ఈ తరంగాల వినియోగంపై తుది నిర్ణయం తీసుకోవడానికి వచ్చే నెల ఈజిప్టులో ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలోని ఇంటర్నేషనల్ టెలీకమ్యూనికేషన్ యూనియన్ (ఐటీయూ) సమావేశమవుతున్నది. ఈ సందర్భంగా ఆయా దేశాల అభిప్రాయాలను ఐటీయూ పరిశీలించనుండగా, తమ ప్రతిపాదనలనూ టెలికం శాఖ పంపిం ది. వైర్‌లెస్ సేవల కోసం అంతర్జాతీయ ప్రమాణాలను ఐటీయూనే నిర్దేశిస్తున్నది. దీంతో టెలికం శాఖ నిర్ణయంపై ఐటీయూ ఏమంటుందా? అన్నదానిపై ఇప్పుడు టెలికం పరిశ్రమ ఆసక్తిగా ఎదురుచూస్తున్నది. ప్రస్తుత 4జీ సేవల కంటే ఎన్నో రెట్లు అధిక వేగాన్ని కలిగి ఉండే 5జీ సేవల కోసం ప్రపంచ దేశాలు సమాయత్తమవుతున్న విషయం తెలిసిందే. వచ్చే ఏడాది భారత్‌లోనూ 5జీ సేవలను ప్రారంభించాలని టెలికం శాఖ లక్ష్యంగా పెట్టుకున్నది.

# కార్పొరేట్ ఫలితాలే దిక్సూచి

**న్యూఢిల్లీ, అక్టోబర్ 13:**

### స్టాక్ మార్కెట్లకు దిశానిర్దేశం చేయనున్న స్థూల ఆర్థికాంశాలు



ఈ వారంలో కార్పొరేట్ సంస్థలు ప్రకటించబోయే ఆర్థిక ఫలితాలు స్టాక్ మార్కెట్లకు దిశానిర్దేశం చేయనున్నాయి. కార్పొరేట్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌యూఎల్, విప్రోల ఆర్థిక ఫలితాలతోపాటు అంతర్జాతీయంగా నెలకొననున్న పరిణామాలు కూడా మార్కెట్లపై ప్రభావం చూపనున్నాయని దలాల్ స్ట్రీట్ వర్గాలు అంచనావేస్తున్నాయి. పారిశ్రామిక వృద్ధిరేటు పడకేసిన నేపథ్యంలో మదుపరులు అమ్మకాలకు మొగ్గుచూపే అవకాశాలున్నాయి. ఇప్పటి వరకు ఫలితాలు ప్రకటించిన కార్పొరేట్ సంస్థల నిరాశాజనక పనితీరు కనబర్చడం, మరి ముఖ్యంగా ఇన్ఫోసిస్ షేరుపై ఈ ప్రభావం ఎక్కువగా ఉండనున్నదని, వీటితోపాటు అమెరికా-చైనా దేశాల మధ్య జరుగుతున్న చర్చలపై పెట్టుబడిదారులు ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు రెలిగేర్ బ్రోకింగ్ లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్ అజిత్ మిశ్రా తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికానికిగాను ఇన్ఫోసిస్ నికర లాభం 2.2 శాతం క్షీణించి రూ.4,019 కోట్లకు పడిపోయినట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. పూర్తిస్థాయిలో కార్పొరేట్ల ఫలితాలు ఈ వారం ప్రారంభమవనుండటంతో మార్కెట్లో సెంటిమెంట్‌ను ప్రభావితం చేసే అంశాల్లో ఇది కీలకమని వ్యాఖ్యానించారు. వీటితోపాటు సోమవారం టోకు ధరల సూచీ ఆధారిత ద్రవ్యోల్బణ గణాంకాలు కూడా విడుదల కానుండటం, భారత వృద్ధిరేటును తగ్గిస్తూ వరల్డ్ బ్యాంక్ ప్రకటించడంతో తీవ్ర ఒత్తిడికి గురయ్యేయ అవకాశాలున్నాయన్నారు. మార్కెట్లు మరి కొన్నివారాలు ఒత్తిడికి గురికావచ్చునని ఎపిక్ రీసర్చ్ సీఈవో ముస్తాఫా నదీమ్ తెలిపారు. సౌదీ అరేబియాలోని ఎర్ర సముద్రం వద్ద ఇరాన్‌కు చెందిన చమురు ట్యాంక్‌పై మరోసారి ఉగ్రవాదులు దాడులు చేయడంతో అంతర్జాతీయ మార్కెట్లో ఇంధన ధరలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. గతవారంలో సెన్సెక్స్ 453.77 పాయింట్లు లేదా 1.20 శాతం పెరిగింది.

**రూ. 80 వేల కోట్లు పెరిగింది**

గతవారంలో టాప్-10 బ్లూచిప్ సంస్థల్లో ఎనిమిది కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ విలువ రూ.80,943.32 కోట్ల మేర పెరిగాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్ అత్యధికంగా లాభపడగా..టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, ఐటీసీలు మాత్రం నష్టపోయాయి. ఆర్‌ఐఎల్ రూ.28,494.36 కోట్లు పెరిగి రూ. 8,57,303.03 కోట్లకు చేరుకోగా, హెచ్‌యూఎల్ రూ.13,216.18 కోట్లు ఎగబాకి రూ. 4,33,990.70 కోట్లకు, ఇన్ఫోసిస్ రూ. 9,642.37 కోట్లు అధికమై రూ. 3,50,346. 61 కోట్లకు చేరాయి. ఐసీఐసీఐ బ్యాంక్ రూ.9,471 కోట్లు అధికమవగా, హెచ్‌డీఎఫ్‌సీ రూ.5,723.68 కోట్లు, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ రూ.5,251.94 కోట్లు, కొటక్ మహీంద్రా బ్యాంక్ రూ.4,918.32 కోట్లు, బజాజ్ ఫైనాన్స్ రూ.4,224.32 కోట్లు పెరిగింది. కానీ, టీసీఎస్ అత్యధికంగా రూ.34,371.90 కోట్ల ఎం-క్యాప్ తగ్గగా, ఐటీసీ రూ. 16,156.7 కోట్లు కోల్పోయింది.

IRCTC

### స్టాక్ మార్కెట్లోకి ఐఆర్‌సీటీసీ

ప్రభుత్వరంగ సంస్థ ఇండియన్ రైల్వే కేటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్(ఐఆర్‌సీటీసీ) సోమవారం నుంచి బీఎస్‌ఈతోపాటు ఎన్‌ఎస్‌జీలోనూ లిస్ట్ కాబోతున్నది. ఐపీవో ద్వారా రూ.645 కోట్లు సేకరించిన విషయం తెలిసిందే. సెప్టెంబర్ 30 నుంచి అక్టోబర్ 4 వరకు నిర్వహించిన ఐపీవోకి కొనుగోలుదారుల నుంచి విశేష స్పందన లభించింది.

### రూ.6 వేల కోట్లు వెనక్కి తీసుకున్న ఎఫ్‌పీఐ



**దేశీయ** ఈక్విటీ మార్కెట్ల నుంచి విదేశీ సంస్థాగత పెట్టుబడిదారుల నిధుల ఉపసంహరణ కొనసాగుతున్నది. అక్టోబర్ నెల తొలి రెండు వారాల్లో విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు రూ.6,200 కోట్ల పెట్టుబడులను తరలించుకుపోయారు. అంతర్జాతీయ ఆర్థిక మాంద్యం, వాణిజ్య యుద్ధం భయాలు ఎఫ్‌పీఐల్లో ఆందోళను మరింత పెంచాయి. వీటిలో ఈక్విటీల నుంచి రూ.4,955.2 కోట్ల పెట్టుబడులను వెనక్కితీసుకున్న ఎఫ్‌పీఐలు..రుణ మార్కెట్ల నుంచి రూ.1,261.90 కోట్లను తరలించుకుపోయారు. గత నెలలో రూ.6,557.8 కోట్ల పెట్టుబడులు పెట్టిన విదేశీ ఇన్వెస్టర్లు..ఆ మరుసటి నెలలోనే వెనక్కి తీసుకోవడం గమనార్హం. భారత వృద్ధి అంచనాను తగ్గిస్తున్నట్లు అంతర్జాతీయ రేటింగ్ సంస్థలు ప్రకటించడం పెట్టుబడిదారుల్లో ఆందోళనను పెంచిందని నిపుణులు విశ్లేషిస్తున్నారు.



ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం లక్నవరం సరస్సు వద్ద ఆదివారం పర్యాటకుల సందడి నెలకొన్నది. సెలవురోజు కావడంతో సుదూర ప్రాంతాల నుంచి పర్యాటకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. వేలాడే వంతెనలపై నడుస్తూ సరస్సులో బోట్లలో షికారు చేస్తూ అందాలను తిలకించి ఫిదా అయ్యారు.
- గోవిందరావుపేట

# నకిలీ నోట్ల తయారీ ముఠా అరెస్టు

### కంప్యూటర్, ప్రింటర్, నకిలీ కరెన్సీ స్వాధీనం

**సిరిసిల్ల క్రైం:** రాజన్న సిరిసిల్ల జిల్లాలో నకిలీ నోట్ల తయారీ ముఠాను పోలీసులు పట్టుకున్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎస్పీ వివరాలను రాహుల్ హెగ్డే వెల్లడించారు. సిరిసిల్లలోని బీవై నగర్‌కు చెందిన గుడెల్లి రాజ్‌కుమార్, శాంతినగర్‌కు చెందిన భీమనాతిని దినేశ్‌కుమార్, కోనరావుపేట మండలం వెంకట్రావుపల్లి వాసి కరణాల రామస్వామి, కొండాపూర్ వాసి మల్యాల లింగం కలిసి నకిలీ నోట్లు తయారీ కోసం ముఠాగా ఏర్పడ్డారు. ఇందుకోసం వేములవాడ మండలం అగ్రహారంలో ఓ ఇంటిని అద్దెకు తీసుకున్నారు. సిరిసిల్ల పాత బస్టాండ్ ప్రాంతంలో దొంగనోట్లు చెలామణి చేస్తున్నారనే సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ సీఐ నవీన్‌కుమార్ రంగంలోకి దిగారు. నోట్లు చెలామణి చేస్తున్న గుడెల్లి రాజ్‌కుమార్‌ను పట్టుకుని సోదాలు చేయగా అతని వద్ద రూ.500 డినామినేషన్‌లో నాలుగు నోట్లు లభించాయి. రాజ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా మరో ముగ్గురితో కలిసి నకిలీ నోట్లు తయారు చేస్తున్న విషయం వెలుగులోకి వచ్చింది. వెంటనే అగ్రహారంలో అద్దెకు ఉంటున్న ఇంట్లో సోదాలు చేయగా ముగ్గురు నిందితులు పట్టుబడ్డారు. వీరితోపాటు ముద్రించిన రూ.500 డినామినేషన్ 41 నోట్లు, పేపర్ షీట్‌పై నకిలీ రూ.500 నోట్లు మూడు, మరో పేపర్‌పై రూ.200 నోట్లు మూడు, వీటిని ముద్రించడానికి వినియోగించిన కంప్యూటర్, స్కానర్, పేపర్ బండిళ్లను స్వాధీనం చేసుకున్నారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న కంప్యూటర్, ప్రింటర్, నకిలీ నోట్లు



## వైకుంఠ ధామానికి రెండెకరాల భూమి దానం

**ఆదిలాబాద్ అర్బన్, నమస్తే తెలంగాణ:** వైకుంఠధామం కోసం ఆదిలాబాద్ మాజీ ఎమ్మెల్యే దివంగత వామన్‌రెడ్డి తనయులు మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నారాయణ రెడ్డి, వారి సమీప బంధువులు చిల్కూరి కిష్టా రెడ్డి, పురుషోత్తంరెడ్డి, ప్రదీప్‌రెడ్డి, నారాయణ రెడ్డి కలిసి రెండు ఎకరాల భూమిని ఆదివారం వాఘాపూర్ గ్రామాభివృద్ధి కమిటీకి విరాళంగా అందజేశారు.

## వృద్ధురాలిపై లైంగికదాడి

### మృత్యువాతపడిన బాధితురాలు

**మెహిదీపట్నం:** అనారోగ్యంతో మంచంపై లేవలేని స్థితిలో ఉన్న ఓ వృద్ధురాలిపై గుర్తు తెలియని వ్యక్తి లైంగికదాడికి పాల్పడటంతో బాధితురాలు మృత్యువాతపడింది. ఈ ఘటన హైదరాబాద్ పాతబస్తీలోని కుల్సుంపురా పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగుచూసింది. పురానాపూల్ బ్రిడ్జి కింద ఫుట్‌పాత్‌పై ఓ గదిలో నివసిస్తున్న కమలాబాయి (68)పై ఈ నెల 11వ తేదీ మధ్యాహ్నం ఓ గుర్తుతెలియని వ్యక్తి లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాధితురాలు అదేరోజు రాత్రి మృత్యువాతపడింది. శనివారం సమాచారం అందుకున్న పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది.

# రక్షణ అవసరాలు తీర్చేలా భారత్

- సూరి భగవంతం స్మారకోపన్యాసంలో డీఆర్డీవో చైర్మన్ సతీశ్‌రెడ్డి ఆకాంక్ష
- క్షిపణి ప్రయోగంలో స్వయంసమృద్ధి సాధించాం
- పరిశోధనలపై వర్సిటీలు మరింత దృష్టి సారించాలి



సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో డాక్టర్ సూరి భగవంతం మెమోరియల్ లెక్చర్ ఇస్తున్న డీఆర్డీవో చైర్మన్ డాక్టర్ జీ సతీశ్‌రెడ్డి. చిత్రంలో సీనియర్ పాత్రికేయుడు రామచంద్రమూర్తి, శాంతా బయోటెక్ సంస్థ వ్యవస్థాపక చైర్మన్ వరప్రసాద్‌రెడ్డి, సీఐసీ గ్రూప్ చైర్మన్, సీఈవో హరికిషన్ కూడా ఉన్నారు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రక్షణ ఉత్పత్తుల దిగుమతులను పూర్తిగా తగ్గించి, ప్రపంచ దేశాలకు ఎగుమతి చేసే స్థాయికి భారత్ ఎదుగాలని కేంద్ర రక్షణశాఖ కార్యదర్శి, రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్డీవో) చైర్మన్ డాక్టర్ జీ సతీశ్‌రెడ్డి ఆకాంక్షించారు. రానున్న పదేండ్లలో అత్యాధునిక రక్షణ పరికరాలను ఉత్పత్తి చేసి ప్రపంచదేశాల అవసరాలను తీర్చాల్సి ఉన్నదన్నారు. ప్రస్తుతం మన దేశం క్షిపణి ప్రయోగాల్లో స్వయం సమృద్ధి సాధించదని చెప్పారు. ఫోరం ఫర్ ఇంటిగ్రేటెడ్ నేషనల్ సెక్యూరిటీ (ఎఫ్‌ఐఎన్‌ఎస్) ఆధ్వర్యంలో ప్రముఖ రక్షణరంగ శాస్త్రవేత్త డాక్టర్ సూరి భగవంతం 110వ జయంతి వేడుకలు ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జరిగాయి. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జీ సతీశ్‌రెడ్డి.. డాక్టర్ సూరి భగవంతం స్మారకోపన్యాసం చేశారు. పలు కీలక హోదాల్లో విధులు నిర్వర్తించిన సూరి భగవంతం.. దేశ రక్షణ వ్యవస్థను పటిష్ఠం చేయడంలో ఎనలేని కృషిచేశారని ప్రశంసించారు. డీఆర్డీవోను విస్తరించడంలో భగవంతం పాత్ర మరువరానిదన్నారు. దేశం అభివృద్ధిలో దూసుకుపోతున్నదంటే దానికి వెనుక.. అబ్దుల్ కలాం, హోమీ జహంగీర్ బాబా, విక్రం సారాభాయ్, సూరి భగవంతం.. ఇలా ఎందరో ప్రపంచం గర్వించదగిన వారున్నారని చెప్పారు. విశాఖపట్నం కేంద్రంగా నౌకాదళానికి అవసరమైన టార్పెడోలు ఉత్పత్తి చేస్తున్నామంటే దాని వెనుక సూరి భగవంతం కృషి దాగున్నదని తెలిపారు. యూనివర్సిటీల్లో ప్రాథమిక పరిశోధనలు మరింత పెరుగాలని, పరిశ్రమలతో అనుసంధానమై ముందుకు వెళ్లాలని సూచించారు. భవిష్యత్ సాంకేతికతపై విస్తృతంగా పరిశోధనలు జరుగాల్సిన అవసరం ఉన్నదన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సలహాదారు, ప్రముఖ జర్నలిస్ట్ కొండుభట్ల రామచంద్రమూర్తి మాట్లాడుతూ.. రక్షణరంగంలో విశేష కృషిచేస్తున్న సతీశ్‌రెడ్డి తెలుగునాట జన్మించడం గర్వకారణమన్నారు. సూరి భగవంతం దేశం గర్వించదగిన గొప్ప శాస్త్రవేత్త అని ప్రశంసించారు. శాంతా బయోటెక్ సంస్థ వ్యవస్థాపక చైర్మన్ వరప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ.. దేశ స్వావలంబన, స్వయం సమృద్ధి అనే అంశాలపై దృష్టిసారించి నిరంతరం కృషిచేశారని సూరి భగవంతం సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా డాక్టర్ జీ సతీశ్‌రెడ్డికి శాంతిశ్రీ పురస్కారాన్ని సీఐసీ గ్రూప్ చైర్మన్, సీఈవో హరికిషన్ ఎప్పనపల్లి బహూకరించారు. కార్యక్రమానికి ఎఫ్‌ఐఎన్‌ఎస్ ఉపాధ్యక్షుడు మేజర్ జనరల్ ఏబీ గోర్తీ అధ్యక్షత వహించారు.



విప్లవ నటుడు ఆర్ నారాయణమూర్తికి 'సుద్దాల' జాతీయ పురస్కారాన్ని ప్రదానం చేస్తున్న మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్. చిత్రంలో సుద్దాల అశోక్‌తేజ, సుద్దాల అర్జున్‌తేజ, ఎస్‌ఎస్ తేజ తదితరులున్నారు

## సమాజోద్ధారకుడు.. సుద్దాల హనుమంతు

- సుద్దాల ఫౌండేషన్ దశాబ్ది సంబురంలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్
- ప్రముఖ సినీనటుడు, దర్శకనిర్మాత నారాయణమూర్తికి 'సుద్దాల' పురస్కారం ప్రదానం

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** సమాజంలోని అవకతవకలను, ప్రజాసమస్యలను ఎత్తి చూపుతూ ఆనాడే ఎన్నో పాటలు రాసి సుద్దాల హనుమంతు సమాజోద్ధారకుడిగా అవతరించారని పర్యాటక, సాంస్కృతి కశాఖల మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. ఆదివారం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞానకేంద్రంలో నిర్వహించిన సుద్దాల ఫౌండేషన్ దశాబ్ది సంబురాల్లో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'సుద్దాల హనుమంతు- జానకమ్మ'ల జాతీయ పురస్కారాన్ని ప్రముఖ సినీనటుడు, దర్శకనిర్మాత ఆర్ నారాయణమూర్తికి ప్రదానంచేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. 1940లలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట కాలంలో సుద్దాల హనుమంతు విప్లవాత్మక రచనలతో తిరుగబడ్డారని గుర్తుచేశారు. హనుమంతు గొప్ప మానవతాశక్తి అని, మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. ఆర్ నారాయణమూర్తి మంచి మేధావి, ఆలోచనాపరుడని, ఈ పురస్కారానికి అర్హుడని చెప్పారు. సుద్దాల అశోక్ తేజ మాట్లాడుతూ.. 'సంతోషాలను మాకిచ్చి.. సంతాపాలను నువ్వు మోసి.. జీవితమంతా నడిచి నడిచి అలసిపోయావా.. నాన్నా..' అనే పాటను పాడి తన తండ్రిపై తనకున్న అభిమానాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో ముందుగా సుద్దాల భారతి ప్రార్థనా గీతాన్ని ఆలపించగా, సుద్దాల అర్జున్ తేజ స్మారకోపన్యాసంచేశారు. సుద్దాల సుధాకర్ తేజ సభకు అధ్యక్షత వహించారు. 'ఆడ కూతురా.. నీకు అడుగడుగున వందనం' అనే పాటను సుద్దాల సాహితి పాడారు. సమావేశంలో సుద్దాల ప్రభాకర్, సీనియర్ జర్నలిస్టు కే రామచంద్రమూర్తి, పోరెడ్డి రంగన్న, ప్రముఖ విలేకరి కోటేశ్ తదితరులు మాట్లాడారు.

## సహస్ర చండీయాగం ప్రారంభం

- వేదమంత్రాలతో మార్మోగిన నారాయణపురం
- పాల్గొన్న మాజీ ఎంపీ పొంగులేటి కుటుంబసభ్యులు



యాగం వద్ద హారతులిస్తున్న మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సోదరుడు ప్రసాదరెడ్డి దంపతులు

**కల్లూరు:** లోకకల్యాణం కోసం ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లా కల్లూరు మండలంలోని నారాయణపురంలో నిర్వహించే సహస్ర చండీ యాగం ఆదివారం వైభవంగా ప్రారంభమైంది. పీఠాధిపతులు, ఋత్వికుల వేదమంత్రాల నడుమ చండీయాగాన్ని ప్రారంభించారు. అనంతరం పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ప్రసాదరెడ్డి దంపతులు యాగంలో కూర్చున్నారు. ఉమ్మడి జిల్లా నుంచి పెద్దఎత్తున తరలివచ్చిన మహిళలు కుంకుమార్చన నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు, జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు, జిల్లాలోని ముఖ్యనాయకులు, అభిమానులు, భక్తులు పెద్దసంఖ్యలో యాగంలో పాల్గొన్నారు.

## హంతకుడి ఆత్మహత్య

### గొంతుకోసుకొని దోమకొండ చెరువులో దూకిన నిందితుడు



బందెల రవి (ఫైల్)

**భిక్కనూరు:** కామారెడ్డి జిల్లా దోమకొండ శివారులో శనివారం ముగ్గురిని హత్యచేసిన బందెల రవి (35) గొంతు కోసుకొని చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం దోమకొండలోని గుండ్ల చెరువులో ఆయన మృతదేహం లభ్యమైంది. పోలీసుల కథనం ప్రకారం.. భిక్కనూరు మండలం జంగంపల్లికి చెందిన బందెల బాలయ్య, బందెల రవి అన్నదమ్ములు. బాలయ్య పెద్ద కుమార్తె ప్రేమ వివాహం చేసుకోగా ఇది జీర్ణించుకోలేకపోయిన రవి శుక్రవారం సాయంత్రం బాలయ్య (45), అన్న రెండో కుమార్తె లత (18), రవి కుమార్తె చందన (8)లను దోమకొండ శివారులో బ్లేడ్‌తో గొంతుకోసి చంపేశాడు. హత్య జరిగిన సమయం నుంచి రవి కోసం కుటుంబ సభ్యులు, పోలీసులు వెతికారు. ఆదివారం ఉదయం గుండ్ల చెరువులో మృతదేహం ఉన్నదని పోలీసులకు సమాచారం అందింది. అక్కడికి చేరుకున్న రవి కుటుంబసభ్యులు మృతదేహాన్ని గుర్తించారు. రవి భార్య భూలక్ష్మి ప్రస్తుతం నిండు గర్భిణి. క్షణికావేశంలో జరిగిన చిన్న తప్పిదానికి ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి చెందడంతో రెండు కుటుంబాలు పెద్దదిక్కును కోల్పోయాయి.









# భద్రతా మండలిలో సంస్కరణలు చేపట్టాలి

- భారత్, సియెర్రా లియోన్ డిమాండ్
- ఇరు దేశాల మధ్య ఆరు ఒప్పందాలు
- ఫ్రీటౌన్‌లో భారత హైకమిషన్ ఏర్పాటు: ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

**సియెర్రా లియోన్ నుంచి నమస్తే తెలంగాణ ప్రత్యేక ప్రతినిధి:** ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో సంస్కరణలు చేపట్టాలని భారత్, సియెర్రా లియోన్ డిమాండ్ చేశాయి. అప్పుడే ప్రపంచంలో మూడింట ఒక వంతు జనాభా నివసిస్తున్న ఆఫ్రికా, భారత్‌కు ఐరాస నిర్ణాయక విభాగాల్లో సరైన ప్రాతినిధ్యం లభిస్తుందని పేర్కొన్నాయి. ఈ మేరకు భారత ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, సియెర్రా లియోన్ అధ్యక్షుడు జులియస్ మాడా బియో సంయుక్త ప్రకటన చేశారు. రెండు ఆఫ్రికా దేశాల పర్యటనలో భాగంగా వెంకయ్య ఆదివారం సియెర్రా రాజధాని ఫ్రీటౌన్‌లో అడుగుపెట్టారు. ఆ దేశంలో పర్యటిస్తున్న తొలి భారత ఉపరాష్ట్రపతి ఆయనే కావడం విశేషం. ఈ సందర్భం గా ఇరుదేశాల మధ్య ఆరు ఒప్పందాలు కుదిరాయి. వ్యవసాయం, ఫుడ్ ప్రాసెసింగ్, సమాచార సాంకేతికత, మౌలిక వసతుల అభివృద్ధిలో పరస్పరం సహకారం పెంపొందించుకోవాలని రెండు దేశాలూ నిర్ణయించాయి. సియెర్రా లియోన్‌లో భారత హైకమిషన్‌ను ఏర్పాటుచేస్తామని ఉపరాష్ట్రపతి ప్రకటించారు. అంతకుముందు ఆయన బియోతో కలిసి ప్రతినిధుల స్థాయి చర్చల్లో పాల్గొన్నారు. భద్రతా మండలి సహా ఇతర అంతర్జాతీయ వేదికలపై సహకారం కొనసాగించాలని నిర్ణయించారు. జమ్ముకశ్మీర్‌ను పునర్వ్యవస్థీకరిస్తూ భారత్ తీసుకున్న నిర్ణయం పూర్తిగా తమ అంతర్గత వ్యవహారమని ఈ సందర్భంగా ఉపరాష్ట్రపతి స్పష్టంచేశారు. ఉగ్రవాద వ్యతిరేక పోరాటంలో మద్దతుగా నిలిచినందుకు సియెర్రా లియోన్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. వివిధ రంగాలకు సంబంధించి సియెర్రా లియోన్‌కు భారత్ 217.5 మిలియన్ డాలర్ల సాయాన్ని అందించిందని చెప్పారు. నీటిపారుదల అభివృద్ధికి మరో 30 మిలియన్ డాలర్లు, తాగునీటి ప్రాజెక్టుకు 15 మిలియన్ డాలర్ల రుణం అందించనున్నట్టు ప్రకటించారు.



సియెర్రా లియోన్ అధ్యక్షుడు జూలియస్ బియోతో ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు కరచాలనం

ఫ్రీటౌన్ నూతన అధ్యక్ష భవన నిర్మాణానికి రుణం అందిస్తామన్నారు. భారత నాయకత్వాన ఏర్పాటైన అంతర్జాతీయ సౌర కూటమిలో సియెర్రా చేరికపై వెంకయ్య సంతోషం వ్యక్తం చేశారు. ఇండియా ఫర్ హ్యూమానిటీ కార్యక్రమంలో భాగంగా సియెర్రాలో 'జైపూర్ ఫుట్' క్యాంప్‌ను నిర్వహిస్తామన్నారు.

# కశ్మీరాన్ని చూసేవారేరి?

- తీవ్ర ఒడిదుడుకుల్లో జమ్ముకశ్మీర్ ఆతిథ్య రంగం
- మునుపటిలా ఆసక్తి చూపని పర్యాటకులు
- ఎప్పుడు ఏం జరుగుతుందోనని సంకోచనాభావమే కారణం
- ప్రభుత్వ ఆంక్షలతో రూ. 1500 కోట్లు నష్టపోయిన రాష్ట్ర పర్యాటకం




ఆంక్షలు ఎత్తివేసినా.. జనసంచారం లేని శ్రీనగర్‌లోని లాల్ చౌక్

**శ్రీనగర్, అక్టోబర్ 13:** ఆర్టికల్ 370ని రద్దు చేసి 70 రోజులు గడిచినప్పటికీ కశ్మీర్‌లో సాధారణ పరిస్థితులు కనిపించడం లేదు. జనజీవనం ఇంకా యథాస్థితికి చేరుకోలేదు. సాధారణంగా ప్రతి ఆదివారం జరిగే మార్కెట్లలో కొనుగోలుదారుల సందడి కనిపించడం లేదు. వర్తకులు, వ్యాపారస్తులు కూడా పెద్ద స్థాయిలో దుకాణాలను ఏర్పాటు చేయలేదు. ప్రజా రవాణా వ్యవస్థ కూడా అంతంత మాత్రంగానే నడుస్తున్నది. కశ్మీర్ పర్యటనపై ఉన్న ఆంక్షలను ప్రభుత్వం ఎత్తేసినప్పటికీ సుందర కశ్మీరాన్ని సందర్శించడానికి పర్యాటకులు మునపటిలా ఆసక్తి కనబర్చడంలేదు. దీంతో జనాలు లేక పర్యాటక పడవలు వెలవెలబోతున్నాయి. టూరిస్టులు లేక హోటళ్లు ఖాళీగా కనిపిస్తున్నాయి. దాదాపు 5 వేల కోట్ల విలువ గల కశ్మీర్ ఆతిథ్య రంగం తీవ్ర ఒడిదుడుకుల్ని ఎదుర్కొంటున్నది.

### తీవ్ర నష్టం

రాష్ట్ర జీడీపీలో పర్యాటక రంగం వాటా ఆరు శాతమని, ప్రభుత్వం విధించిన ఆంక్షలతో దాదాపు రూ. 1500 కోట్లు నష్టపోయామని కశ్మీర్ పర్యాటక శాఖలో పనిచేస్తున్న ఓ ఉన్నతాధికారి పేర్కొన్నారు. 'ఈ సంవత్సరం జూన్-జూలైలో 3,17,284 మంది కశ్మీర్ పర్యటనకు వచ్చారు. అయితే, ప్రభుత్వం ఆంక్షలు విధించాక.. ఆగస్టు-సెప్టెంబర్‌లో కేవలం 14,692 మంది మాత్రమే కశ్మీర్‌ని సందర్శించారు. దాదాపు 96 శాతం మంది పర్యాటకులు తగ్గిపోయారు. గురువారం ప్రభుత్వం ఆంక్షలు సడలించిన తర్వాత.. ఇప్పటివరకూ 1500 మంది పర్యాటకులు మాత్రమే వచ్చారు' అని ఆయన తెలిపారు. ఎప్పుడు ఏం జరుగుతుందోనన్న మీమాంస పర్యాటకుల్లో ఉండటంతోనే వాళ్లు కశ్మీర్‌కు రావడానికి సంకోచిస్తున్నారని ఆయన అన్నారు. కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే ఆర్టికల్ 370ను ఆగస్టు 5న కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిన విషయం తెలిసిందే.



పర్యాటకులు లేక బోసిపోతున్న దాల్ సరస్సు

### నిర్జన సరస్సుగా 'దాల్ లేక్'

సుందర కశ్మీరంలో దాల్ సరస్సులో విహారం ఎంతో ప్రత్యేకమైనది. ప్రభుత్వం విధించిన ఆంక్షలతో గత కొంత కాలంగా ఈ సరస్సు పర్యాటకులు లేక నిర్జనంగా కనిపిస్తున్నది. సరస్సుపై ఆధారపడి శిఖార పడవలు నడుపుకునే ఎంతో మంది తమ ఆదాయాన్ని కోల్పోతున్నారు. దాదాపు 900 హౌజ్ బోట్లు, 1300 హోటళ్లు, 650 శిఖార పడవలు పర్యాటకుల కోసం ఎదురు చూస్తున్నాయి. పర్యాటకంపై ఆధారపడి నడుస్తున్న పలు వర్తక, వ్యాపారాలు, వాహనాల డ్రైవర్లు, కశ్మీర్ ఆర్ట్స్, క్రాఫ్ట్స్, చేతి వృత్తులపైనా ప్రభావం పడింది.




నమస్తే తెలంగాణ
జిందగీ
సోమవారం 14 అక్టోబర్ 2019 WWW. NTNEWS.COM /nt.zindagi




**ఆమెకు చిన్నతనంలోనే పెండ్లయ్యింది. ఇరవై రెండేండ్ల వయసు వచ్చేసరికి ఇద్దరు పిల్లల తల్లి అయింది. భర్త చిన్నపాటి వ్యాపారం చేసేవాడు. ఆమె కూడా భర్తకు చేదోడు వాదోడుగా చిన్న ఉద్యోగాలు చేసింది. తగినంత సంపాదన లేక పోయినా జీవితం సాఫీగానే సాగుతున్నది. కానీ అన్ని అనుకున్నట్లు జరిగితే అది జీవితం అనిపించుకోదుకదా. చిన్న వయసులోనే కూతురు బోన్‌క్యాన్సర్‌తో మరణించింది. దాని నుంచి కోలుకునేలోగా భర్త లివర్ క్యాన్సర్‌తో చనిపోయాడు. ఇక తను బతకడం వ్యర్థమని ఆత్మహత్య చేసుకుందామనుకునే సమయంలో కొడుకు గుర్తుకు వచ్చాడు. అన్నీ పోగొట్టుకున్న చోట ఉండలేక పుట్టిల్లు చేరింది. అక్కడే ఆమె జీవితం మలుపు తిరిగింది. తేనెటీగల పెంపకం వ్యాపారాన్ని కుటీర పరిశ్రమగా ఎంచుకుని విజయం సాధించింది. ఇప్పుడు కోట్ల రూపాయల టర్నోవర్‌తో విజయాల్ని అందుకుంటున్న జోసెఫిన్ సెల్వరాజ్ సక్సెస్‌మంత్ర.**

# జీవితాన్ని గెలిచిన తేనెటీగల వ్యాపారి
# జోసెఫిన్ సెల్వరాజ్

### అవార్డులు

జోసెఫిన్ వ్యాపారంలో సాధించిన విజయాలకు పలు అవార్డులు లభించాయి. 2012లో 20వ ఐఎంసి లేడీస్ వింగ్‌లో జోసెఫిన్ శ్రమకు గుర్తింపుగా జానకీదేవి బజాజ్ పురస్కారం దక్కింది. 2010లో తమిళనాడు ప్రభుత్వం ఉత్తమ వ్యవసాయ పద్ధతుల అవార్డును అందజేసింది. ఇప్పటివరకు ఆ అవార్డును గెలుచుకున్న ఏకైక మహిళ ఆమె. ఇలాంటి అవార్డులు ఆమె ఎన్నో అందుకున్నారు.

జోసెఫిన్ పుట్టి పెరిగింది తమిళనాడులోని శివగంగై జిల్లా ముత్తుపట్టి అనే చిన్న గ్రామం. చిన్న వయసులోనే మదురైకి చెందిన సెల్వరాజ్ అనే చిన్న వ్యాపారితో వివాహం అయ్యింది. పెళ్లి నాటికి ఇంటర్ వరకే చదివిన ఆమె భర్త ప్రోత్సాహంతో డిగ్రీ చేసింది. అప్పటికే ఇద్దరు బిడ్డల తల్లి. సెల్వరాజ్ నెల సంపాదన ఖర్చులకు సరిపోయేది కాదు. దీంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనేది ఆ కుటుంబం. వాటిని అధిగమించడానికి చిన్న చిన్న ఉద్యోగాలు చేసింది జోసెఫిన్.

### కష్టాలు చుట్టుముట్టి..

ఇబ్బందులు ఉన్నప్పటికీ ఉన్నదాంట్లో సాఫీగా సాగిపోతున్నది వారి జీవితం. ఉన్నంతలోనే పాప ప్రభను, బాబు విజరును మంచి స్కూల్‌లో జాయిన్ చేశారు. ఒకరోజు పాప ఉన్నట్లుండి తీవ్ర అనారోగ్యానికి గురైంది. అప్పటికి అమెకు ఎనిమిదేళ్లు. వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ వివిధ పరీక్షలు చేసి పాపకు 'బోన్ క్యాన్సర్' అని నిర్ధారించారు. ఒక్కసారిగా జోసెఫిన్ కుప్పకూలిపోయింది. ఎలాగైనా తన కూతురును రక్షించుకోవాలని తన నగలన్నీ అమ్మేసింది. సరిపోక మరో మూడు లక్షలు అప్పు కూడా చేసింది. కానీ పాప బతకలేదు. ఒకవైపు పాపను కోల్పోయి, పుట్టెడు దుఃఖంలో ఉన్న సమయంలోనే మరో భయంకర వార్త వినాల్సి వచ్చింది. ఆమె భర్తకు లివర్ క్యాన్సర్ రావడం. ఎక్కువ కాలం బతికే అవకాశాలు లేవని డాక్టర్లు తేల్చేశారు. అప్పటికే బిడ్డను పోగొట్టుకున్న ఆమె భర్తను ఎలాగైనా కాపాడుకోవాలనుకుంది. తెలిసిన వాళ్లందరి దగ్గరా మరలా అప్పులు చేసింది. అయినా ఆయనను దక్కించుకోలేకపోయింది. ఒకరి తర్వాత ఒకరు ఇద్దర్నీ కోల్పోయిన జోసెఫిన్ ఇక తను ఎవరికోసం బతకాలి అని తీవ్ర వైరాగ్యంలోకి వెళ్లిపోయింది. ఒక దశలో ఆత్మహత్య చేసుకుందామని కూడా అనుకుంది. కానీ బాబు విజరు భవిష్యత్తు గుర్తుకొచ్చింది. చిన్నవయసులోనే వాడిని ఒంటరిని చేయడం ఇష్టం లేక ఈ కష్టాలేవీ తెలియకుండా వాడిని పెంచాలనుకుంది. అక్కడే ఉంటే మానసికంగా మరింత పతనమవుతానని గ్రహించి పుట్టింటికి చేరింది.

### బ్యాంక్ రుణంతో..

తేనెటీగల పెంపకం ఊపందుకోవడంతో దాన్ని మరింత విస్తరించాలనుకుంది జోసెఫిన్. దానికోసం స్థానికంగా ఉన్న కెనరా బ్యాంకును రుణం అడిగింది. తొలుత వారు నిరాకరించారు. చివరకు 2010లో పది లక్షల రుణం ఇచ్చారు. దానితో ఆమె తన వ్యాపారాన్ని విస్తరించారు. దేశవ్యాప్తంగా తేనెను సరఫరా చేసేలా ఎదిగారు. జోసెఫిన్ రోజులో 20 గంటలు తేనెటీగల సాగులోనే గడుపుతారు. ఆమె పనిచేయడమే కాదు తన బృందంతోనూ పని చేయించగల సమర్థురాలు. ప్రతిరోజూ రాత్రి 250 తేనెటీగల బాక్సులను రవాణా చేయాల్సి ఉంటుంది. అవి నిద్రపోతున్న సమయంలోనే వాటిని మార్చాలి. మేల్కొని ఉన్నప్పుడు రవాణా చేయడం కత్తిమీద సామే. ప్రస్తుతం ఆమె ఐదొందల మందికి ఉపాధిని కల్పిస్తున్నది. తన సంస్థ ద్వారా నేరేడు, వేప, ఉసిరిలాంటి భిన్న రుచులతో ఉన్న 33 రకాల తేనెను అందిస్తుంది. అంతేకాదు యాలకులు, ఇలాచి, కాఫీ, చాక్లెట్, గ్రీన్ టీ లాంటి రకరకాల రుచులనూ సరఫరా చేస్తున్నారు. ప్రస్తుతం నెలకు లక్షకు పైగానే ఆదాయం మిగులుతుంది. సంవత్సరానికి మూడు కోట్ల రూపాయలపైనే టర్నోవర్ జరుగుతుంది. ఒకప్పుడు అద్దె ఇంట్లో ఉండే జోసెఫిన్ ఇప్పుడు సొంతంగా మూడంతస్థుల భవనాన్ని నిర్మించారు. ఆ భవనం కింది ఫ్లోర్‌లో రకరకాల తేనెలను అమ్మే షాపు నడుపుతున్నారు. నాణ్యమైన తేనెను పండిస్తారు కాబట్టే వారి దగ్గర పది గ్రాముల తేనె వెయ్యి రూపాయలు పలుకుతుంది. నేడు మన దేశంలోని ప్రముఖ కాస్మొటాలజిస్టులు వీరి తేనెనే వాడుతున్నారు.





### దిశ మార్చిన లైబ్రరీ

ముత్తుపట్టికి వెళ్లిన తర్వాత తన మానసిక స్థితినుంచి బయటకు రావడానికి రోజూ స్థానికంగా ఉన్న లైబ్రరీకి వెళ్లేది. అక్కడ అన్ని రకాల పత్రికలు, పుస్తకాలు చదువుతూ కాలం గడిపేది. ఒకరోజు పేపర్‌లో మదురైలోని కృషి విజ్ఞాన కేంద్రంలో (కెవికె) తేనెటీగల సాగుపై మూడు రోజులు ఉచిత శిక్షణా శిబిరం ఏర్పాటు చేశారనే ప్రకటన చూసింది. ఆ విషయాన్నే వారి తండ్రికి చెప్పగా, అలాగైనా మనసు ఇతర వ్యాపకాల వైపు మల్లుతుందని ఆమెను వెళ్లడానికి అనుమతిచ్చారు. అలా శిక్షణ తీసుకున్న తర్వాత స్వంతంగా తేనెటీగల పెంపకం చేపట్టాలని నిర్ణయించుకుంది. ఆమెకు కుటుంబం అండగా నిలబడింది. వ్యాపారం పెట్టుకోవడానికి వారే సహాయం చేశారు. తమకున్న భూమిలో మొదట ఐదువేల పెట్టుబడితో పది తేనెటీగల పెట్టెలను కొని, 2006లో 'వి బిస్ నేచురల్ బీ ఫామ్'ను ప్రారంభించింది. మొదటి పంట ఎనిమిది కిలోల తేనెను అందించింది. మూడు వారాల్లోనే మూడు వేలు లాభం వచ్చింది. అంతే! అప్పటి నుంచి ఆమె వెనుతిరిగి చూసుకోవలసిన అవసరం రాలేదు. నేషనల్ హార్టీకల్చర్ మిషన్ ఆధ్వర్యంలో దుండిగల్, రామంతపురం, శివగంగ తదితర ప్రాంతాలకు తేనె సరఫరా చేస్తున్నది.

### శిక్షణ నిస్తూ...

నిజానికి జోసెఫిన్ వ్యాపారం చేయాలనే ఆశతో కంపెనీని మొదలు పెట్టలేదు. మనిషి జీవితంలో అవసరమైన కనీస అవసరాలను తీర్చుకోవడానికే వ్యాపారవేత్తగా మారాడు. మూడుపూటలా భోజనం కోసం మనిషి తపన పడకూడదనేది ఆమె ఉద్దేశం. అందుకోసం ప్రతి ఒక్కరికీ తనకు తెలిసిన తేనెటీగల సాగు గురించి అవగాహన పెంచాలని అనుకున్నారు. ప్రతి నెలా రెండు, నాలుగో శనివారాల్లో తన భవన మూడో అంతస్థులో తేనెటీగల పెంపకంపై ఉచిత శిక్షణతో పాటు భోజనాలూ ఏర్పాటు చేస్తారు. ఇంకా ప్రతి రోజూ పాఠశాలలు, కళాశాలలు, గృహిణులకూ అవగాహన కల్పించడం తన దినచర్యలో ఒక భాగం. ఇప్పటివరకు ఆమె దగ్గర 50 వేల మందికి పైగా శిక్షణ తీసుకోగా, వారిలో 140 మంది గృహిణులు. 420 మందికి పైగానే సొంతంగా తేనెటీగల పెంపకాన్ని చేపట్టారు. మధురై జైలులోని ఖైదీలకూ శిక్షణ ఇచ్చారు. అక్కడ పదుల సంఖ్యలో ఖైదీలు సొంతంగా తేనెటీగల పంటను పండిస్తున్నారు. జోసెఫిన్ కోరుకున్నట్లు కొడుకు విజరును చెన్నైలో మెడిసిన్ చదివిస్తున్నారు.

### తల్లికి పెళ్లి చేసిన కొడుకు

చిన్న వయసులోనే భర్తను కోల్పోయిన తన తల్లి విషయంలో విజరు ఒక గొప్ప నిర్ణయాన్ని తీసుకున్నాడు. బతికున్నన్ని రోజులు ఆమె జీవితం అడవికాచిన వెన్నెల కాకూడదనుకున్నాడు. అందుకే ఆమెకు మళ్లీ పెళ్లి చేసి తల్లి రుణం తీర్చుకున్నాడు. 'అమ్మ ఆత్మవిశ్వాసంతో జీవితంలో ముందుకు సాగిన తీరు ఎందరికో స్ఫూర్తినిస్తుంది. మధ్యలో ఆగిపోయిన ఆమె వైవాహిక జీవితాన్ని మళ్లీ మొదలు పెట్టాలని కోరుకున్నా. ఎట్టకేలకు ద్వితీయ వివాహానికి ఒప్పించగలిగా. సుకుమారన్‌తో అమ్మ వివాహం జరిగింది. ప్రస్తుతం ఆయనకు అమ్మ అంటే చాలా ఇష్టం. అమ్మకు వ్యాపారంలో చేదోడు వాదోడుగా ఉంటున్నారు. ఆమె కోల్పోయిన జీవితం తిరిగి దక్కిందని సంతోషంగా ఉంది. నాకు బాగా గుర్తు.. చిన్నప్పుడు అమ్మ అర్ధరాత్రి పొలం నుంచి ఇంటికి వచ్చేది. ఎందుకంటే తేనెటీగల పరాగసంపర్కం రాత్రి ఏడు గంటల తరువాత మాత్రమే జరుగుతుంది. రోజూ రాత్రులు మూడు గంటల పని తప్పనిసరిగా ఉంటుంది. రాత్రి పని ముగించుకుని, ఇంటికి వచ్చేసరికి ఆ సమయం అయ్యేది. ఇదేమీ తెలియని ఇరుగుపొరుగు ఆమె గురించి తప్పుగా మాట్లాడుకునేవారు. ఇలా ఎన్నో అవమానాలను అమ్మ నా కోసం భరించింది.' అని వివరించాడు విజరు.

## విలేజ్ స్టోరీతో దీపావళి!

**దీపావళి పండుగ వస్తున్నది. పండుగకు కావాల్సిన దీపాలు, స్వీట్లు, స్నాక్స్‌ను కొనుగోలు చేయడం మానేయండి. స్వతహాగా మీరే తయారు చేసుకోండి. నేర్పించేందుకు వర్క్‌షాప్ కూడా నిర్వహిస్తున్నారు. స్నాక్స్, స్వీట్లతో ఆరోగ్యకరమైన దీపావళి జరుపుకొనేందుకు ఈ వర్క్‌షాప్‌కు వెళ్లండి.**



దీపావళి అనగానే దీపాలు, పటాకులు, స్వీట్లే గుర్తొస్తాయి. వాటిని కొనుగోలు చేసి పండుగ జరుపుతాం. ఈ ఏడాది కూడా అదే ముచ్చట అయితే ఏం బాగుంటుంది? కొంచెం కొత్తగా ప్రయత్నించండి. బెంగళూర్‌లోని 'విలేజ్ స్టోరీ' వర్క్‌షాపులో పాల్గొనండి. అక్కడ దీపాలు, స్నాక్స్, స్వీట్ల తయరీ విధానాన్ని నేర్పిస్తున్నారు. బెంగళూరు దగ్గరలోని ఓ గ్రామంలోని పొలంలో రోజంతా వర్క్‌షాప్ జరుగుతుంది. మొదటి గంటలో గ్రామంలోని చిన్న తరహా పరిశ్రమలను సందర్శిస్తారు. 2017 నుంచి విలేజ్ స్టోరీతో సంబంధం ఉన్న రేఖాచావ్లా మూంగ్ హల్వా, కేజర్ పెడా, గుజియా స్వీట్ల తయారీపై శిక్షణ ఇస్తున్నారు. 2002లో బెంగళూరులోని టెర్రా బార్న్‌ను స్థాపించిన టెర్రకోట శిల్పకారిణి పూర్ణిమ గ్రామీణ కర్ణాటక మహిళలను తన విభాగంలో తీసుకొని టెర్రాకోటా ఆభరణాలను తయారు చేయడానికి టెర్రా బార్న్‌లో శిక్షణ ఇస్తుంది. అలాగే దీపాలు, వంటల తయారీ విధానాలనూ వివరిస్తుంది. విలేజ్‌స్టోరీ వ్యవస్థాపకురాలు అనామిక బిస్ట్. 'మార్కెట్లో కొనుగోలు చేయడం తప్ప దీపాలు, ఇతర వస్తువులు ఎలా తయారవుతున్నాయో చాలా తక్కువ మందికే తెలుసు. ఈ గ్రామాల్లో సందర్శించడం వల్ల చీరలు నేసే వారి నుంచి అరటి చిప్స్ తయారు చేసేవరకు తెలుస్తుంది. గ్రామస్తులతో సంభాషించే అవకాశం దక్కినందుకు ఆనందంగా ఉందంటుంది' అనామిక. ఈ పండుగ సందర్భంగా మంచి పని చేయాలనుకుంటే గ్రామీణ పిల్లలకు పాతబట్టలు, పుస్తకాలు, బొమ్మలను విరాళంగా ఇవ్వమని అనామిక కోరుతున్నది.

### వంటింటి చిట్కాలు



- వెల్లుల్లిపాయలను కొద్దిగా చిదిమి గాజు సీసాలో వేసి అందులో ఒక కప్పు నూనె పోసి ఫ్రిజ్‌లో నిల్వ ఉంచితే అవసరమైనప్పుడు వాడుకోవచ్చు.
- ఆలూ వారం రోజులపాటు నిల్వ ఉంచి తే వాటికి మొలకలు వచ్చేస్తాయి. అలా రాకుండా ఉండాలంటే ఆలూతోపాటు ఆపిల్‌ను ఉంచితే సరి.
- పుట్టగొడుగులపై ఉన్న మట్టి వదిలించడం అంత సులభం కాదు. ఏదైనా పిండి తీసుకొని పుట్టగొడుగులపై చల్లి ఆ తర్వాత వాటిపై నీటిని పోస్తూ గట్టిగా రుద్దితే మట్టి పూర్తిగా పోయి శుభ్రంగా తయారవుతాయి.
- పచ్చిమిరపకాయలను వేడినీటిలో కాసేపు ఉంచి ఆ తర్వాత ఎండలో ఎండబెడితే.. కాయల రంగు మారినా కారం బాగా తగ్గిపోతుంది.

## జంతువులు ఆరోగ్యాన్నిస్తాయి!

**కుక్క అంటేనే విశ్వాసం గల జంతువు. దాన్ని అలా నిమురుతుంటే ఒత్తిడి మాయం అవుతుందని చాలామంది అంటుంటారు. ముఖ్యంగా ఆఫీస్ ఒత్తిడిని అధిగమించడానికి ఇంట్లోని పెంపుడు జంతువు ఉపయోగపడుతుందని అధ్యయనాలు కూడా చెబుతున్నాయి. అయితే పెంపుడు జంతువులు లేనివారు సమస్యలను అధిగమించడానికి 'ఎనిమల్ ఏంజిల్స్'కు వెళ్లాల్సిందే..**





పెంపుడు జంతువులతో చాలా ఉపయోగాలున్నాయి. అవి ఇంటికి కాపలా మాత్రమే కాకుండా తోడుగా కూడా ఉంటాయి. అంతేకాదు వీటితో కొంత సమయం గడిపితే చాలు డిప్రెషన్‌ను అధిగమించవచ్చునని అంటున్నది 'ఎనిమల్ ఏంజిల్స్' ఫౌండర్ మినాల్ కవిశ్వార్. ఇది మానవ-పెంపుడు జంతువుల పరస్పర చర్యల ప్రయోజనాలను ప్రోత్సహించడానికి భారతదేశంలో మాత్రమే నమోదు అయిన ఎన్‌జీఓ. ఈ సంస్థ పుణేలో ఉంది. ఇక్కడ కుక్కలు, చేపలు, కుందేళ్ళు ఉంటాయి. వీటితో ఒత్తిడి తగ్గించేందుకు పుణేలో వర్క్‌షాప్ నిర్వహిస్తున్నది మినాల్. డిప్రెషన్, ఆందోళన, అధిక రక్తపోటు, కండరాల, ఒత్తిడి, ఎముకల నొప్పితో బాధపడుతున్న ఎవరైనా వర్క్‌షాప్‌లో పాల్గొనవచ్చు. ఎనిమల్ అసిస్టెడ్ థెరపీ(ఏఏటీ) ప్రయోజనాలను పరిశోధించిన తర్వాత 2003లో కవిశ్వర్ ఈ సంస్థను ప్రారంభించింది. అంగవైకల్యం ఉన్న పిల్లలు, సెరిబ్రల్ పాల్సీతో బాధపడేవారు ఏఏటీ అసాధారణ చికిత్సల ద్వారా ప్రయోజనం పొందుతున్నారని అంటున్నది. కుక్కలను పెంచుకోవడానికి చాలామంది ఇష్టపడరు. అలాంటివారు కుందేళ్లను ఎంపిక చేసుకోవచ్చు. పెంపుడు జంతువులపై ఉన్న అపోహలన్నింటినీ తొలిగించి వర్క్‌షాప్‌కు రావాలంటున్నది. కొంతమంది వలంటీర్లు మానవ-జంతువుల మధ్య ఉన్న సంబంధాన్ని ఇక్కడ వివరిస్తారు. మొదటి భాగంలో కుందేళ్లు, చేపలను పరిచయం చేస్తారు. బ్రేక్ తర్వాత థెరపీ కుక్కలను పరిచయం చేస్తామంటున్నది కవిశ్వర్.



**కొన్ని ఇండ్లల్లో త్వరగా గ్యాస్ అయిపోతుంటుంది. ఎక్కువగా వాడనేలేదు. ఎందుకు ఇంత త్వరగా అయిపోయిందని బాధపడుతుంటారు. కానీ వాళ్లు తెలియక చేసే చిన్న చిన్న తప్పులే గ్యాస్ వృథాకు కారణమవుతాయి. ఈ చిన్న చిట్కాలు పాటిస్తే గ్యాస్‌ను ఒకింత ఆదా చేసుకోవచ్చు.**

## వంటగ్యాస్‌ను ఆదా చేసుకోవచ్చిలా..

- పొయ్యి వెలిగించే ముందు వంటకు కావాల్సిన సామగ్రిని తీసి పెట్టుకోవాలి. వీలైనంత వరకు చిన్న బర్నల్‌పై వంట చేయడం మంచిది. పెద్ద బర్నల్‌పై వండితే గ్యాస్ ఎక్కువ వృథా అవుతుంది.
- వంట చేస్తున్నప్పుడు గిన్నెలపై మూత పెడితే త్వరగా ఉడుకుతాయి. గ్యాస్ ఆదా అవుతుంది. ఫ్రిజ్‌లోంచి తీసిన పదార్థాలను వెంటనే వేడి చేయకూడదు. కనీసం అరగంట పాటు బయట ఉంచితే అవి మామూలు ఉష్ణోగ్రతకు వస్తాయి. ఆ తర్వాత గ్యాస్‌పై పెడితే త్వరగా వేడి అవుతాయి.
- పప్పు దినుసులు, బియ్యం వంటకు అరగంట ముందే నానబెట్టుకుంటే త్వరగా ఉడుకుతాయి. వండే పాత్రలు వెడల్పుగా ఉంటే మంచిది. గిన్నె కంటే ఎక్కువ వెడల్పుగా ఉండేట్లు మంట పెడితే గ్యాస్ వృథా అవుతుంది. ప్రతి రోజు గ్యాస్ బర్నల్‌ను శుభ్రం చేయాలి. బర్నల్ రంధ్రాల్లో మురికి నిలవడం వల్ల కూడా గ్యాస్ వృథా అవుతుంది.
- గ్యాస్ పైపును ఏడాదికోసారి మార్చాలి. చిన్న రంధ్రం ఉన్నా గ్యాస్ వృథా అవుతుంది. గాలి వీచే ప్రాంతాల్లో గ్యాస్ పెట్టి వంట చేయకూడదు. వంట పూర్తయ్యేవరకు పొయ్యి దగ్గరే ఉండడం మంచిది. బర్నర్‌పై పాలు, టీ, కాఫీ లాంటివి పడకుండా చూసుకోవాలి.
- గ్యాస్ సిలిండర్, స్టవ్, పైపుల్ని నెలకు ఒకసారి పరీక్షించాలి. సిలిండర్ కంటే కొంచెం ఎత్తులో పొయ్యిని ఏర్పాటు చేసుకోవాలి. కొత్త సిలిండర్ తీసుకున్నప్పుడు సిలిండర్ లీక్ అవుతుందా అనేది చెక్ చేయించాలి.

## ఆపరేషన్‌కి ప్రత్యామ్నాయం ఉన్నదా?

### అడుగండి చెబుతా



**మా అమ్మ వయసు 82 సంవత్సరాలు. గుండె రక్తనాళాల్లో అడ్డంకులు ఉన్నాయని మూడు స్టెంట్‌లు వేశారు. ఇప్పుడు ఆయాసం బాగా వస్తున్నది. పడుకోలేక పోతున్నది. డాక్టర్‌కి చూపిస్తే గుండె పంపింగ్ తగ్గిందన్నారు. కవాటంలో సమస్య ఉందన్నారు. దీనికి సర్జరీ చేయాలన్నారు. అయితే సర్జరీ తర్వాత పెరాలిసిస్ వచ్చే రిస్కు ఉందంటున్నారు. సర్జరీ చేయించుకోకుండా వేరే చికిత్సా మార్గం ఏమైనా ఉందా?**

**- వసుమతి, ఖమ్మం**

కవాటంలో సమస్య తీవ్రంగా ఉన్నప్పుడు దాన్ని మార్చి కొత్త కవాటం వేయడం ఒకటే మార్గం. ఇంతకుముందైతే దీనికి ఛాతి ఓపెన్ చేసి సర్జరీ చేయాల్సిన అవసరం ఉండేది. కాని ఇప్పుడు మీరు బెంగపడవలసిన అవసరం లేదు. సర్జరీ చేయడం కష్టం అయిన వాళ్లకోసమే కొత్త చికిత్స అందుబాటులోకి వచ్చింది. మీ అమ్మగారికి అయోర్టిక్ కవాటంలో సమస్య ఉంది కాబట్టి ట్రాన్స్ అయోర్టిక్ వాల్వ్ రీప్లేస్‌మెంట్ చికిత్స ద్వారా కొత్త కవాటాన్ని అమర్చవచ్చు. కాలి రక్తనాళం గుండా స్టెంట్ వేసినట్టుగానే కవాటాన్ని కూడా పంపిస్తారు. దీనికి కోత ఉండదు. చిన్న రంధ్రం చాలు. రక్తస్రావం ఉండదు. ఓపెన్ సర్జరీ ద్వారా అయితే కోలుకోవడానికి కొన్ని వారాల సమయం పడుతుంది. సర్జరీ తరువాత ఐసియులో ఉంచాల్సిన పరిస్థితి కూడా ఉండేది. ఆపరేషన్ తరువాత యాంటి థ్రాంబోలైటిక్ మెడిసిన్స్ వాడాల్సి వస్తుంది కాబట్టి రక్తస్రావం అయ్యేందుకు ఆస్కారం ఉంటుంది. అందువల్ల రెగ్యులర్‌గా మానిటర్ చేయాల్సి వస్తుంది. కాని ఈ ప్రొసీజర్ చేయించుకుంటే అలాంటి ఇబ్బందులేమీ ఉండవు. అయితే కవాటం సైజు సరిగ్గా ఉండాలి. సైజు చిన్నదైతే రక్తం లీక్ కావొచ్చు. సైజు పెద్దదైతే అయోర్టా చిరిగిపోవచ్చు. అందువల్ల నిపుణులైన, ఈ ప్రొసీజర్ చేయడంలో అనుభవం ఉన్న కార్డియాలజిస్టులను ఎంచుకోవాలి.

**డాక్టర్**
**ఎ. శ్రీనివాస్ కుమార్**
డైరెక్టర్, కార్డియాలజీ అండ్ క్లినికల్ రీసెర్చ్
అపోలో హాస్పిటల్స్
హైదరాబాద్



II.
నమస్తే తెలంగాణ
నిపుణ
[ కరీంనగర్ ]
సోమవారం 14 అక్టోబర్ 2019



# కష్టే ఫలి.. సీఏ ఇంటర్

**సీఏ కోర్సులో 3 దశలు ఉంటాయన్న విషయం అందరికీ విదితమే. సీఏలోని మొదటి దశ అయిన సీఏ ఫౌండేషన్ పూర్తి చేసినవారు డిగ్రీ నుంచి నేరుగా సీఏకి వచ్చే విద్యార్థులు సీఏలో రెండో దశ అయిన సీఏ ఇంటర్ పరీక్ష రాయడానికి అర్హులు. సీఏ ఫౌండేషన్, డిగ్రీ పూర్తిచేసినవారు సీఏ ఇంటర్ కోర్సుకు నమోదు చేసుకొని కోచింగ్ తీసుకుని పరీక్షలకు సన్నద్ధమవ్వాలి. సీఏలోని అన్ని దశల్లోనూ సీఏ ఇంటర్ దశ కీలకమని చెప్పాలి. సీఏ ఇంటర్ పూర్తిచేసినా మంచి ఉద్యోగాలు లభించే అవకాశముంది. కాబట్టి ఈ దశలో విద్యార్థులు అనవసర విషయాలకు తావివ్వకుండా ఒక నిర్దిష్ట ప్రణాళిక ప్రకారం శ్రమిస్తే తప్పక విజయం సాధించవచ్చు.**

- మరికొద్ది రోజుల్లో సీఏ ఇంటర్ పరీక్షలు జరుగబోతున్నాయి. ఈ సమయంలో విద్యార్థులు పరీక్షలకు ఎలా సన్నద్ధం కావాలి, ఏ సబ్జెక్టులో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, ఏ అంశాన్ని ఎలా పునశ్చరణ చేయాలి, పరీక్ష సమయంలో ఎలాంటి మెళకువలు పాటించాలి వంటి అంశాలపై ప్రత్యేక ఫోకస్.

**సీఏ ఇంటర్–2019 పరీక్షల టైమ్ టేబుల్**

| తేదీ | పేపర్ | సబ్జెక్టులు | మార్కులు | వ్యవధి |
|---|---|---|---|---|
| గ్రూప్–1 | | | | |
| Nov 2 | పేపర్–1 | అకౌంటింగ్ | 100 | 3 గం. |
| Nov 4 | పేపర్–2 | కార్పొరేట్ లాస్ (60M)<br>అదర్ లాస్ (40M) | 100 | 3 గం. |
| Nov 6 | పేపర్–3 | కాస్ట్ అండ్ మేనేజ్‌మెంట్ అకౌంటింగ్ | 100 | 3 గం. |
| Nov 8 | పేపర్–4 | ట్యాక్సేషన్ ఇన్‌కమ్ ట్యాక్స్ (60M)<br>ఇన్‌డైరెక్ట్ ట్యాక్సెస్ (40M) | 100 | 3 గం. |
| గ్రూప్–2 | | | | |
| Nov 11 | పేపర్–5 | అడ్వాన్స్‌డ్ అకౌంటింగ్ | 100 | 3 గం. |
| Nov 14 | పేపర్–6 | ఆడిటింగ్ అండ్ అస్యూరెన్స్ | 100 | 3 గం. |
| Nov 16 | పేపర్–7 | ఎంటర్‌ప్రైజ్ ఇన్ఫర్మేషన్ సిస్టం (50M)<br>స్ట్రాటజిక్ మేనేజ్‌మెంట్ (50M) | 100 | 3 గం. |
| Nov 18 | పేపర్–8 | ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ (60M)<br>ఎకనామిక్స్ ఫర్ ఫైనాన్స్ (40M) | 100 | 3 గం. |

## సబ్జెక్టులు- జాగ్రత్తలు

### పేపర్– 1

- అకౌంటింగ్ (100 మార్కులు)
- అకౌంటింగ్ స్టాండర్డ్స్‌కి పరీక్షల్లో వెయిటేజీ బాగా ఉంటున్నందున అకౌంటింగ్ స్టాండర్డ్స్‌కి ప్రాముఖ్యం ఇవాలి.
- చిన్న చాప్టర్లను కూడా వదలకుండా ప్రాక్టీస్ చేయాలి. పరీక్షల్లో చిన్న, పెద్ద తారతమ్యాలు లేకుండా ప్రశ్నలు అడుగుతారు.
- థియరీ చాప్టర్లను కూడా తప్పక చదవాలి

**గమనిక:** పేపర్ 2–కార్పొరేట్ లాస్, అదర్ లాస్, పేపర్–4 ట్యాక్సేషన్, పేపర్–6 ఆడిటింగ్ అండ్ అస్యూరెన్స్, పేపర్ 7 ఎంటర్‌ప్రైజ్ ఇన్‌ఫర్మేషన్ సిస్టమ్స్, స్ట్రాటజిక్ మేనేజ్‌మెంట్ పేపర్లలో 30 శాతం మార్కులు ఆబ్జెక్టివ్ ప్రశ్నల (MCQS) నుంచి వస్తాయి. ఈ ఆబ్జెక్టివ్ పరీక్షల్లో వేరుగా ప్రశ్నపత్రం, ఓఎంఆర్ షీట్ ఇస్తారు. పరీక్ష ముగిసిన తర్వాత విద్యార్థులు వాటిని ఎగ్జామినర్‌కు ఇవ్వాలి.

- పరీక్ష సన్నద్ధత దశలో వేర్వేరు టెక్ట్స్‌బుక్స్ చదవకుండా, ప్రాక్టీస్ చేయకుండా ఉంటేనే మంచిది. మీరు ముందు నుంచి ఏ బుక్, ఏ మెటీరియల్ అనుసరిస్తున్నారో అదే ప్రాక్టీస్ చేస్తే మంచిది.
- ప్రతి చాప్టర్‌లో ఒక బేసిక్ ప్రాబ్లమ్ ఎంచుకుని ప్రాక్టీస్ చేయాలి. మిగతా ప్రాబ్లమ్స్‌లోని ముఖ్యమైన అంశాలను (కీ అడ్జస్ట్‌మెంట్స్) హైలైట్ చేసుకోవాలి. ఇది రివిజన్‌కి బాగా ఉపయోగపడుతుంది.
- ప్రతి టాపిక్ ప్రిపేరవుతున్నప్పుడు కాన్సెప్టుకే ప్రాధాన్యం ఇవ్వాలి.
- పరీక్ష రాసే సమయంలో అన్ని ప్రశ్నలకు సమాధానం రాయడానికి సమయం సరిపోకపోవచ్చు. కాబట్టి వీలైనంత వేగంగా పరీక్ష రాస్తే మంచిది.
- RTP, MTPలు చదవాలి.
- Partnership accounts, accounts from incomplete Records, Branch Accounts వంటి చాప్టర్లపై ప్రత్యేకంగా దృష్టిసారించాలి.

### పేపర్– 2

- కార్పొరేట్ లాస్ అండ్ అదర్ లాస్. దీనికి 100 మార్కులు కేటాయించారు. ఇందులో కార్పొరేట్ లాస్ 60 మార్కులు, అదర్ లాస్ 40 మార్కులకు ఉంటాయి.
- ఈ పేపర్లో 30 శాతం మార్కులకు ఆబ్జెక్టివ్ ప్రశ్నలు అడుగుతారు.
- ఇటీవల కొత్తగా కలిపిన చాప్టర్లు, కొత్త సవరణలపై ప్రత్యేకంగా శ్రద్ధ వహించాలి.
- తప్పు, ఒప్పులు, ప్రకటనల (Statements) ప్రశ్నల రూపంలో 8–10 మార్కులు వచ్చే అవకాశం ఉంది. కాబట్టి వాటిని కూడా తప్పక చదవాలి.
- Bailment and pledge, Indenmnity and Guarantee, Conract of Agency వంటి చాప్టర్ల నుంచి ఇదివరకు ఆబ్జెక్టివ్ ప్రశ్నలు మాత్రమే ఆశించేవారు. కానీ ఇప్పుడు విశ్లేషణాత్మక ప్రశ్నలు కూడా ఈ చాప్టర్ల నుంచి వచ్చే అవకాశం ఉంది.
- కంపెనీల చట్టంలో ఇంతకు పూర్వం సరళమైన ప్రశ్నలకు నేరుగా అడిగేవారు. కష్టతరమైన, ఆచరణాత్మకమైన ప్రశ్నలు చాలా తక్కువగా ఉండేవి. కంపెనీల చట్టానికి ప్రాముఖ్యం పెరిగింది. దీంతో థియరీలో ఆచరణాత్మక ప్రశ్నలు అడిగే అవకాశం ఎక్కువగా ఉంది. కాబట్టి కొత్త సిలబస్ ప్రకారం కంపెనీలా పై ఎక్కువ దృష్టి సారించాలి.
- పరీక్షల్లో సాధ్యమైనంతవరకు ఇన్‌స్టిట్యూట్ మెటీరియల్‌లోని ముఖ్యాంశాలను (కీవర్డ్స్) రాయాలి. ఎంత ఎక్కువగా మనం ముఖ్యాంశాలను ప్రస్తావిస్తామో అంత ఎక్కువగా మార్కులను పొందే అవకాశముంది.
- పునశ్చరణ పరీక్ష పత్రాల (RTPs) నుంచి 10–15 మార్కులకు ప్రశ్నలను ఆశించవచ్చు. కాబట్టి పాత RTPsను నిర్లక్ష్యం చేయవద్దు.
- MTPలు తప్పక చదవాలి.
- ప్రతి ప్రశ్న చివరిలో ఇచ్చిన ఏకరూప ప్రశ్నలను కూడా చదవాలి.
- పరీక్ష రాసేటప్పుడు సెక్షన్ నంబర్లను మిళితం చేసి రాయాలి (కరెక్టుగా తెలిస్తే).

### పేపర్– 3

- కాస్ట్ అండ్ మేనేజ్‌మెంట్ అకౌంటింగ్ సబ్జెక్ట్ ఉంటుంది. దీనికి 100 మార్కులు కేటాయించారు.
- ప్రతి చాప్టర్‌లో ఇచ్చిన థియరీ ప్రశ్నలను తప్పక చదవాలి. ప్రత్యేకించి బేసిక్ కాన్సెప్ట్ ఇన్ కాస్టింగ్ అనే చాప్టర్ తప్పక చదవాలి.
- కనీసం గత 5 పరీక్షల ప్రశ్నపత్రంలోని థియరీ ప్రశ్నలను తప్పక చదవడం వల్ల థియరీ ప్రశ్నలకు సంబంధించి మార్కులు సాధించే వీలుంటుంది.
- కొత్తగా కలిపిన Cost Sheet, Unit costing, ABC costing, Service costing వంటి చాప్టర్లను శ్రద్ధగా చదవాలి.
- ప్రాబ్లమ్స్ బాగా ప్రాక్టీస్ చేయాలి.
- ఈ సబ్జెక్టుల్లో సమయపాలన ప్రముఖపాత్ర వహిస్తుంది. సమయాన్ని సరిగా వినియోగించుకోవాలి.

### పేపర్ 4

- ఈ పేపర్లో ట్యాక్సేషన్ సబ్జెక్టు నుంచి 100 మార్కులు ఉంటాయి. ఇందులో ఇన్‌కమ్‌ట్యాక్స్ 60 మార్కులకు, ఇన్‌డైరెక్ట్ ట్యాక్స్ 40 మార్కులకు ఉంటాయి.
- వీటిలో 30 శాతం మార్కులకు ఆబ్జెక్టివ్ ప్రశ్నలు అడుగుతారు.

**ఇన్‌కమ్‌ట్యాక్స్**

- ఇటీవలి సవరణలను బాగా చదవాలి (ఫైనాన్స్ యాక్ట్ 2018) ఈ నూతన సవరణల నుంచి 10–15 మార్కుల వరకు ప్రశ్నలు అడిగే అవకాశముంటుంది.
- ఇప్పటివరకు ఏ పుస్తకం/మెటీరియల్ చదివారో వాటితోనే పునశ్చరణ చేయాలి.
- ప్రాబ్లమ్స్‌కి సంబంధించిన ప్రశ్నలను బాగా ప్రాక్టీస్ చేయాలి.
- రిటర్న్ ఆఫ్ ఇన్‌కమ్, అడ్వాన్స్ ట్యాక్స్, ఇంట్రెస్ట్, టీడీఎస్, టీసీఎస్ వంటి చిన్న చిన్న చాప్టర్ల నుంచి కూడా ప్రశ్నలు అడిగే అవకాశం ఉన్నందున అటువంటి చాప్టర్ల పట్ల కూడా శ్రద్ధ వహించాలి.
- గ్రాస్ టోటల్ ఇన్‌కమ్‌కి సంబంధించిన లెక్కలను (ప్రాబ్లమ్స్) బాగా ప్రాక్టీస్ చేయాలి. పరీక్షలో ఈ లెక్క చేసేటప్పుడు చక్కగా పద్దులను వేస్తూ, సాధ్యమైనంత వివరంగా అంచెలవారీగా సమాధానం రాయాలి.
- Total Incomeకి సంబంధించిన లెక్కలను సాధ్యమైనన్ని ఎక్కువ సార్లు ప్రాక్టీసు చేయడంవల్ల Taxలోని 5 విభాగాలను పునశ్చరణ చేసినట్లవుతుంది.
- పరీక్ష రాసేటప్పుడు బాగా గుర్తుండే సెక్షన్ నెంబర్లను కూడా మిళితం చేయాలి.

**ఇన్‌డైరెక్ట్ ట్యాక్సెస్**

- CA–IPCC పాత సిలబస్ ప్రకారం, CA Inter కొత్త సిలబస్ ప్రకారం పరీక్ష రాసే విద్యార్థులందరికీ నవంబర్ 2019 పరీక్షలకు వస్తుసేవా పన్ను (జీఎస్టీ) వర్తిస్తుంది. కాబట్టి పాత సిలబస్, కొత్త సిలబస్ విద్యార్థులందరూ జీఎస్టీ తప్పక చదవాలి.
- ఇన్‌స్టిట్యూట్ ఇచ్చిన మెటీరియల్ లోని అన్ని ప్రాబ్లమ్స్‌ని 100శాతం ప్రాక్టీస్ చేయాలి
- GST Liability అంశానికి సంబంధించి 12 మార్కుల ప్రశ్నను ఆశించవచ్చు.
- GSTకి సంబంధించిన MCQsను నిర్లక్ష్యం చేయవద్దు
- థియరీకి, సమస్యల సాధనకు సమ ప్రాధాన్యం ఇవ్వాలి.

### పేపర్– 5

- ఇందులో అడ్వాన్స్‌డ్ అకౌంటింగ్ నుంచి 100 మార్కులకు ప్రశ్నలు అడుగుతారు.
- అకౌంటింగ్ స్టాండర్డ్స్ తప్పనిసరిగా చదవాలి.
- ఫార్మాట్స్ ఉన్న చాప్టర్స్, సాధ్యమైనన్ని ఎక్కువ లెక్కలు ప్రాక్టీస్ చేయాలి.
- Amalgamation and Internal reconstruction, Consolidation of Financial statements వంటి చాప్టర్ల మీద ప్రత్యేకంగా దృష్టి సారించాలి.

### పేపర్ 6

- ఆడిటింగ్ అండ్ అస్యూరెన్స్ 100 మార్కులకు ఉంటుంది.
- ఈ పేపర్లో 30 శాతం మార్కులకు ఆబ్జెక్టివ్ ప్రశ్నలు అడుగుతారు.
- ఏదో ఒక స్టాండర్డ్ పుస్తకాన్ని చదవాలి. రకరకాల పుస్తకాలు చదవవద్దు.
- పరీక్షల్లో ఆడిటింగ్ స్టాండర్డ్స్ మొత్తం ఎలా ఇచ్చారో అలానే రాయాల్సిన అవసరం లేదు. మిమ్మల్ని అడిగిన ప్రశ్నకు వర్తించే భాగం వరకు ఆడిటింగ్ స్టాండర్డ్స్ గురించి ప్రస్తావిస్తే చాలు.
- ఆడిటింగ్ స్టాండర్డ్ పేరు, నంబర్‌ను బాగా గుర్తుపెట్టుకోవాలి. పరీక్షల్లో ఒక్కోసారి మనం ఆడిటింగ్ స్టాండర్డ్ గురించి వివరంగా రాయలేకపోయినప్పటికీ ఆడిటింగ్ స్టాండర్డ్ పేరు, నంబర్ వరకు రాసినా ఎగ్జామినర్ దృష్టిని ఆకర్షించి మంచి మార్కులు పొందే అవకాశముంది.
- ఇటీవల పరీక్షల్లో ఆడిటింగ్ పరీక్షలో తప్పు ఒప్పు ప్రశ్నలు 20 మార్కుల వరకు ఇవ్వడం జరిగింది. కాబట్టి విద్యార్థులు ఇటువంటి ప్రశ్నలపై కూడా ప్రత్యేకంగా దృష్టిపెట్టాలి.
- కొత్తగా కలిపిన అంశాలైన SA 701, Audit of Bank వంటి అంశాలను క్షుణ్ణంగా చదవాలి.
- కొత్తగా చేసిన సవరణలను బాగా చదివి ఆకళింపు చేసుకోవాలి.
- ప్రాక్టికల్ ప్రశ్నలు అన్ని చాప్టర్లలో చదవాలనుకునేవారు Audit Appointment of Auditors and Aiiled Aspects నుంచి ముందుగా ప్రాక్టికల ప్రశ్నలు చదవడం ప్రారంభించి ఆ తర్వాత మిగతా చాప్టర్లలోని ప్రాక్టికల్ ప్రశ్నలు చదివితే మంచిది.

### పేపర్– 7

- ఎంటర్‌ప్రైజ్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ అండ్ స్ట్రాటజిక్ మేనేజ్‌మెంట్. ఇది 100 మార్కులకు ఉంటుంది. ఇందులో 30 శాతం మార్కులకు ఆబ్జెక్టివ్ ప్రశ్నలు అడుగుతారు.
- ఈ రెండు సబ్జెక్టుల్లో సమాధానాలు రాసేటప్పుడు సమాధానాలు సొంతంగా రాయకుండా ఉంటే మంచిది. సాధ్యమైనంత వరకు చదివిన పుస్తకం లేదా ఇన్‌స్టిట్యూట్ మెటీరియల్లోని సమాధానాలు ఉన్నవి ఉన్నట్లుగా , సాంకేతిక పదాలు మిళితం చేస్తూ రాయాలి.
- ఆబ్జెక్టివ్ ప్రశ్నలు, డెఫినిషన్లు, వ్యత్యాసాలు, తప్పు, ఒప్పుల ప్రశ్నలు వంటి వాటిపై శ్రద్ధ వహించండి. ఇలాంటి ప్రశ్నలు చదవడంవల్ల మార్కులు సులువుగా పొందవచ్చు.

**ఎంటర్‌ప్రైజ్ ఇన్‌ఫర్మేషన్ సిస్టమ్**

- ఇది 50 మార్కులకు ఉంటుంది. ఈ సబ్జెక్టులో ప్రశ్నలు అప్లికేషన్ ఓరియంటెడ్‌గా అడుగుతారు.
- పరీక్షల్లో ప్రశ్నలను నేరుగా అడుగుతారు. కాబట్టి బాగా సన్నద్ధమైతే మంచి మార్కులు పొందవచ్చు.
- ఈ పేపర్‌లో చాలా అంశాలు సీఏ ఫైనల్ ISCA అనే సబ్జెక్టు నుంచి తీసుకున్నారు.
- RTP, MTPలు తప్పనిసరిగా చదవాలి.
- ఈ సబ్జెక్టులో ప్రశ్నలు తికమకగా అడుగుతారు. అంటే ప్రశ్నలను నేరుగా కాకుండా రకరకాలుగా అడుగుతారు. పరీక్షకు ముందు సన్నద్ధమయ్యే సమయంలో ఇలాంటి ప్రశ్నలు వీలైనన్ని ఎక్కువ చదివితే ఎటువంటి భయం లేకుండా పరీక్ష రాయవచ్చు.
- ఈ సబ్జెక్టుల్లో పైన పేర్కొన్న విధంగా ప్రశ్నలను నేరుగా అడగరు.

### పేపర్–8

- ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ అండ్ ఎకనామిక్స్ ఫర్ ఫైనాన్స్. దీనికి 100 మార్కులు. ఇందులో ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్‌కు 60, ఎకనామిక్స్ ఫర్ ఫైనాన్స్‌కు 40 మార్కులు.

**ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్**

- ప్రతి చాప్టర్‌లోనూ థియరీ ప్రశ్నలను తప్పకుండా చదవాలి.
- 25 నుంచి 30 మార్కుల వరకు థియరీ ప్రశ్నలు అడిగే అవకాశముంది. కనీసం గత ఐదేండ్ల ప్రశ్నపత్రాల్లోని థియరీ ప్రశ్నలను కచ్చితంగా చదవాలి. ప్రత్యేకించి సోర్స్ ఆఫ్ ఫైనాన్స్, స్కోప్ అండ్ ఆబ్జెక్టివ్స్ ఆఫ్ FM వంటి చాప్టర్లకు సంబంధించిన థియరీ ప్రశ్నలు చదవాలి.
- ప్రజెంటేషన్ చేసేటప్పుడు సైడ్ హెడ్డింగ్స్ తప్పనిసరిగా రాయాలి.
- ప్రతి చాప్టర్‌లోని ప్రాథమిక అంశాలపై పట్టు సాధించాలి.
- ఇన్వెస్ట్‌మెంట్ డెసిషన్స్ అండ్ వర్కింగ్ క్యాపిటల్ మేనేజ్‌మెంట్ వంటి చాప్టర్లపై సంభావిత స్పష్టత అవసరం.
- కొత్తగా కలిపిన రిస్క్ అనాలిసిస్, లీజింగ్ అండ్ డెసిషన్స్ వంటి చాప్టర్లపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి.

**ఎకనామిక్స్ ఫర్ ఫైనాన్స్**

- పరీక్షలో ముఖ్యమైన ప్రశ్నలను నేరుగా అడుగుతారు. కాబట్టి ముఖ్యమైన ప్రశ్నలు బాగా చదివితే మంచి మార్కులు సాధించవచ్చు.
- కాంప్లికేటెడ్ టాపిక్స్‌కు సంబంధించి క్లాసులు ఫ్యాకల్టీ చెప్పిన ఉదాహరణలపై బాగా దృష్టి సారించాలి. దీనివల్ల కాన్సెప్ట్‌ను సులువుగా అర్థం చేసుకోవచ్చు.
- ప్రతి చాప్టర్‌లో ఇంట్రడక్షన్, డెఫినిషన్స్, ఫ్లో చార్ట్స్, గ్రాఫ్స్, టెక్నికల్ టర్మ్స్, అప్రాప్రియేట్ అసంప్షన్స్, ఫార్ములా, ఎగ్జాంపుల్స్ & సైడ్ హెడ్డింగ్స్‌పై ప్రత్యేక దృష్టి సారించాలి.
- ఈ సబ్జెక్టులో ప్రశ్నలు షార్ట్ ఆన్సర్ టైప్‌లో అడుగుతారు. కాబట్టి మంచి మార్కులు సాధించడం చాలు సులువు.
- RTP, MTPలు తప్పక చదవాలి.



**సీఏ ఇంటర్ పరీక్షల సన్నద్ధత వ్యూహాలు**

- తుది పరీక్ష ముగిసే వరకు అనుసరించే విద్యా ప్రణాళికను ముందుగా తయారు చేసుకుని అదే ప్రణాళికకు కట్టుబడాలి.
- సీఏలో సమయస్ఫూర్తి, లాజికల్ ఆలోచనా విధానం చాలా అవసరం. అలా ఆలోచిస్తేనే పరీక్షల్లో అడిగిన ఎటువంటి ప్రశ్నకయినా సరైన సమాధానం రాసే వీలుంటుంది. సబ్జెక్ట్‌పై పూర్తి అవగాహనతో చదవాలి. కానీ బట్టీ పట్టకూడదు. పరీక్షలో ప్రశ్నలు ఒకటికి రెండు సార్లు చదివి సమాధానాలు సూటిగా రాయాలి. సీఏలో మనం ఎంత రాశాం అన్నదాని కంటే ఏం రాశాం, మన సమాధాన విధానం ఎలా ఉన్నది అన్నదానికే ప్రాధాన్యం ఉంటుందని మరిచిపోకూడదు.
- ఒక డౌట్ బుక్ పెట్టుకోండి. వచ్చిన డౌట్లన్నీ ఆ పుస్తకంలో రాయండి. మీరు ఏదైనా ఇన్‌స్టిట్యూట్‌లో చదువుతుంటే అక్కడి ఫ్యాకల్టీని అడిగి ఆ డౌట్లను క్లారిఫై చేసుకోండి లేదా సొంతంగా ప్రిపేర్ అవుతుంటే టెక్ట్స్‌బుక్స్ లేదా స్టడీ మెటీరియల్ చూసుకుని డౌట్లను క్లారిఫై చేసుకోండి.
- సీఏ చదివేటప్పుడు విశ్లేషణాత్మకత, సమయస్ఫూర్తి అనేవి చాలా అవసరం. ఇలాంటి గుణాలను అలవర్చుకోగలిగితే పరీక్షల్లో సునాయాసంగా విజయం సాధించవచ్చు.
- మన శక్తిసామర్థ్యాలు, బలహీనతలపై మనకు అవగాహన ఉండాలి.
- ఈ పరీక్షకు ముఖ్యంగా తెలుసుకోవాల్సిన విషయం ఏంటంటే ఓవర్ కాన్ఫిడెన్స్ అసలు పనికిరాదు.
- రోజుకు ఎంతసేపు చదివాం అని కాదు, అందులో క్వాలిటీ సమయం ఎంతన్నదే లెక్క. తెల్లవారు జామున చదవడం బాగా ఉపకరిస్తుంది.
- ప్రతి సబ్జెక్ట్‌లో కనీస మార్కులకు తోడు మొత్తంగా చూసినప్పుడు అగ్రిగేట్ మార్కులు పొంది ఉండాలి. అప్పుడే పాసైనట్లు లెక్క. అందువల్ల కనీసం ఒకటి రెండు సబ్జెక్టుల్లో అయినా మన పర్ఫామెన్స్ బాగా ఉండేలా చూసుకోవాలి. అప్పుడే మనకు విజయం సులువుగా దక్కుతుంది.
- అకౌంటెన్సీ, అడ్వాన్స్‌డ్ అకౌంటెన్సీ, కాస్టింగ్‌లో పట్టు రావాలంటే ప్రాక్టీస్ ఒక్కటే దారి.
- సులువుగా ఉన్న సబ్జెక్టుల్లో మంచి మార్కులు సాధించే ప్రయత్నం చేయాలి. అప్పుడు కష్టంగా ఉన్న సబ్జెక్టుల్లో కనీస మార్కులు తెచ్చుకున్నా అగ్రిగేట్ దెబ్బతినదు. అంతిమంగా మంచి ఫలితాన్ని పొందవచ్చు.
- సీఏ చదవాలంటే ముఖ్యంగా ఉండాల్సిన లక్షణాలు శ్రమపడేతత్వం, నిబద్ధత, సహనం. ఇవి ఉంటే సాధారణ విద్యార్థి కూడా సీఏ ఇంటర్ పూర్తిచేయవచ్చు.
- ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకున్న తర్వాత మధ్యలో ఎన్ని అవాంతరాలు వచ్చినప్పటికీ ఆ లక్ష్యం దిశగా ముందడుగు వేసేవారే విజయం సాధిస్తారు.
- సన్నద్ధతకు అందుబాటులో ఉన్న సమయాన్ని దృష్టిలో ఉంచుకుని ఏయే సబ్జెక్టుకు ఎంత సమయం కేటాయించాలో ముందుగా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి. అదే ప్రణాళిక ప్రకారం చదవాలి.
- సన్నద్ధత సమయంలో బాగా కష్టమైన, అర్థంకాని సబ్జెక్టులకు సంబంధించి ఆలోచిస్తూ అనవసరంగా సమయం వృథాచేసుకోకుండా స్నేహితులు, ఫ్యాకల్టీ లేదా మెంటార్స్‌ను అడిగి అనుమానాలు, సందేహాలను నివృత్తి చేసుకోవాలి.
- ఉన్న సమయలో సబ్జెక్టుకు ఇన్ని రోజులని కేటాయించుకుని అలానే ఒక సబ్జెక్టుకు కేటాయించిన సమయంలో ఆ సబ్జెక్టులో ఎన్ని చాప్టర్లు ఉన్నాయి. ఏ చాప్టర్‌కు ఎక్కువ సమయం కేటాయించాలి, ప్రాముఖ్యం ఇవ్వాలని విభజించుకుని సన్నద్ధమవ్వాలి.
- పరీక్షల సమయంలో చదవడానికి ఎక్కువ అవకాశం ఉండదు. అందుకని పరీక్షలకు ముందు సన్నద్ధత సమయంలో అనవసర అంశాలు, బాగా వచ్చిన అంశాలను కొట్టివేస్తూ పోవాలి. అంటే చివరికి కేవలం కొంచెం ఇబ్బందిగా అనిపించిన అంశాలే మిగులుతాయి. వాటిని బాగా చదవాలి. ప్రాక్టీస్ చేయాలి. పరీక్ష ముందు వాటినే చూసుకుని పరీక్షలకు హాజరైతే సరిపోతుంది.
- పరీక్షలకు సన్నద్ధమయ్యేటప్పుడు ప్రశ్నలు ఎలా అడుగుతున్నారు. ఏయే టాపిక్స్ ఎక్కువగా కవర్ చేస్తున్నారనే అంశాలపై ప్రత్యేకంగా దృష్టిసారించాలి. సిలబస్ వెయిటేజీ గమనించి సన్నద్ధమవ్వాలి.
- సిలబస్ పూర్తి అంశాల గురించి అవగాహనతో ప్రతి చాప్టర్ వెయిటేజీ చూసుకోవాలి.
- సన్నద్ధత సమయంలో తప్పక ప్రతి అంశానికి ప్రాముఖ్యం ఇవ్వాలి. అన్ని అంశాలు పునశ్చరణ సమయంలో చేయగలిగారా లేదో చూసుకోవాలి.
- చాలా మంది విద్యార్థులకు ప్రాథమిక అంశాలపై పట్టు ఉండదు. సీఏలో ఏ దశలోనైనా రాణించాలంటే ముందుగా ప్రాథమిక అంశాలపై మంచి అవగాహన ఉండాలి.
- పరీక్ష రాసే సమయంలో చాలామంది విద్యార్థులు ఆందోళనకు గురవుతుంటారు. ఇలా ఆందోళనపడటంవల్ల ఒక్కోసారి బాగా తెలిసిన సమాధానాలు కూడా రాయలేరు. లేదా తప్పుగా రాసే అవకాశం ఉంది. పరీక్షలో దాదాపు మనం సమాధానం రాయగలిగే ప్రశ్నలే ఇస్తారు. కాబట్టి పరీక్షల గురించి కానీ, పరీక్షలు రాసేటప్పుడు కానీ ఆందోళన పడకూడదు.
- పరీక్ష రాసేటప్పుడు సమయపాలన చాలా అవసరం. కొంతమంది అనవసర విషయాల గురించి ఆలోచిస్తూ కొన్ని ప్రశ్నలకు సమాధానం ఎలా రాయాలని ఆలోచిస్తూ అనవసరంగా పరీక్ష సమయాన్ని వృథా చేస్తుంటారు. పరీక్ష రాసేటప్పుడు వచ్చిన సమాధానాలను ముందుగా, వేగంగా రాసి చివర్లో దాని సమాధానాల గురించి ఆలోచించాలి. దీనివల్ల అనవసర సమయం వృథా కాదు.
- పరీక్షలు జరిగినన్ని రోజులు మనపై మనకున్న నమ్మకాన్ని కోల్పోకూడదు.
- పరీక్షల సన్నద్ధత సమయంలో కొంతమంది విద్యార్థులు వేర్వేరు పుస్తకాలు, మెటీరియల్స్ తిరిగేస్తూ ఉంటారు. దీనివల్ల అనవసర ఆందోళనకు, అయోమయానికి లోనవుతుంటారు. సన్నద్ధత సమయంలో మనం ఎటువంటి పుస్తకం/మెటీరియల్ చదువుతున్నామనేది కూడా అవసరం. ఇన్‌స్టిట్యూట్ వారి మెటీరియల్‌లో విద్యార్థికి అవసరమైనంత సమాచారం ఇవ్వడం జరిగింది. అది చదివితే సరిపోతుంది.
- కొంతమంది విద్యార్థులు కొన్ని ప్రశ్నలకు సమాధానాలను పేజీలకు పేజీలు రాస్తే బాగా మార్కులు వస్తాయని భావిస్తుంటారు. కానీ అది అపోహే. సీఏ పరీక్షల్లో మనం ఎంత జవాబు రాశామన్నదాని కంటే రాసిన సమాధానం ఎంత సూటిగా రాశామన్నదే ముఖ్యం.
- పరీక్ష రాసేటప్పుడు సమాధానాన్ని చక్కగా రాస్తూ అవసరమైన వర్కింగ్ నోట్స్, క్యాలిక్యులేషన్స్‌ను పక్కనే రాయాలి. చాలామంది విద్యార్థులు కేవలం సమాధానం మాత్రమే రాసి వర్కింగ్ నోట్స్ వేరే ఎక్కడో రాయడంవల్ల అనవసరంగా మార్కులు కోల్పోతున్నారు.
- అకౌంట్స్ వంటి సబ్జెక్టుల్లో కొంతమంది విద్యార్థులు లెక్కకు ఇచ్చిన ప్రాధాన్యం ఫార్మాట్లకు ఇవ్వరు. అలా చేయడంవల్ల కూడా కొన్ని మార్కులు కోల్పోయే అవకాశం ఉంది.



మట్టుపల్లి ప్రకాశ్
మాస్టర్ మైండ్స్
హైదరాబాద్
9248733323

# గాంధీజీ ఎలా ఆత్మహత్య చేసుకున్నారు?

గుజరాత్‌లో తొమ్మిదో తరగతి పరీక్షలో ప్రశ్న



**అహ్మదాబాద్, అక్టోబర్ 13:** గుజరాత్‌లోని ఓ పాఠశాల, కళాశాల విద్యార్థులకు నిర్వహించిన పరీక్షల్లో అడిగిన రెండు ప్రశ్నలు విద్యాశాఖ అధికారులనే అవాక్కయ్యేలా చేశాయి. మహాత్మా గాంధీ ఎలా ఆత్మహత్య చేసుకున్నారు? అనే ప్రశ్న తొమ్మిదో తరగతి విద్యార్థుల పరీక్ష ప్రశ్నపత్రంలో కనిపించగా, మద్య నిషేధం ఉన్న గుజరాత్‌లో మద్యం విక్రయాలపై 12వ తరగతి విద్యార్థులను అడిగిన ఓ ప్రశ్న సైతం అధికారులను ఇరుకున పడేసింది. గాంధీజీ హత్యకు గురయ్యారనే విషయం అందరికీ తెలిసిందే. గాంధీనగర్‌లో 'సుఫలాం శాల వికాస్ సంకుల్' పేరుతో ప్రభుత్వ నిధులు పొందే సెల్ఫ్ ఫైనాన్స్‌డ్ విద్యాసంస్థలకు చెందిన పాఠశాలలో తొమ్మిదో తరగతి విద్యార్థులకు ఇంటర్నల్ అసెస్‌మెంట్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. శనివారం జరిగిన పరీక్షలో గుజరాతీలో 'గాంధీజీ ఎలా ఆత్మహత్య చేసుకున్నారు?' అని ఓ ప్రశ్న అడిగారు. మరోవైపు 12వ తరగతి విద్యార్థుల పరీక్షలో 'మీ ప్రాంతంలో మద్యం విక్రయాలు పెరుగడం, సారా వ్యాపారులతో కలుగుతున్న ఇబ్బందులపై జిల్లా పోలీసు అధికారికి ఫిర్యాదు చేస్తూ లేఖ రాయండి' అనే ప్రశ్న కనిపించింది. ఈ రెండు ప్రశ్నలు అభ్యంతరకరమైనవని, దీనిపై విచారణ ప్రారంభించామని, నివేదిక అందాక చర్యలు తీ సుకుంటామని గాంధీనగర్ జిల్లా విద్యాశాఖ అధికారి భరత్ వాదిర్ తెలిపారు. ఆయా ప్రశ్నపత్రాలను పాఠశాల యాజమాన్యాలే రూపొందించాయని చెప్పారు. వీటితో విద్యాశాఖకు సంబంధంలేదని స్పష్టంచేశారు.

# ముంబైలో భారీ అగ్నిప్రమాదం

ఒకరి మృతి



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

**ముంబై, అక్టోబర్ 13:** ముంబైలోని ఓ భవనంలో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకున్నది. మంటల్లో చిక్కుకొని పొగలతో ఊపిరాడక ఒకరు మృతిచెందగా.. మరో ఆరుగురిని దవాఖానకు తరలించి చికిత్సనందిస్తున్నారు. గ్రాంట్ రోడ్డు ప్రాంతంలో ఆదివారం ఉదయం ఓ ఐదంతస్థుల భవనంలో మంటలు చెలరేగాయి. సమాచారమందుకున్న అగ్నిమాపకసిబ్బంది ఘటనాస్థలికి చేరుకొని పదిమందిని రక్షించారు. భవనంలోని గ్రౌండ్‌ఫ్లోర్, మొదటి అంతస్థులో, విద్యుత్ తీగలగుండా మంటలు వ్యాపించాయి. ఉత్తమ్‌కుమార్ అనే వ్యక్తి మంటల్లో చిక్కుకొని అపస్మారకస్థితిలోకి చేరుకున్నాడు. అగ్నిమాపకసిబ్బంది గమనించి అతడిని స్థానిక దవాఖానకు తీసుకెళ్లగా మృతిచెందినట్టు వైద్యులు నిర్ధారించారు. ఓ అగ్నిమాపకసిబ్బందితో పాటు మరోఐదుగురికి ఊపిరాడకపోవడంతో వారిని సమీపంలోని దవాఖానకు తరలించారు. ప్రస్తుతం వారి ఆరోగ్యం నిలకడగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు. పొగలు దట్టంగా కమ్ముకోవడంతో మంటలను అదుపులోకి తీసుకురావడం కష్టంగా ఉన్నదని అధికారులు తెలిపారు. 150 మందిసిబ్బంది సహాయకచర్యల్లో పాల్గొంటున్నారు.



## పంటల కొనుగోళ్లకు సిద్ధమవ్వండి

- మార్కెట్లకు వ్యవసాయ ఉత్పత్తులు పోటెత్తే అవకాశం ఉన్నది
- వ్యవసాయ, మార్కెట్ కార్యదర్శులకు బాధ్యతలు అప్పగించండి
- మార్కెటింగ్‌శాఖపై సమీక్షలో మంత్రి నిరంజన్‌రెడ్డి



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** వానకాలం పంట దిగుబడులు పోటెత్తే అవకాశం ఉన్నదని, మార్కెట్లకు పెద్దఎత్తున వ్యవసాయ ఉత్పత్తులు రానున్న నేపథ్యంలో క్షేత్రస్థాయి అధికారులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖల మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. అక్కడక్కడ కొందరు దళారులు, వ్యాపారులు అక్రమాలకు పాల్పడకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అక్రమాలకు పాల్పడితే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆదివారం మార్కెటింగ్‌శాఖపై మంత్రి సమీక్ష నిర్వహించారు. మార్కెట్ యార్డులు, జిన్నింగ్ మిల్లులు, ప్రాసెసింగ్ కేంద్రాలు ముందుగానే పరిశీలించి ఏర్పాట్లను యుద్ధప్రాతిపదికన సరిచేసుకోవాలని సూచించారు. కలెక్టర్ల అనుమతితో పత్తి కొనుగోలుకు సంబంధించి సాధ్యమైనంత ఎక్కువగా జిన్నింగ్ మిల్లులను నోటిఫై చేయాలని చెప్పారు. పత్తి కొనుగోలుకు కావాల్సిన సాంకేతిక సౌకర్యాలు, వేబ్రిడ్జిలను ఏర్పాటుచేసుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద మద్దతు ధర తెలిపే బోర్డులను పెట్టాలని, రైతులకు తెలిసేలా వివిధ పద్ధతుల ద్వారా ప్రచారం చేపట్టాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల వద్ద రద్దీ ఏర్పడకుండా రైతులు వరుస క్రమంలో వచ్చేలా చూడాలన్నారు. అవసరమైతే రైతులకు టోకెన్లు జారీచేయాలని సూచించారు. వ్యవసాయ మార్కెట్ల కార్యదర్శులు, ఇతర సంబంధిత అధికారులతో సమావేశాలు ఏర్పాటుచేసి వారి విధులు, బాధ్యతలను అప్పగిస్తూ ఉత్తర్వులు జారీచేయాలని ఆదేశించారు. పత్తి కొనుగోళ్లలో ఎలాంటి పరిణామాలు చోటుచేసుకున్నా దానికి సంబంధిత అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. కొనుగోలు కేంద్రాల్లో సిబ్బంది రైతులకు అన్ని వేళల్లో అందుబాటులో ఉండాలని సూచించారు. విద్యుత్ ఇబ్బందులు లేకుండా అవసరమైన సిబ్బందిని అందుబాటులో ఉంచుకోవాలన్నారు. రైతులు, సిబ్బందికి మార్కెట్‌యార్డుల్లో తాగునీరు, విశ్రాంతి గదులు, మరుగుదొడ్లు, ఇతర మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు. అగ్నిప్రమాదం సంభవిస్తే ఎలాంటి నష్టం వాటిల్లకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. మార్కెట్లకు వచ్చిన ధాన్యం అకాల వర్షాలకు నష్టపోకుండా తగిన సదుపాయాలు కల్పించాలని చెప్పారు. టార్పాలిన్లు, లాంతర్లు, టార్చ్‌లైట్లు అవసరమైన మేరకు సమకూర్చుకోవాలని ఆయా శాఖల ఉన్నతాధికారులకు, జిల్లా అధికారులకు ఆదేశాలు జారీచేశారు.

# భూదానం.. రెవెన్యూ వివాదం!

ధర్మగంట

- లెక్క తేలక ఆగిన పాస్‌పుస్తకాల జారీ
- రంగారెడ్డి జిల్లాలో వందల మంది ఎదురుచూపు
- శంషాబాద్ మండలంలోనే 600లకుపైగా ఎకరాలకు నిలిపివేత
- పాస్‌పుస్తకాల కోసం తిరుగుతున్న కొనుగోలుదారులు
- రియల్ బూమ్‌తో పలుమార్లు చేతులు మారిన భూములు

**హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** భూమి విలువ పెరిగింది.. భూమి మాత్రం పెరుగలేదు. కానీ ఎంతో కొంత భూమికి హక్కుదారులు కావాలని, తమ పేరిట స్థిరాస్తి ఉండాలన్న ఆకాంక్ష జనంలో పెరుగుతున్నది. దీంతో రైతులే కాదు ఇతరులు కూడా ఎడాపెడా భూములను కొంటున్నారు. ఈ క్రమంలోనే అనేక భూ వివాదాలు చుట్టుముడుతున్నాయి. ఆఖరికి భూదానోద్యమంలో సేకరించిన భూములపైనా అనేక చిక్కుముళ్లు పడ్డాయి. వాటిని పరిష్కరించేందుకు ప్రస్తుతం ఏ ప్రక్రియా అధికారుల వద్ద లేదు. ప్రధానంగా రంగారెడ్డి జిల్లాలో రియల్ ఎస్టేట్ వ్యాపారుల మాయాజాలంతో లెక్కకు మించిన భూముల లావాదేవీలు నమోదయ్యాయి. వాటిలో భూదాన భూములు కూడా ఉన్నాయి. అయితే భూదాన బోర్డుకు సంబంధించిన లెక్కలు రెవెన్యూ రికార్డుల్లో సక్రమంగా లేకపోవడంతో వాటికి సంబంధించిన అన్ని సర్వే నంబర్లను పార్ట్-బీ కింద నమోదుచేశారు. ఇందులో పట్టా భూములు కూడా ఉన్నాయి. ఒక సర్వే నంబర్‌లోని విస్తీర్ణం ఖాస్రా పహాణీ ప్రకారం 20 ఎకరాలు అనుకుంటే.. అందులో ఓ ఐదెకరాలు భూదాన పత్రాల్లో నమోదైంది. అయితే ఇప్పుడు ఏ మూలన ఆ ఐదెకరాలు ఉన్నదో, ఆ భూమిని బోర్డు ఎవరికి కేటాయించిందో వంటి ఆధారాలు రెవెన్యూశాఖ వద్ద లేవు. దాంతో ఆ సర్వే నంబర్‌లోని మొత్తం భూమిని వివాదాస్పదంగా పరిగణిస్తున్నారు. దీంతో ఆ సర్వే నంబర్లలో పట్టా భూములను కొన్నవారు సైతం పాస్‌పుస్తకాల కోసం ఏండ్ల తరబడి ఎదురుచూస్తున్నారు. శంషాబాద్ మండలంలోని పెద్దషాపూర్‌లో భూములు కొన్నవారు 'నమస్తే తెలంగాణ- ధర్మగంట'ను ఆశ్రయించారు. వారి వద్ద ఉన్న అన్ని పత్రాలను చూపారు. ఆఖరికి రెవెన్యూ అధికారులు కొందరికి మ్యుటేషన్ చేస్తూ ఉత్తర్వులు కూడా జారీచేశారు. కానీ భవిష్యత్‌లో ఇబ్బందులు తలెత్తకూడదన్న భావనతో అధికారులు భూదాన భూముల లెక్క (క్షేత్రస్థాయిలో) తేలాక పాస్‌పుస్తకాల జారీచేపడుతామంటున్నారు. ఇలా ఆరేడేండ్ల నుంచి కొనుగోలుదారుల వద్ద సేల్‌డీడ్లు, పాత పాస్‌పుస్తకాలే మిగిలాయి. ఇప్పుడేమో రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న రైతుబంధు, రైతుబీమాకు దూరమవుతున్నామని కొనుగోలుదారులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఈ భూదాన బోర్డు లెక్కలు క్షేత్రస్థాయిలో తేలకపోవడం వల్ల పలు మండలాల్లో మ్యుటేషన్లు, కొత్త పాస్‌పుస్తకాల జారీ నిలిచిపోయింది. ఇలా వందల దరఖాస్తులు రెవెన్యూ కార్యాలయాల్లో పెండింగ్‌లో ఉన్నట్టు అధికారులే చెప్తున్నారు.



పెద్దషాపూర్‌లో పట్టాభూమి



లెక్క తేల్చాలంటూ బోర్డు కార్యదర్శికి రాసిన లేఖ

### హైదరాబాద్ శివార్లలోనే అధికం

హైదరాబాద్ నగర శివార్లలోని భూదాన భూములపైనే అనేక వివాదాలు ముసిరాయి. ఏ సర్వే నంబర్‌లో ఎంత? ఏ మూలన అది ఉంటుందోనన్న కచ్చితమైన ఆధారాలు లేకపోవడంతో తాసిల్దార్లు, ఆర్డీవోలు కూడా అయోమయానికి గురవుతున్నారు. శంషాబాద్ మండలంలోని ఈ సమస్యకు పరిష్కారం చూపాలంటూ సీసీఎల్‌ఏ కార్యాలయం భూదాన యజ్ఞ బోర్డు కార్యదర్శికి లేఖ రాసింది. ఒక్క పెద్దషాపూర్‌లోనే 23 మంది పట్టాదారులు 20 భూదాన పత్రాలను సమర్పించారు. వాళ్లు దానం చేసిన భూమిని సర్వే నంబర్లవారీగా లెక్క చూపలేదు. ఖాస్రా పహాణీలో మాత్రం పట్టా భూమిగా ఉన్నది. భూదానోద్యమం తర్వాత భూదాన్ ఖరీజ్ ఖాతాగా రికార్డుల్లో పేర్కొనలేదు. కానీ భూదాన యజ్ఞ బోర్డు మాత్రం పలానా రైతులు భూదాన పత్రాలు సమర్పించారంటూ లెక్కలు ఇచ్చింది. అయితే ఏ సర్వే నంబర్‌లో ఎంత భూమిని రికార్డుల్లో మార్చాలో అంతు చిక్కడంలేదు. ఇప్పుడు ఆ భూములు సైతం చేతులు మారాయి. ఇప్పుడేమో కొనుగోలుదార్ల నుంచి భూదాన బోర్డుకు బదిలీచేసే అవకాశం కనిపించడం లేదు. 1962-63 నుంచి అనేక భాగాలుగా, అలాగే చేతులు మారాయి. ఈ భూ దానపత్రాల ప్రకారం ఏ లెక్కన, ఎవరి ఖాతాలో నుంచి సేకరించి బోర్డు పేరిట రాయాలో అంతుచిక్కడం లేదని ఓ అధికారి వాపోయా రు. ఇదే విషయాన్ని బోర్డు కార్యదర్శికి లేఖ రాశారు.

### అన్నీ పీవోబీలోనే..

ఎలాగూ లెక్క తేలడం లేదు. పైగా బోర్డు సమర్పించిన భూదాన పత్రాల ఆధారంగా ఆయా సర్వే నంబర్లు అన్నింటినీ పీవోబీ (నిషేధిత భూముల జాబితా) 22-ఏ కింద నమోదు చేస్తూ అధికారులు ఇ-పాస్‌బుక్‌ను విడుదలచేశారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి సమర్పించారు. అయితే అంతకుముందే ఈ భూములను కొన్నవారు ఉన్నారు. పీవోబీలో పెట్టిన తర్వాత కూడా పాత పాస్‌పుస్తకాలు, రెవెన్యూ పహాణీల్లో పట్టా భూములుగా ఉండటంతో కొనుగోలుచేసినవారూ ఉన్నారు. ఇలా పెద్దషాపూర్, పెద్దగోల్కొండ, సుల్తాన్‌పల్లి, కొత్వాల్‌గూడ, పాలమాకులలో సుమారు 600లకుపైగా ఎకరాల భూమి ఉన్నది. ఒక్క పెద్దషాపూర్‌లోనే 110 మంది కొనుగోలుదారులకు పాస్‌పుస్తకాలు నిలిచిపోయాయి. భూదాన యజ్ఞ బోర్డు క్షేత్రస్థాయి పరిశీలన చేసి లెక్క తేల్చాలని రెవె న్యూ అధికారులు లేఖ రాశారు. ఇలా గండిపేట, షాద్‌నగర్, కొత్తూరు మండలాల్లోనూ కేసులు ఉన్నట్టు తెలిసింది. భూదాన భూము ల్లో కొంత వ్యవసాయేతరంగా కూడా మారింది. ప్లాట్లుగానూ రూపాంతరం చెందాయి. ఒక్క పెద్దషాపూర్‌లోనే 27 ఎకరాల భూమి వ్యవసాయేతరంగా మారిందని రెవెన్యూ అధికారులు బోర్డుకు సమాచారం ఇచ్చారు. ఇది ఇలాగే కొనసాగితే అటు బోర్డుకు కూడా భూమి మిగిలే అవకాశం లేదు. మరోవైపు కొనుగోలుదారులు సైతం పాస్‌పుస్తకాలు రాక ఇక్కట్లు పడుతూనే ఉంటారు.

### అన్నీ చూసే కొన్నాం



**మేం** రికార్డులు అన్నీ చూశాం. రెవెన్యూ రికార్డుల్లో పట్టా భూమిగానే ఉన్నది. అందుకే పెద్దషాపూర్‌లోని సర్వే నంబర్ 301/ఉలో రెండెకరాలు కొన్నాం. నా భార్య జ్యోతి పేరిట డాక్యుమెంట్లు ఉన్నాయి. వాటన్నింటినీ శంషాబాద్ తాసిల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నాం. మ్యుటేషన్ చేస్తూ ఉత్తర్వులు నంబర్ డీ/1190/2013, తేదీ.29.05.2014ను జారీచేశారు. కానీ ఇప్పటివరకు పాస్‌పుస్తకాలు ఇవ్వలేదు. ఏండ్లుగా తిరుగుతున్నాం. కొత్త పాస్‌పుస్తకాలైనా వస్తాయని ఆశపడ్డాం. కానీ కాలయాపన చేస్తున్నారు. ఇప్పుడేమో మేం కొన్న భూములు భూదాన బోర్డువని అధికారులు చెప్తున్నారు. అక్కడి నుంచి క్లారిటీ వస్తేనే పాస్‌పుస్తకాలు జారీ చేస్తామంటున్నారు. రెవెన్యూ రికార్డుల్లో పట్టా భూమిగా ఉన్నందు వల్లే కొన్నాం. భూదాన భూమి లెక్క తేల్చాలని కోరుతున్నాం. అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ఈ సమస్యను పరిష్కరించాలి.

**- చింతల రాజేంద్రప్రసాద్, బాధితుడు**

### రికార్డుల ప్రక్షాళనలో భాగమే ఇది

**భూదాన** భూముల లెక్క కూడా రికార్డుల ప్రక్షాళనలో భాగమే. లెక్క పక్కాగా తేలకపోతే భవిష్యత్‌లోనూ ఇబ్బందే. కొనుగోలుదార్లకు కూడా కష్టమే. అందుకే ఏ సర్వే నంబర్‌లో ఎంత, ఏ వైపున అనేది క్షేత్రస్థాయిలో తేలాలి. అది తేలకుండా పాస్‌పుస్తకాలు జారీచేయడం సాధ్యంకాదు. రికార్డుల ప్రక్షాళనలోనైనా పక్కాగా లేకపోతే సమస్యలు పునరావృతమవుతాయి. అందుకే ఈ అంశాన్ని భూదాన యజ్ఞ బోర్డు కార్యదర్శికి లేఖ రాశాం. వాళ్లు ఎవరినైనా డిప్యూట్ చేసి క్షేత్రస్థాయి పరిశీలన చేసి లెక్క తేల్చడం ద్వారా అందరికీ మంచి జరుగుతుంది. అప్పటివరకు కొనుగోలుదార్లకు పాస్‌పుస్తకాలు జారీచేయడం కుదరదు.

**- కే చంద్రకళ, రాజేంద్రనగర్ ఆర్డీవో**

## మార్క్‌ఫెడ్‌కు లక్ష టన్నుల ఇఫ్కో యూరియా

చైర్మన్ లోక బాపురెడ్డి వెల్లడి



ఇఫ్కో డైరెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న తెలంగాణ మార్క్‌ఫెడ్ చైర్మన్ లోక బాపురెడ్డి

**హైదరాబాద్, నమస్తేతెలంగాణ:** మార్క్‌ఫెడ్‌కు 2019 యాసంగి సీజన్‌కు లక్ష టన్నుల యూరియా సరఫరా చేసేందుకు ఇఫ్కో సంస్థ అంగీకరించినట్టు మార్క్‌ఫెడ్ చైర్మన్ లోక బాపురెడ్డి తెలిపారు. ఢిల్లీలో ఆదివారం ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి, జనరల్ మేనేజర్ బీ విష్ణు, ఇఫ్కో మార్కెటింగ్ డైరెక్టర్ యోగేంద్ర కుమార్‌తో మార్క్‌ఫెడ్ చైర్మన్ బాపురెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా బాపురెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో పుష్కలంగా వర్షాలు కురిశాయని చెప్పారు. రాబోయే యాసంగిలో పంటలసాగు పెరిగే అవకాశం ఉందని, అవసరమైన ఎరువులను మార్క్‌ఫెడ్‌కు సరఫరా చేయాలని కోరగా.. ఇఫ్కో డైరెక్టర్ యోగేంద్ర కుమార్ తెలంగాణకు లక్ష క్వింటాళ్ల యూరియా సరఫరా చేసేందుకు అంగీకరించినట్టు తెలిపారు.

## న్యూ ఆర్లియన్స్‌లో కుప్పకూలిన హోటల్

ఇద్దరి దుర్మరణం, మరో 20మందికి తీవ్రగాయాలు

**న్యూ ఆర్లియన్స్:** నిర్మాణంలో ఉన్న ఓ అతిపెద్ద హోటల్ భవనం కుప్పకూలిన ఘటనలో ఇద్దరు దుర్మరణం పాలయ్యారు. మరో 20 మందికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన శనివారం సాయంత్రం జరిగింది. అమెరికా లూసియానా రాష్ట్రంలోని న్యూఆర్లియన్స్ నగరంలో మిసిసిపీ నది ఒడ్డున నిర్మిస్తున్న 18 అంతస్థుల హర్డ్ రాక్ హోటల్ ఒక్కసారిగా పాక్షికంగా కుప్పకూలింది. ఆ సమయంలో పనుల్లో ఉన్న ఇద్దరు కార్మికులు శిథిలాల కింద చిక్కుకొని మృతిచెందారు. మరో 20 మందికి గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం అత్యవసర సేవల సిబ్బంది దగ్గర్లోని దవాఖానకు తరలించి చికిత్స అందిస్తున్నారు. కనిపించకుండా పోయిన ఒకరిద్దరు వ్యక్తులను గుర్తించేందుకు శిథిలాలను తొలగించే పనిలో పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది నిమగ్నమయ్యారు. భవనం కుప్పకూలిన సమయంలో నిర్మాణ ప్రాంగణంలో వంద కన్నా ఎక్కువ మంది పనిలో ఉన్నట్టు ప్రాజెక్ట్ కాంట్రాక్టర్ చెప్పారు.

# చిగురుటాకులా జపాన్

- పెను బీభత్సం సృష్టిస్తున్న హగిబిస్ తుఫాన్
- 26 మంది మృతి.. వందల మందికి గాయాలు
- ఉద్ధృతంగా ప్రవహిస్తున్న 14 నదులు.. పరివాహక ప్రాంతాలు మునక
- భవంతుల రెండో అంతస్థు వరకు చేరిన వరద నీరు
- సహాయక చర్యల్లో 31 వేల బృందాలు



భారీ వర్షాలకు జపాన్‌లోని నగానో రైల్వే డిపోలో నీట మునిగిన బుల్లెట్ రైళ్లు

**టోక్యో, అక్టోబర్ 13:** జపాన్‌లో హగిబిస్ తుఫాన్ బీభత్సాన్ని సృష్టిస్తున్నది. భారీ వర్షాలతో దేశంలోని పలు నగరాలు, పట్టణాలు జలమయమయ్యాయి. 14 నదులు పొంగిపొర్లుతున్నాయి. రాజధాని నగరం టోక్యోపై తుఫాన్ ప్రభావం స్పష్టంగా కనిపిస్తున్నది. గంటకు 216 కి.మీ. వేగంతో బలమైన గాలులు వీచాయి. వివిధ ఘటనల్లో 26 మంది మరణించగా.. వందలాది మంది గాయపడ్డారు. కొండచరియలు విరిగిపడటం, వరదలు పోటెత్తడంతో పలువురు గల్లంతయ్యారు. తుఫాన్ బాధితులను రక్షించడానికి 31 వేల సహాయక బృందాలతో పాటు మరో లక్ష మంది సైనికులు రంగంలోకి దిగారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో చిక్కుకున్న బాధితులను హెలికాప్టర్లు, పడవల సాయంతో సురక్షిత ప్రాంతాలకు తరలించారు. తుఫాన్ నేపథ్యంలో రగ్బీ ప్రపంచ కప్ టోర్నమెంటును అధికారులు రద్దు చేశారు. తుఫాన్ వల్ల ఆదివారం ఉదయం నాటికి 14 మంది చనిపోగా 11 మంది గల్లంతయ్యారని ప్రభుత్వాధికారులు ప్రకటించారు. అయితే, మృతుల సంఖ్య 26దాటిందని స్థానిక మీడియా పేర్కొంది. మరో 15 మంది గల్లంతైనట్టు వివరించింది. మధ్య జపాన్‌తో పాటు పలు ప్రాంతాల్లో నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. చికుమా నది ఉధృతంగా ప్రవహిస్తుండటంతో నదీ పరీవాహక ప్రాంతాలు నీటమునిగాయి. పరిసర ప్రాంతాల్లోకి నీరు చొచ్చుకురావడంతో భవంతుల రెండో అంతస్థు వరకు వరద నీరు చేరింది. సహాయం కోసం భవంతుల మీదకి చేరుకున్న బాధితులను సహాయక బృందం సభ్యులు రక్షించారు. హగిబిస్ వల్ల వాయవ్య టోక్యోతో పాటు ఇవాకి, పుకుషిమా, క్యాగో తదితర పట్టణాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. తుఫాన్ ప్రభావం హోన్షు ద్వీపంపై తీవ్రంగా పడినట్టు అధికారులు పేర్కొన్నారు. వరద ప్రవాహంలో కొట్టుకొచ్చిన వాహనాలు, ఇంటి శకలాల కింద పలువురి మృతదేహాలను గుర్తించినట్టు అధికారులు తెలిపారు. తుఫాన్ బాధితులకు అవసరమైన సహాయాన్ని ప్రభుత్వం అందిస్తున్నదని జపాన్ ప్రధాని షింజో అబే తెలిపారు. తుఫాన్ కారణంగా 3,76,000 గృహాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. 1,35,000 మంది ప్రజలు ప్రభుత్వ పునరావాస కేంద్రాల్లో తలదాచుకున్నారు. బుల్లెట్ రైలుతో పాటు పలు రైళ్లు, విమాన సర్వీసులను అధికారులు రద్దు చేశారు. హగిబిస్ తుఫాన్ పట్ల ప్రజలు అప్రమత్తతతో ఉండాలని జపాన్ వాతావరణ విభాగం హెచ్చరికలు జారీచేసింది. 1958లో టోక్యోలో సంభవించిన తుఫాన్‌కు హగిబిస్‌కు దగ్గరి పోలిక ఉన్నదని వాతావరణ నిపుణులు తెలిపారు. ఆ తుఫాన్ కారణంగా 5 లక్షల ఇండ్లు నేలమట్టమయ్యాయని, 1,200 కంటే ఎక్కువమంది చనిపోయారని వాళ్లు గుర్తుచేశారు.

## వృద్ధుల సంరక్షణకు సెలవు

ప్రధాని మోదీకి ఎయిమ్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ లేఖ

**న్యూఢిల్లీ, అక్టోబర్ 13:** ప్రసూతి సెలవు తరహాలో తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న తల్లిదండ్రుల బాగోగులు చూసుకునే ఉద్యోగులకు సెలవు ఇచ్చేందుకు ఓ విధానాన్ని రూపొందించాలని కోరుతూ అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ (ఎయిమ్స్)లో జెరియాట్రిక్ (వృద్ధుల సంరక్షణ) విభాగ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ విజయ్ గుర్జర్ ప్రధాన మంత్రి నరేంద్రమోదీకి లేఖ రాశారు. వృద్ధ రోగులు, వారి కుటుంబసభ్యులతో మాట్లాడినప్పుడు వారి మనోవేదన, భావోద్వేగాలేమిటో తనకు తెలిశాయని, తీవ్ర అనారోగ్యంతో సతమతమవుతూ దవాఖానల్లోనో లేక ఇండ్లలోనో ఇబ్బందులు పడుతున్న తల్లిదండ్రులను చూసుకునేందుకు సెలవు పెట్టాల్సి వచ్చినప్పుడు వేతనంలో కోతలు లేదా ఉద్యోగాలను కోల్పోవడం ద్వారా ఉద్యోగులు ఆర్థిక సంక్షోభంలో చిక్కుకొంటున్నారని డాక్టర్ విజయ్ గుర్జర్ తన లేఖలో పేర్కొంటూ.. తల్లిదండ్రులు లేదా తాతలు, నానమ్మలకు సేవలందించే పిల్లలను గౌరవించాల్సిన అవసరం ఉన్నదని విజ్ఞప్తి చేశారు. 'ఎయిమ్స్ రిఫరల్ సెంటర్ కావడంతో కేవలం తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న రోగులను మాత్రమే ఇక్కడ చేర్చుకుంటున్నాం. వారి సంరక్షణకు కుటుంబసభ్యుల్లో ఎవరో ఒకరు ఇక్కడ ఉండాల్సి ఉంటుంది. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న రోగికి చికిత్స అందించేందుకు చాలా సమయం పడుతుంది. అటువంటి పరిస్థితిలో వృద్ధ తల్లిదండ్రులను చూసుకోవాల్సివచ్చే పిల్లలు పదేపదే సెలవులు పొందలేక ఉద్యోగాలనే వదిలేయాల్సి వస్తున్నది. దీంతో ఆయా కుటుంబాలు సంక్షోభంలో చిక్కుకొంటున్నాయి. తల్లిదండ్రుల సంరక్షణ కోసం పిల్లలు తమ ఉద్యోగాలను వదిలేయాల్సిన పరిస్థితి తలెత్తడం చాలా బాధాకరం. అయినప్పటికీ తల్లిదండ్రుల కోసం ఉద్యోగాలకు రాజీనామా చేస్తున్న పిల్లల తెగువకు ధన్యవాదాలు తెలుపాల్సిందే. అనారోగ్యంతో బాధపడుతున్న వృద్ధులను ఒంటరితనం నుంచి కాపాడేందుకు వీలుగా వారి కుటుంబసభ్యులకు తరచుగా సెలవు ఇచ్చే విధానాన్ని తీసుకురావాలి. తద్వారా వారు తమ తల్లిదండ్రులతో గడిపేందుకు వీలుంటుంది. ముఖ్యంగా క్యాన్సర్, డిమెన్షియా లాంటి తీవ్రమైన వ్యాధులతో బాధపడుతున్న లేదా పెద్దపెద్ద శస్త్రచికిత్సలు చేయించుకొన్న వృద్ధుల పిల్లలకు ప్రత్యేక సెలవు ఇచ్చే నిబంధన ఉండాలి. కనుక ఇందుకు సంబంధించిన విధివిధానాలను రూపొందించాల్సిందిగా ప్రభుత్వ విభాగాలను, అధికారులను ఆదేశించాలని మీకు విజ్ఞప్తి చేస్తున్నా' అని డాక్టర్ విజయ్ గుర్జర్ ప్రధానికి రాసిన లేఖలో పేర్కొన్నారు.

## ఎన్నారై విధానం గొప్ప నిర్ణయం

సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు: టీఆర్‌ఎస్ ఎన్నారై కోఆర్డినేటర్ మహేశ్ బిగాల

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఎన్నారై విధానం ఏర్పాటుకు తీసుకున్న నిర్ణయం ఎంతో గొప్పదని, సీఎం కేసీఆర్ నిర్ణయాన్ని ఎన్నారైలందరూ స్వాగతిస్తున్నారని టీఆర్‌ఎస్ ఎన్నారై కోఆర్డినేటర్ మహేశ్ బిగాల చెప్పారు. దేశంలోనే సమగ్ర విధానమవుతుందని విశ్వాసం వ్యక్తంచేశారు. గల్ఫ్ ఎన్నారైలను తెలంగాణకు రప్పించడానికి సీఎం కేసీఆర్ త్వరలో గల్ఫ్ దేశాలు పర్యటించనున్న సందర్భంగా మహేశ్ ఆదివారం అమెరికాలో మీడియాతో మాట్లాడుతూ.. ఎన్నారై విధానం కోసం ప్రత్యేక బృందాన్ని కేరళకు పంపిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నారై విధానంపై చర్చ మొదలుకాకముందే దుబాయ్ ప్రభుత్వం క్షమాభిక్ష ప్రకటించిన సమయంలో సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు 600 మందిని తెలంగాణకు రప్పించామని చెప్పారు. హుజూర్‌నగర్ ఉపఎన్నికలో ఎన్నారై సైదిరెడ్డికి రెండోసారి టికెట్ ఇవ్వడం ఎన్నారైలందరూ గౌరవంగా భావిస్తున్నట్టు తెలిపారు. ఎన్నారైలు తమవంతు పాత్ర పోషించి సైదిరెడ్డిని గెలిపించాలని, బంధుమిత్రులకు ఫోన్‌లో ప్రచారం చేయాలని, సోషల్‌మీడియాలో చేరువగా ఉండాలని సూచించారు. వీలైన ఎన్నారైలు హుజూర్‌నగర్‌కు వచ్చి ప్రచారం నిర్వహించాలని పిలుపునిచ్చారు. తెలంగాణకు తిరిగిరాగానే సీఎం కేసీఆర్‌ను కలిసి గల్ఫ్ బాధితుల సమస్యలపై వినతిపత్రం ఇస్తామని తెలిపారు. సమావేశంలో టీఆర్‌ఎస్ యూఎస్‌ఏ కన్వీనర్ శ్రీనివాస్ గనగోని, నాయకులు దేవేందర్ నల్లమాడ, శ్రీనివాస్ ఎం, వెంకట్ గజ్జల పాల్గొన్నారు.

## గురునానక్ జయంత్యుత్సవాలకు ఏర్పాట్లు

- 270 ఎకరాల్లో తాత్కాలిక టెంట్ సిటీ నిర్మాణం
- 15 నుంచి 20 లక్షల మంది భక్తులు హాజరుకావొచ్చని అంచనా



**చండీగఢ్, అక్టోబర్ 13:** సిక్కుల గురువు గురునానక్ దేవ్ 550 జయంత్యుత్సవాలను పురస్కరించుకొని పంజాబ్‌లో భారీ ఏర్పాట్లు జరుగుతున్నాయి. సుల్తాన్‌పూర్ లోధి ప్రాంతంలో 270 ఎకరాల్లో టెంట్లు వేసి తాత్కాలిక నగరాన్ని ఏర్పాటుచేస్తున్నారు. టెంట్ సిటీగా పిలిచే ఈ నగరంలో అతిథులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు సాగుతున్నాయి. వచ్చే నెల 12న జరుగనున్న గురునానక్ జయంత్యుత్సవాలకు హాజరుకావడానికి దేశ, విదేశాల నుంచి లక్షలమంది భక్తులు పంజాబ్‌కు రానున్నారు. దాదాపు 35 వేల మందికి వసతి కల్పించేలా టెంట్ సిటీని నిర్మిస్తున్నారు. ఇందులో 367 పెద్ద వసతిగృహాలు (ఒక్కోదానిలో 60 మంది వరకు ఉండొచ్చు), 600 చిన్న వసతిగృహాలు (ఒక్కోదానిలో 15 మంది ఉండొచ్చు), 776 కుటుంబ వసతి గృహాలు (ఒక్కో దానిలో నలుగురు ఉండొచ్చు), 476 అతిచిన్న వసతిగృహాలు (ఒక్కో దానిలో ఇద్దరు ఉండొచ్చు) ఉన్నాయి. వీఐపీలకు ప్రత్యేక వసతిగృహాలను ఏర్పాటు చేస్తున్నారు. కమ్యూనిటీ కిచెన్ గది కూడా ఉండనుంది. నిరంతర విద్యుత్ సదుపాయం, స్వచ్ఛమైన తాగునీరు, 250 సీసీటీవీ కెమెరాలను నిర్వాహకులు ఏర్పాటు చేస్తున్నారు. నిర్వాహకుల్లో ఒకరైన శర్మ మాట్లాడుతూ 90 శాతం పనులు పూర్తయ్యాయని చెప్పారు. జయంత్యుత్సవాలను పురస్కరించుకొని చేపట్టే సాంస్కృతిక కార్యక్రమాలు 4వ తేదీ నుంచే ప్రారంభమవుతాయన్నారు. టెంట్ సిటీలో వసతి కావాలనుకునేవారు వచ్చేనెల 1 నుంచి ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఉత్సవాలకు హాజరుకావడానికి 15 నుంచి 20 లక్షల మంది రావొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇంతమందికి టెంట్ సిటీలో వసతి కల్పించడం కష్టం కాబట్టి వేదిక చుట్టుపక్కల గ్రామాల్లోనూ వసతి కల్పించాలని అధికారులు నిర్ణయించారు. మరోవైపు సదుపాయాల కోసం పంజాబ్ ప్రభుత్వం రూ.300 కోట్లను కేటాయించింది. జయంత్యుత్సవాలకు హాజరుకావాలంటూ ప్రముఖులకు ఆహ్వానాలు కూడా వెళ్లాయి.

## మోదీ తమ్ముడి కూతురు పర్సు కాజేసిన వ్యక్తి అరెస్ట్

**న్యూఢిల్లీ:** ప్రధాని నరేంద్రమోదీ తమ్ముడి కూతురు పర్సును ఎత్తుకెళ్లిన దొంగల్లో ఒకరిని ఢిల్లీ పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకొన్నారు. దొంగను హర్యానాలోని సోనిపట్‌లో అరెస్ట్‌చేశారు. అమృత్‌సర్‌నుంచి శనివారం న్యూఢిల్లీ వచ్చిన మోదీ తమ్ముడు ప్రహ్లాద్‌మోదీ కుమార్తె దమయంతి బెన్ మోదీ.. నార్త్ ఢిల్లీలోని సివిల్ లైన్స్ ఏరియాలోని గుజరాతీ సమాజ్ భవన్ వద్ద ఆటో దిగి వెళ్తుండగా బైక్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు ఆమె చేతి బ్యాగును లాక్కొని పరారయ్యారు. బ్యాగులో రూ.50వేల నగదు, రెండు మొబైల్‌ఫోన్లు, ఇతరపత్రాలు ఉన్నాయని ఫిర్యాదు చేశారు. సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా.. స్నాచింగ్‌కు పాల్పడిన గౌరవ్ అలియాస్ నానిని అరెస్టుచేసి, బైక్‌ను స్వాధీనం చేసుకొన్నారు. బాదల్ అనే మరోవ్యక్తిని పట్టుకుంటామని నార్త్‌ఢిల్లీ డీసీపీ మౌనికా భరద్వాజ్ చెప్పారు.

## గ్యాస్ సిలిండర్ పేలి 9 మంది మృతి

చైనాలో దుర్ఘటన

**బీజింగ్, అక్టోబర్ 13:** చైనాలో గ్యాస్ సిలిండర్ పేలి 9 మంది మరణించారు. 10 మంది గాయపడ్డారు. ఈ దుర్ఘటన ఆదివారం ఉదయం జియాంగ్సూ రాష్ట్రంలోని యూక్సి నగరంలో చోటుచేసుకుంది. ఒక రెస్టారెంట్‌లో ఈ పేలుడు సంభవించడంతో అది ధ్వంసమవడమే కాకుండా దాని చుట్టుపక్కల ఉన్న దుకాణాలు కూడా దెబ్బతిన్నాయి. దీంతో 9 మంది ప్రాణాలు కోల్పోయారు. గాయపడిన 10 మంది ఆరోగ్యం నిలకడగా ఉన్నది. విషయం తెలిసిన వెంటనే సహాయక సిబ్బంది అక్కడికి చేరుకొని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.

నమస్తే తెలంగాణ
# చిత్రం
[ కరీంనగర్ ]
సోమవారం 14 అక్టోబర్ 2019

## వినోదాల హంగామా


మహేష్‌బాబు

మహేష్‌బాబు కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'సరిలేరు నీకెవ్వరు'. అనిల్ రావిపూడి దర్శకుడు. దిల్‌రాజు సమర్పణలో రామబ్రహ్మం సుంకర నిర్మిస్తున్నారు. రష్మిక మందన్న కథానాయిక. ప్రస్తుతం హైదరాబాద్‌లో చిత్రీకరణ జరుగుతున్నది. సంక్రాంతి కానుకగా జనవరి 12న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయబోతున్నారు. దర్శకుడు చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'ఈ సినిమాలో మహేష్‌బాబు సైనికుడి పాత్రలో కనిపిస్తాడు. లక్ష్యం కోసం అతను చేసిన పోరాటమేమిటన్నది ఆసక్తికరంగా అనిపిస్తుంది. యాక్షన్ కలబోసిన వినోదాత్మక చిత్రమిది. సంక్రాంతికి మీ అందరికి నవ్వుల్ని పంచుతుంది' అన్నారు. ఈ సినిమాలో విజయశాంతి ప్రత్యేక పాత్రలో నటిస్తున్నది. రాజేంద్రప్రసాద్, ప్రకాష్‌రాజ్, సంగీత, బండ్ల గణేష్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: దేవిశ్రీప్రసాద్.

## జాను ప్రణయగాథ


సమంత

తమిళంలో హృద్యమైన ప్రేమకథగా ప్రేక్షకాదరణ చూరగొన్న '96' చిత్రం తెలుగులో రీమేక్ అవుతున్న విషయం తెలిసిందే. శర్వానంద్, సమంత జంటగా నటిస్తున్నారు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్‌రాజు నిర్మిస్తున్నారు. షూటింగ్ పూర్తయింది. ఈ సందర్భంగా సమంత ట్విట్టర్ ఖాతాలో సినిమాలో తన లుక్‌కు సంబంధించిన ఫొటోను పోస్ట్ చేసింది. 'నా కెరీర్‌లో మరో ప్రత్యేకమైన చిత్రమిది. సవాలుతో కూడిన ఈ పాత్ర నాలో మరింత పరిణితి కలిగించింది. జీవితాన్ని ఉత్తమంగా గడుపుతున్నందుకు సంతోషంగా ఉంది' అంటూ సినిమాలో తన పాత్ర పేరు జానుతో కూడిన హ్యాష్‌టాగ్‌ను జతచేసింది. తమిళంలో విజయ్‌సేతుపతి, త్రిష జోడీగా నటించిన '96' చిత్రం ప్రేమ ప్రయాణంలోని జ్ఞాపకాలకు అందమైన దృశ్యరూపంగా ప్రేక్షకుల హృదయాల్ని స్పృశించింది. తెలుగు రీమేక్‌లో నేటివిటీకి అనుగుణంగా కొన్ని మార్పులు చేశారు. తమిళ మాతృక దర్శకుడు ప్రేమ్ కుమార్ తెలుగు రీమేక్ నిర్దేశక బాధ్యతల్ని నిర్వర్తించారు.

## సంక్రాంతి బరిలో..


అల్లు అర్జున్

అల్లు అర్జున్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'అల వైకుంఠపురములో'. త్రివిక్రమ్ దర్శకత్వం వహిస్తున్నారు. హారిక అండ్ హాసిని క్రియేషన్స్, గీతా ఆర్ట్స్ పతాకాలపై ఎస్.రాధాకృష్ణ(చినబాబు), అల్లు అరవింద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సంక్రాంతి కానుకగా 2020 జనవరి 12న ఈ చిత్రం విడుదలకానుంది. తాజాగా అల్లు అర్జున్ కొత్త లుక్‌ను చిత్రబృందం విడుదలచేసింది. ఇందులో ఓ చేతిలో కత్తి, మరో చేతిలో కోడిపుంజు పట్టుకొని తలపాగా ధరించి మాస్ లుక్‌లో కనిపిస్తున్నారు అల్లు అర్జున్. నిర్మాతలు మాట్లాడుతూ 'అల్లు అర్జున్, త్రివిక్రమ్ కలయికలో రూపొందుతున్న హ్యాట్రిక్ చిత్రమిది. కుటుంబ విలువలు, వినోదం సమ్మిళితంగా ఉంటుంది. అల్లు అర్జున్ పాత్ర వినూత్న పంథాలో సాగుతుంది. ఇటీవల విడుదలచేసిన 'సామజవరగమన' పాటతో పాటు ప్రచార చిత్రంతో సినిమాపై అంచనాలు పెరిగాయి. ప్రస్తుతం అల్లు అర్జున్‌తో పాటు ప్రధాన తారాగణంపై హైదరాబాద్‌లో కీలక సన్నివేశాల్ని చిత్రీకరిస్తున్నాం' అని తెలిపారు. రాజేంద్రప్రసాద్, టబు, సచిన్ ఖేడ్కర్, తనికెళ్ల భరణి, మురళీశర్మ, సముద్రఖని, సునీల్, నవదీప్, సుశాంత్, నివేథా పేతురాజ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: పి.ఎస్.వినోద్, సంగీతం: ఎస్.ఎస్.తమన్, ఎడిటర్: నవీన్ నూలి, ఆర్ట్: ఏ.ఎస్.ప్రకాష్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: పి.డి.వి.ప్రసాద్.

**'నా కెరీర్‌లో 'రాజుగారి గది 3' చిత్రానికి ఎంతో ప్రత్యేకత ఉంది. చక్కటి భావోద్వేగాల మేళవింపుతో నా పాత్రను దర్శకుడు ఉత్తమంగా తీర్చిదిద్దాడు' అని అన్నారు ప్రముఖ హాస్యనటుడు అలీ. ఆయన కీలక పాత్రలో నటిస్తున్న 'రాజుగారి గది 3' చిత్రం ఈ నెల 18న ప్రేక్షకులముందుకురానుంది. ఈ సందర్భంగా ఆదివారం అలీ పాత్రికేయులతో సంభాషించారు. ఆయన చెప్పిన సంగతులివి..**

## భయపెట్టే దెయ్యాలు నవ్విస్తున్నాయి!


అలీ

నేను ఇప్పటివరకు చేసిన చిత్రాల్లో పూర్తి భిన్నమైన పాత్ర ఇది. 'ఈ సినిమా కథ ఎక్కువ రాత్రివేళలో జరుగుతుంది. ఈ పాత్ర మీరు చేస్తేనే బాగుంటుంది' అని దర్శకుడు ఓంకార్ నన్ను అడిగారు. సబ్జెక్ట్ బాగా నచ్చడంతో మరో ఆలోచన లేకుండా అంగీకరించాను. నా పాత్ర గురించి రివీల్ చేయలేను. తెరపై చూస్తేనే బాగుంటుంది. హీరో పక్కన ఉంటూ నవ్విస్తూ భయపెడుతుంటాను. దర్శకుడు ఓంకార్‌కు ప్రతి విషయంలో స్పష్టత ఉంది. మొదటి రెండు భాగాల కంటే ఈ సినిమాను అద్భుతంగా తీశాడు. రెండున్నరగంటల పాటు ప్రేక్షకుల్ని కడుపుబ్బా నవ్వించే చిత్రమవుతుంది. ఒకప్పుడు సినిమాల్లో దెయ్యాలంటే భయపడిపోయేవాళ్లం. ఇప్పుడు నవ్వుకుంటూ దెయ్యాల్ని చూస్తున్నాం.

**దర్శకులు చెప్పినట్లు చేయాలి..**

'రాజుగారి గది 3' షూటింగ్ చేస్తున్నప్పుడే ఏ స్థాయిలో వినోదం పండిందో అర్థమయింది. థియేటర్లో ప్రేక్షకులు అంతకుమించి హాస్యాన్ని ఆస్వాదిస్తారు. ఇప్పుడున్న కమెడియన్స్ దర్శకుల వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటున్నారు. అది సరైన ధోరణి కాదు. దర్శకులు చెప్పింది చేయగలిగాం కాబట్టే నాతో పాటు నా సమకాలీన హాస్యనటులు మంచి పేరు తెచ్చుకోగలిగారు. పాత్రలో బెటర్‌మెంట్ కోసం దర్శకుడికి సూచనలు చేయడం మంచిదే కానీ..పూర్తిగా జోక్యం చేసుకోవడం తగదు. నవరసాన్ని అద్భుతంగా పండిచేవాళ్లే గొప్ప నటులు అవుతారు.

## పది కాలాలు దాచుకునేలా..


విశ్వంత్, రాజేంద్రప్రసాద్, హర్షిత, విశ్వనాథ్

'ప్రతి ఒక్కరూ తమ ఇంట్లో పదికాలాల పాటు దాచుకొనే గొప్ప చిత్రమిది. ఇందులో నేను పోషించిన సోడాలరాజు పాత్ర నా కెరీర్‌లో అద్భుతమైన క్యారెక్టర్స్‌లో ఒకటిగా మిగిలిపోతుంది' అని అన్నారు రాజేంద్రప్రసాద్. ఆయన ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'తోలుబొమ్మలాట'. విశ్వంత్, హర్షిత చౌదరి జంటగా నటించారు. విశ్వనాథ్ మాగంటి దర్శకుడు. దుర్గాప్రసాద్ మాగంటి ఈ చిత్రాన్ని నిర్మించారు. ఆదివారం హైదరాబాద్‌లో చిత్రబృందం పాత్రికేయుల సమావేశాన్ని ఏర్పాటుచేసింది. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ 'లేడీస్ టైలర్, ఆ నలుగురు లాంటి గొప్ప సినిమాలు నా కెరీర్‌లో మళ్లీ చేయగలనా అనుకున్నాను. కానీ ఈ కథ వినగానే నటుడిగా రిలాక్స్ అవ్వకూడదు. ఒళ్లు దగ్గరపెట్టుకొని పనిచేయాలని అర్థమైంది. స్నేహం గొప్పతనాన్ని చాటిచెప్పే చక్కటి కథ ఇది. కుటుంబ విలువల ప్రధానంగా సాగుతుంది. నటీనటులంతా తమ పాత్రల్లో ఒదిగిపోయారు' అని తెలిపారు. స్నేహానికి నిర్వచనంగా నిలిచే మంచి చిత్రమిదని, కథ వినగానే కన్నీళ్లు వచ్చాయని సీనియర్ నటుడు నారాయణరావు పేర్కొన్నారు. ఓ కుటుంబంలో ఉండే కోపాలు, బాధలు, ఆనందాలకు దృశ్యరూపంగా ఈ సినిమా ఉంటుందని దర్శకుడు పేర్కొన్నారు. నటుడిగా తనకు గౌరవాన్ని తెచ్చిపెట్టే చిత్రమిదని విశ్వంత్ చెప్పారు. కమర్షియల్ విలువలతో కూడిన కథాబలమున్న చిత్రమిదని హర్షిత చెప్పింది. ఈ కార్యక్రమంలో చైతన్యప్రసాద్, సురేష్‌బొబ్బిలి, దేవిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## వెతుక్కుంటూ వస్తున్నాయి!


తాప్సీ

పంజాబీ సుందరి తాప్సీ కెరీర్ జోరుమీదుంది. దక్షిణాదితో పాటు బాలీవుడ్ చిత్రసీమలో వరుస విజయాలతో దూసుకుపోతున్నది. దర్శకనిర్మాతలు ఆమె డేట్స్‌కోసం ఎదురుచూసే పరిస్థితి ఉందంటున్నారు. ఇంతటి స్టార్‌డమ్ సంపాదించుకున్నా పారితోషికం విషయంలో తాను పట్టువిడుపుల ధోరణి ప్రదర్శిస్తానని చెబుతున్నది తాప్సీ. ఆమె మాట్లాడుతూ 'గత రెండేళ్లుగా మంచి విజయాలు దక్కాయి. పారితోషికం కూడా పెరిగింది. అయితే నా సహనటులతో పోల్చితే తక్కువ రెమ్యునరేషన్‌నే అందుకుంటున్నాను. నా అభినయానికి ప్రశంసలు దక్కడమే గొప్ప విజయంగా భావిస్తాను. అందుకే డబ్బులు బాగా సంపాదించాలనే కోరిక లేదు. రెమ్యునరేషన్ భారీగా పెంచి నిర్మాతల్ని కష్టపెట్టడం ఇష్టం లేదు. ఒకప్పుడు అవకాశాల కోసం ఎదురుచూసేదాన్ని. ఇప్పుడు సినిమాలే నన్ను వెతుక్కుంటూ వస్తున్నాయి. కొన్ని పాత్రలు నేను మాత్రమే చేయగలనని దర్శకనిర్మాతలు చెబుతుండటం గర్వంగా అనిపిస్తున్నది' అని చెప్పింది తాప్సీ. ఆమె ప్రధాన పాత్రలో నటించిన హిందీ చిత్రం 'సాండ్ కీ ఆంఖ్' ఈ దీపావళికి ప్రేక్షకులముందుకు రానుంది.

## చిరంజీవి స్ఫూర్తితో..


రాకేష్

'చిరంజీవి నా అభిమాననటుడు. ఆయన నటించిన 'జగదేకవీరుడు అతిలోక సుందరి' స్ఫూర్తితో హీరో కావాలని నిర్ణయించుకున్నాను' అని అన్నారు రాకేష్ వర్రె. ఆయన కథానాయకుడిగా నటిస్తూ నిర్మించిన చిత్రం 'ఎవ్వరికీ చెప్పొద్దు'. బసవ శంకర్ దర్శకుడు. దిల్‌రాజు ఈ సినిమాను విడుదలచేశారు. ఇటీవలే ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఆదివారం హైదరాబాద్‌లో రాకేష్ పాత్రికేయులతో ముచ్చటిస్తూ 'సినిమాకు చక్కటి స్పందన లభిస్తున్నది. కుటుంబ ప్రేక్షకులతో పాటు యువతను దృష్టిలో పెట్టుకొని ఈ సినిమాను రూపొందించాం. వారు ఆదరిస్తున్నారు. క్యాస్ట్ ఫీలింగ్ అనేది చాలా సున్నితమైన అంశం. ఈ పాయింట్‌తో సినిమా చేయడం రిస్క్ అయినా వినోదాత్మక పంథాలో తటస్థంగా ఆవిష్కరించిన విధానం బాగుందని అంటున్నారు. ఈ సినిమాకు ముందు 47 కథల్ని విన్నాను. ఏది నచ్చలేదు. బసవశంకర్ ప్రతిభను గురించి తెలుసుకొని నాతో సినిమా చేయమని అడిగాను. ఈ కథ వినిపించారు. కులంతో ముడిపడిన అంశం కావడంతో సినిమాను నిర్మించడానికి ఎవరూ ముందుకురాలేదు. దాంతో నేనే నిర్మాతగా మారి తెరకెక్కించాను. మంచి సినిమాను ప్రేక్షకులకు అందించాలనే ఆలోచనతో దిల్‌రాజు విడుదలచేశారు. సుకుమార్, కొరటాల శివ సినిమా చూసి బాగుందని ప్రశంసించారు. 'జోష్'తో నటుడిగా నా ప్రయాణం ప్రారంభమైంది. వేదం, బద్రినాథ్, మిర్చి, బాహుబలి, గూఢచారి సినిమాలు చేశాను. తదుపరి సినిమాపై ఇంకా నిర్ణయానికి రాలేదు.హీరోగానే కాకుండా విలన్‌గా నటించడానికి సిద్ధంగా ఉన్నాను' అని తెలిపారు.

## ప్రేమయుద్ధం


షా, రాజ్

రాజ్, షా జంటగా నటిస్తున్న చిత్రం 'రణస్థలం'. ఆది అరవల దర్శకుడు. కావాలి రాజు నిర్మిస్తున్నారు. ఈ చిత్ర ఫస్ట్‌లుక్‌ను ఆదివారం హైదరాబాద్‌లో విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి విడుదలచేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ 'సాధారణ స్థాయి నుంచి నిర్మాతగా ఎదిగాడు రాజు. అతడు నిర్మించిన ఈ చిత్రం పెద్ద విజయాన్ని సాధించాలి' అని అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ 'కథే ఈ సినిమాకు హీరో. ప్రేమ యుద్ధంలో ఓ యువకుడు ఎలా విజయతీరాలకు చేరాడన్నది ఆసక్తిని పంచుతుంది' అని తెలిపారు. ప్రస్తుతం సెన్సార్ జరుగుతున్నదని, నవంబర్ మొదటి వారంలో సినిమాను విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామని నిర్మాత పేర్కొన్నారు. సత్యంరాజేష్, ఛత్రపతి శేఖర్, రాగిణి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి రాజకిరణ్, కెమెరా:ప్రభాకర్.

## కొరియోగ్రాఫర్ శ్రీనుమాస్టర్ కన్నుమూత



సీనియర్ కొరియోగ్రాఫర్ శ్రీనుమాస్టర్(82)చెన్నైలోని టీ నగర్‌లో ఉన్న స్వగృహంలో ఆదివారం గుండెపోటుతో కన్నుమూశారు. తెలుగుతో పాటు వివిధ భాషల్లో 1700లకు పైగా చిత్రాలకు ఆయన నృత్యరీతుల్ని సమకూర్చారు. ఆదోని ఆయన స్వస్థలం. లక్ష్మీదేవమ్మ, నారాయణప్ప దంపతులకు జన్మించారు శ్రీనుమాస్టర్. 1956లో తన బావగారైన హీరాలాల్ మాస్టర్ వద్ద శిష్యుడిగా ఆయన ప్రస్థానం ప్రారంభమైంది. 1969లో నిర్మాత డూండి రూపొందించిన 'నేనంటే నేనే' సినిమాతో నృత్య దర్శకుడిగా శ్రీనుమాస్టర్ అరంగేట్రం చేశారు. మహాబలుడు, భక్తకన్నప్ప, దొరబాబు, ఎదురులేని మనిషి, యుగపురుషుడు, యుగంధర్ చిత్రాలతో తెలుగు చిత్రసీమలో కొరియోగ్రాఫర్‌గా శ్రీనుమాస్టర్ పేరు మారుమ్రోగిపోయింది. ఈ విజయాలతో డ్యాన్స్‌మాస్టర్‌గా స్థిరపడిపోయారాయన. స్వర్ణకమలం, రాధాగోపాలం, శ్రీరామరాజ్యం చిత్రాలకు గాను ఉత్తమ కొరియోగ్రాఫర్‌గా నంది పురస్కారాలను అందుకున్నారు. శ్రీనుమాస్టర్‌కు భార్య ఉమాదేవి, ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. ఆయన కుమారుడు విజయ్ శ్రీనివాస్ దర్శకత్వ శాఖలో పనిచేస్తున్నారు. ఆదివారం శ్రీనుమాస్టర్ అంత్యక్రియలు చెన్నైలో జరిగాయి.

## వాయిదాల సరదాలు


భానుశ్రీ

భానుశ్రీ, నోయల్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'ఇ.ఎం.ఐ'. దొంతు రమేష్ దర్శకుడు. దొంతు బుచ్చయ్య, సంగీత బమ్మిడి నిర్మిస్తున్నారు. ఈ చిత్ర ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను ఇటీవల హైదరాబాద్‌లో ప్రతాని రామకృష్ణగౌడ్ విడుదలచేశారు. ఈ సందర్భంగా భానుశ్రీ మాట్లాడుతూ 'మహిళా ప్రధాన ఇతివృత్తంతో రూపొందుతున్న చిత్రమిది. ఇ.ఎం.ఐల కారణంగా ప్రస్తుతం మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల నేపథ్యంలో వినోదాత్మకంగా సాగుతుంది. చిత్రీకరణ తుదిదశకు చేరుకున్నది. కొంత ప్యాచ్ వర్క్‌తో పాటు పాటలు బ్యాలెన్స్‌గా ఉన్నాయి' అని అన్నారు. త్వరలో బ్యాంకాక్‌లో పాటల్ని చిత్రీకరిస్తామని దర్శకుడు తెలిపారు. నిర్మాత మాట్లాడుతూ 'వైవిధ్యమైన కథాంశంతో రూపొందుతున్న చిత్రమిది. భావోద్వేగాలు, వినోదం సమాహారంగా రూపొందిస్తున్నాం. త్వరలో సినిమాను విడుదలచేస్తాం' అని పేర్కొన్నారు.

## మహిళా అఘోరా కథ


రాధిక కుమారస్వామి

రమేష్ అరవింద్, రాధిక కుమారస్వామి, బొమ్మాలి రవిశంకర్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'భైరాదేవి'. రాధిక కుమారస్వామి నిర్మాత. శ్రీజై దర్శకత్వం వహించారు. నవంబర్‌లో ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకురానుంది. దర్శకుడు మాట్లాడుతూ 'మహిళా అఘోరాల ఇతివృత్తంతో వెండితెరపై రానున్న తొలి సినిమా ఇది. హారర్ సస్పెన్స్ థ్రిల్లర్ అంశాలతో ఉత్కంఠను పంచుతుంది. కన్నడ, తెలుగు, తమిళ భాషల్లో ఏకకాలంలో సినిమాను రూపొందిస్తున్నాం. ప్రస్తుతం గ్రాఫిక్స్‌కు సంబంధించిన పనుల్ని జరుపుతున్నాం. త్వరలో ఆడియోను విడుదలచేస్తాం' అని తెలిపారు. రఘు, మాళవిక అవినాష్, స్కంద అశోక్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: కె.కె. సెంథిల్ ప్రశాంత్, ఛాయాగ్రహణం: జె.ఎస్.వాలి.

## ప్రతినాయిక ఛాయలతో..


ముస్కాన్ సేథ్

'పైసా వసూల్' చిత్రం ద్వారా తెలుగు చిత్రసీమలోకి అరంగేట్రం చేసిన ముస్కాన్ సేథ్ తన అందచందాలతో యువతరాన్ని ఆకట్టుకుంది. ప్రస్తుతం ఈ సొగసరి 'రాగల 24గంటల్లో' చిత్రంలో ఓ కథానాయికగా నటిస్తోంది. శ్రీనివాసరెడ్డి దర్శకుడు. ఈ చిత్రంలో ముస్కాన్‌సేథ్ ఔత్సాహిక మోడల్ పాత్రలో కనిపించనుంది. ఈ సినిమా గురించి ఆమె మాట్లాడుతూ 'సస్పెన్స్ థ్రిల్లర్ కథాంశమిది. ఓ ఇంటిలో జరిగిన సంఘటన చుట్టూ అల్లుకున్న మిస్టరీ ఏమిటి? దానిని ఏ విధంగా ఛేదించారు? అన్నది ఉత్కంఠగా పంచుతుంది. ఈ సినిమాలో నేను మోడలింగ్ రంగంలో ఉన్నత శిఖరాల్ని అధిరోహించాలని తపించే అమ్మాయిగా కనిపిస్తాను. ఓ అడ్వర్టైజింగ్ సంస్థ అధినేతతో నాకు ఏర్పడిన పరిచయం మా ఇద్దరి జీవితాల్ని ఏ విధంగా ప్రభావితం చేసిందన్నది ఆసక్తికరంగా ఉంటుంది. ఈ సినిమాలో నేను కొన్ని పోరాట ఘట్టాల్లో నటించాను. వాటికోసం చాలా శ్రమించాను. నా పాత్రలో కొంచెం నెగెటివ్ ఛాయలు కనిపిస్తాయి. నా కెరీర్‌లో మంచి గుర్తింపునిచ్చే చిత్రమవుతుంది' అని తెలిపింది. దీపావళి సందర్భంగా ఈ చిత్రం ప్రేక్షకులముందుకురానుంది.